www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 28-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 120 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.11.25 తదుపరి పంచమి, నక్షత్రం: పుబ్బ సా.5.36 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.1.21-3.05, దుర్ముహూర్తం: మ.12.47-1.38, మ.3.21-4.12, అమృతఘడియలు: ఉ.10.52-12.33, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.46 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు


నేటి మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ

ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గర.. బిల్లులు కేంద్రం వద్ద.. ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించి నిర్ణయం?

కులగణన, రేషన్‌కార్డుల పంపిణీ, యూరియా నిల్వలు, సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక అందితే దానిపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపే అవకాశం!



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ.. దీనికి ముడిపడి ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సోమవారం మంత్రివర్గ భేటీలో కీలక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ రాజ్‌భవన్‌లోనే ఉంది. అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లులపై ఏ నిర్ణయమూ వెలువడలేదు. మరోవైపు రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. ఏడాదిన్నరకు పైగా స్థానిక ఎన్నికలు జరగక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. వీటన్నింటి నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై మంత్రివర్గం చర్చించనున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ల విషయంలో జాప్యం జరుగుతుండటంతో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయమేదైనా తీసుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కులగణనపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ.. ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీనిపై మంత్రివర్గ భేటీలో చర్చించి.. నివేదికలోని వివరాలను వెల్లడించే అవకాశం ఉందని

మిగతా 13వ పేజీలో...



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ రష్మి

సంతాన సాఫల్యం ముసుగులో
శిశు విక్రయం!

సరగసీ పద్ధతిలో సంతానమంటూ పిల్లల్లేని జంటల నుంచి 35లక్షలు వసూలు

వేరే పిల్లాణ్ని కొని.. వీరికి అమ్మిన వైనం

బిడ్డను అమ్ముకున్న జంటకు 80-90వేలే!

సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలి నిర్వాకాలను వెల్లడించిన డీసీపీ రష్మి

నమ్రత, ఆమె కొడుకు సహా 8మంది అరెస్టు

'సృష్టి ఫర్టిలిటీ'పై తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 10కి పైగా కేసులు

హైదరాబాద్‌సిటీ/అడ్డగుట్ట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'యూనివర్సల్ సృష్టి ఫర్టిలిటీ సెంటర్' కేసులో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది! సరగసీ (అద్దె గర్భం) లేదు.. దాతల నుంచి వీర్యం సేకరించీ కాదు.. ఆ సెంటర్ నిర్వాహకులు శిశువిక్రయాలకు పాల్పడుతున్నారని పోలీసు దర్యాప్తులో వెల్లడైంది. పిల్లల్లేని దంపతులకు సరగసీ విధానంలో సంతాన భాగ్యం కల్పిస్తానంటూ నమ్మబలికిన 'సృష్టి' నిర్వాహకురాలు నమ్రత (64).. వారి నుంచి వీర్యం, అండం సేకరించి హడావుడి చేసి, చివరకు వేరెవరికో పుట్టిన బిడ్డను కొని, వారికి అమ్మినట్టు తేలింది. మోసపోయిన ఆ దంపతుల

మిగతా 14వ పేజీలో...

ప్రైవేటు వైద్య కళాశాలలపై
విజిలెన్స్ విచారణ

వైద్యవిద్యలో నాణ్యత, సదుపాయాలపై ఫిర్యాదులతో సర్కారు నిర్ణయం

ఇటీవలే మూడు కాలేజీలపై విచారణ.. అవకతవకలు జరుగుతున్నట్టు గుర్తింపు

విద్యార్థుల స్టైపెండ్‌కు ఎగనామం.. అధ్యాపకులు, మౌలిక సదుపాయాల కొరత

17 అంశాలపై వివరాలు ఇవ్వాలని అన్ని ప్రైవేటు కాలేజీలను కోరిన సర్కారు

స్పందించని పలు కాలేజీలు.. ప్రభుత్వం సీరియస్.. విజిలెన్స్ విచారణకు ఆదేశం



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. కళాశాలలపై వచ్చిన ఫిర్యాదులు, ఇప్పటికే కొన్ని కాలేజీల్లో బయటపడిన అవకతవకల నేపథ్యంలో వైద్యవిద్యలో నాణ్యతాప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని తాజాగా చర్యలకు ఉపక్రమించింది. వాస్తవానికి రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ముందు నుంచే ఉన్నాయి. అందులో మూడు కాలేజీలపై కొన్నిరోజుల కింద వైద్య విద్యార్థులు ఫిర్యాదు చేయగా.. సర్కారు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో పలు అవకతవకలను విజిలెన్స్ గుర్తించింది. అధ్యాపకులు లేకపోవడం, కనీస మౌలిక సదుపాయాల కొరతతోపాటు ఏళ్లుగా వైద్య విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వడం లేదని తేల్చి.. సర్కారుకు నివేదిక ఇచ్చింది. సదరు కాలేజీల్లో సీట్ల కోత, అడ్మిషన్ల రద్దుతోపాటు క్రిమినల్ చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. ఈ క్రమంలో మిగతా ప్రైవేటు వైద్య కాలేజీలపై వచ్చిన ఫిర్యాదులపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి అవసరమైన సమాచారం తీసుకోవాలని వైద్యశాఖను ఆదేశించింది. రంగంలోకి దిగిన వైద్య శాఖ.. ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ చికిత్సలు, ప్రసవాలు, శస్త్రచికిత్సలు, డయాగ్నస్టిక్స్ సేవలు, పడకలు, ఇతర సదుపాయాలు, వైద్య పరికరాలు, అధ్యాపకుల సంఖ్య, వారి హాజరు, విద్యార్థుల వివరాలు సహా 17 అంశాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కాలేజీలను కోరింది. ప్రభుత్వం మొత్తం 29 కాలేజీలను ఈ వివరాలివ్వాలని కోరింది. అందులో 15 కాలేజీలు స్పందించగా, 6 కాలేజీలు కొత్తగా వచ్చామని, నాలుగేళ్ల పూర్తి బ్యాచ్‌లు రాలేదని తెలిపాయి. 4 కాలేజీలు అరకొర

మిగతా 14వ పేజీలో...

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ పార్టీ 3

మత్తు కోసం ఏపీ నుంచి నగరానికి..

9 మంది అరెస్టు.. డ్రగ్స్ స్వాధీనం

సీజ్ చేసిన కార్లలో ఒకదానిపై ఎంపీ స్టిక్కర్

బడాబాబుల పిల్లల పాత్రపై అనుమానం



బస్టాండ్‌లో బాలుడిని వదిలి వెళ్లిపోతున్న తల్లి

ఇదేం పని అమ్మా?

కన్నకొడుకుని బస్టాండ్‌లో వదిలేసి..

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడితో వెళ్లిపోయిన తల్లి 14

గంటల వ్యవధిలో ఇద్దరినీ పట్టుకున్న నల్లగొండ పోలీసులు

తండ్రికి బాలుడి అప్పగింత

రవాణా సేవలు భారం

వాహన యాజమాన్య బదిలీకి రెండింతలు పెరిగిన రుసుము 3

గతంలో రూ.935.. ఇప్పుడు రూ.1,805

హైపొథికేషన్ ఫీజుపై రూ.1,000 బాదుడు

రూ.100కు పైనే పెరిగిన లెర్నర్ లైసెన్సు, డ్రైవింగ్ టెస్ట్ ఫీజులు

ప్రకటన లేకుండానే ఆన్‌లైన్‌లో కొత్త ధరలు

ఆదివారం ఉదయం నుంచే అమల్లోకి

మహిళా స్కీమ్ సొమ్ము తినేస్తున్న మగాళ్లు!

మహారాష్ట్రలో 'లడ్కీ బహిన్' కుంభకోణం

లబ్ధిదారులుగా 14,298 మంది పురుషులు.. రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు 2

మహిళలుగా నమోదు చేసుకున్న వైనం

ఇంకా లక్షలాదిగా 'అనర్హ' లబ్ధిదారులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలు



జలాశయాల నిర్వహణలో అలసత్వం!

అరకొర పనులతో మమ అనిపిస్తున్న వైనం

ప్రాజెక్టుల నిర్వహణ లోపభూయిష్ఠం

కీలక ప్రాజెక్టుల విషయంలోనూ నిర్లక్ష్యం

సకాలంలో మరమ్మతులు చేయని యంత్రాంగం

సాగర్ స్పిల్‌వేకు ఈ ఏడాది మరమ్మతులు లేనట్లే

జూరాల ప్రాజెక్టులో తెగిన గేట్ల రోప్‌లు

శ్రీశైలం గేట్లను ఐదేళ్లలో మార్చాలన్న నిపుణులు

'డిండి, శాలిగౌరారం' నిర్వహణా అంతంతే

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ లోపభూయిష్ఠంగా మారింది. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులకూ అవసరమైన మరమ్మతులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. కొన్నిసార్లు రూ.కోట్లు వెచ్చించి మరమ్మతులు చేసినా.. ఉపయోగం లేకుండా పోతోంది. మరికొన్ని సార్లు అరకొర పనులతో మమ అనిపించేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు 66 క్రస్టు గేట్లు ఉండగా.. 2022లో రూ.11 కోట్లతో గేట్ల మరమ్మతుల కోసం టెండర్లు పిలిచారు. 2023లో కొంతమేరకు పనులు చేశారు. అవి వేగంగా పూర్తి కాకపోవడం వల్ల ఇటీవల 8 గేట్లకు సంబంధించిన రోప్‌లు తెగిపోయాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మార్చాల్సిందేనని నిపుణుడు కన్నయ్య నాయుడు స్పష్టం చేశారు. లేదంటే శ్రీశైలానికీ తుంగభద్ర పరిస్థితే ఉత్పన్నమవుతుందని హెచ్చరించారు. గత ఏడాది తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఐదేళ్లలో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను మార్చకపోతే తుంగభద్ర లాంటి పరిస్థితే ఉత్పన్నమయ్యే ముప్పు ఉందని కన్నయ్యనాయుడు హెచ్చరించడం గమనార్హం. ఇక కృష్ణా నదిపై మరో ప్రధాన ప్రాజెక్టు అయిన నాగార్జున సాగర్ స్పిల్‌వేకు కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడం లేదు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రాజెక్టుల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.. తెలుగు రాష్ట్రాల్లో 22 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు లక్షలాది గ్రామాలకు

మిగతా 12వ పేజీలో...



ఈ కారిడార్ ఏంటి? అక్కడ ఆ బకెట్ ఏంటి? అని చూస్తున్నారా? ఇది అల్లాటప్పా బకెట్ కాదండోయ్. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సచివాలయంలోని బకెట్ ఇది. వర్షానికి కారుతున్న నీటిని ఒడిసి పట్టేందుకు అక్కడ పెట్టారు. రాష్ట్ర పరిపాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలోని ఈ విచిత్రం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. మూడో అంతస్తులోని 32వ నంబరు గది ముందు సీసీ కెమెరా పక్క నుంచి కారుతున్న నీటిని ఒడిసి పట్టేందుకు ఇలా బకెట్ ఏర్పాటు చేశారు. సచివాలయంలో డిజైన్ల కోసం అమర్చిన జీఆర్‌సీ ఫ్రేములు పలుచోట్ల ఊడిపడుతుండగా.. ఇప్పుడు వర్షానికి నీళ్లు కారడం విస్మయానికి గురి చేస్తోంది.

మన పండగలు
అంతర్జాతీయ స్థాయిలో!

ప్రపంచ పర్యాటకులకు ఆకర్షించేలా కార్యాచరణ

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, ఆదాయంపై సర్కారు దృష్టి

మేడారం, నాగోబా జాతరలు, బతుకమ్మ, బోనాలు, కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని నిర్ణయం

బతుకమ్మ పండగతోనే ప్రారంభించాలని యోచన!

తొలి దశలో 10 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి!

ఫ్యూచర్‌సిటీలో ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో హోటళ్లు?

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధి

రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతిపాదనలు



ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ (నమూనా)

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. భారతదేశ పర్యాటకానికి తెలంగాణను గమ్యస్థానంగా మార్చాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 'తెలంగాణ పర్యాటక విధానం 2025-2030' తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇతర దేశాల్లో జరిగే పలు అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు, కార్నివాల్స్ లాంటి వాటిని రాష్ట్రంలోనూ నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. బ్రెజిల్‌లో ఏటా ఘనంగా నిర్వహించే 'రియో కార్నివాల్' తరహా కార్యక్రమాలను తెలంగాణలోనూ చేపట్టాలని పర్యాటక శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో నిర్వహించే పండగలు, జాతరల చరిత్రను అంతర్జాతీయ పర్యాటకులకూ తెలిసేలా

మిగతా 13వ పేజీలో...



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి

కవితపై కేసులు ఎత్తేస్తే పార్టీని
విలీనం చేస్తామన్నారు

బీజేపీలో బీఆర్‌ఎస్‌ను కలిపేస్తామన్న కేటీఆర్ ప్రతిపాదన నిజమే

కేటీఆర్‌కు దమ్ముంటే చర్చకు రావాలి

సీఎం రమేశ్‌ను నేను తీసుకొస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితపై కేసులు ఎత్తేస్తే.. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం చేస్తామంటూ ఎంపీ సీఎం రమేశ్ ఎదుట కేటీఆర్ చేసిన ప్రతిపాదన వాస్తవమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. దీనిపై కేటీఆర్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాను వేదిక ఏర్పాటు చేసి సీఎం రమేశ్‌ను తీసుకొస్తానని..

మిగతా 13వ పేజీలో...

మరో పార్టీలో బీఆర్‌ఎస్
విలీనం అవాస్తవం

తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్‌ఎస్ ఉంటుంది

ప్రభుత్వాన్ని నడిపే దమ్ము రేవంత్‌రెడ్డికి లేదు

ఇంత ఇజ్జత్ లేని సీఎంను ఎప్పుడూ చూడలే

మేడిగడ్డ పిల్లర్లు కుంగడం వెనక కాంగ్రెస్ ఉందేమోనని సందేహాలు వస్తున్నాయి

భూపాలపల్లి జిల్లా పార్టీ సమావేశాల్లో కేటీఆర్

భూపాలపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌ను ఏదో పార్టీలోకి విలీనం చేయబోతున్నామంటూ కొందరు



అసత్య ప్రచారం చేస్తున్నారని.. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వాన్ని నడిపే దమ్ము లేదని.. అప్పుల పేరుతో నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి లాంటి ఇజ్జత్ లేని ముఖ్యమంత్రిని తాను ఇంతవరకు చూడలేదని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో

మిగతా 13వ పేజీలో...

హరిద్వార్ మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట

» ఆరుగురి మృతి.. 28 మందికి గాయాలు

» విద్యుత్ వైరు తెగిపడిందన్న ఊహాగానాలతో ఘటన



హరిద్వార్, జూలై 27: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా.. 28 మంది గాయాలపాలయ్యారు. కొండపైన ఉన్న మానసాదేవి అమ్మవారి దర్శనం కోసం ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అదేసమయంలో విద్యుత్ వైరు తెగి పడిందన్న వదంతులు వ్యాపించడంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. 500 అడుగులకు పైగా ఎత్తయిన కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో విద్యుత్తు వైరు తెగి పడిందన్న ఊహాగానాలతో ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారిగా భక్తులు పరుగులు తీశారు. మెట్లపై పెద్ద సంఖ్యలో భక్తులు ఉండడంతో తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 34 మంది గాయపడడంతో ఆస్పత్రికి తరలించినట్లు హరిద్వార్ సీనియర్ ఎస్పీ ప్రేమేంద్ర సింగ్ తెలిపారు. వారిలో ఆరుగురు మరణించారన్నారు. మృతులను ఆరుష్ (12), శకల్‌దేవ్ (18), విక్కీ (18), విపిన్ (18), వకీల్, శాంతిగా గుర్తించినట్లు చెప్పారు. 28 మంది చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

63 జిల్లాల్లో 50% పైగా చిన్నారుల్లో ఎదుగుదల లోపం


న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపం ఆందోళనకరంగా ఉంది. 13 రాష్ట్రాలు, యూటీల్లోని 63 జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల్లో 50 శాతానికి పైగా ఎదుగుదల లోపంలో బాధపడుతున్నారని పార్లమెంట్‌లో సమర్పించిన పలు పత్రాల డేటా వెల్లడించింది. 199 జిల్లాల్లో ఇది 30 నుంచి 40 శాతం మధ్య ఉందని పేర్కొంది. పిల్లలు చాలా కాలం పాటు తగిన పోషకాహారం తీసుకోనప్పుడు సంభవించే దీర్ఘకాలిక పోషకాహార లోపాన్నే ఎదుగుదల లోపం (స్టంటింగ్) అంటారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన పోషన్ ట్రాకర్- 2025 జూన్ ఆధారిత డేటా ప్రకారం.. కొన్ని జిల్లాల్లో అత్యధిక సంఖ్య చిన్నారుల్లో ఎదుగుదల లోపం ఉంది.

లోకం తీరు



ఒబామాను కారులో వెంటాడుతూ!

» పోలీసులతో కలిసి చేజింగ్ చేస్తున్నట్టుగా మీమ్ ఫొటో పోస్టు చేసిన ట్రంప్



వాషింగ్టన్, జూలై 27: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ తెలుపు రంగు ఫోర్డ్ బ్రాంకో కారులో దూసుకెళ్తున్నారు.. ఆయనను పట్టుకునేందుకు ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పోలీసులు కార్లలో చేజ్ చేస్తున్నారు..! ఒబామాను టార్గెట్ చేస్తూ ట్రంప్ పోస్టు చేసిన తాజా మీమ్ ఫొటో ఇది. అమెరికాలో తన మాజీ భార్యను, మరొకరిని హత్య చేసిన కేసులో నిందితుడైన ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు, హాలీవుడ్ నటుడు ఓజే సింప్సన్.. ఫోర్డ్ బ్రాంకో కారులో పారిపోతుండగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. 1994 జూన్17న సుదీర్ఘం గాసాగిన ఆ చేజింగ్ దృశ్యాలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడా దృశ్యాన్ని వినియోగించి రూపొందించిన మీమ్‌ను ట్రంప్ పోస్టు చేశారు. ఇంతకుముందు అమెరికా అధ్యక్ష కార్యాలయంలో ట్రంప్, ఒబామా కూర్చుని మాట్లాడుతుంటే.. పోలీసులు వచ్చి ఒబామాను అరెస్టుచేసి జైలులో పెట్టినట్టుగా ఉన్న ఏఐ వీడియోను ట్రంప్ పోస్టు చేశారు.

అమెరికా వీసా ఆలస్యం..

» వేలాది భారత విద్యార్థులపై ప్రభావం

న్యూఢిల్లీ, జూలై 27: ఇటీవల వీసా ఇంటర్వ్యూలపై అమెరికా నిషేధం ఎత్తివేసినప్పటికీ.. వీసా ప్రాసెసింగ్‌లో అసాధారణ జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో అమెరికా విశ్వవిద్యాలయాల్లో కొత్తగా ప్రవేశం పొందిన చాలామంది విద్యార్థులు సకాలంలో అక్కడ అడ్మిషన్ పొందే అవకాశాలు కనిపించడంలేదు. వీసా ప్రాసెసింగ్‌లో ఆలస్యం, వీసా తిరస్కరణల కారణంగా గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రాబోయే సెమిస్టర్‌లో చేరే భారత విద్యార్థుల సంఖ్య 70-80శాతం తగ్గొచ్చని కన్సల్టెన్సీ నిపుణులు చెబుతున్నారు. ఈ సీజన్ సెమిస్టర్ సెప్టెంబరులో, మరికొన్ని చోట్ల ఆగస్టు చివరివారంలో మొదలవుతుంది. దీనికోసం విద్యార్థులు ఆగస్టులోనే అమెరికా చేరుకుంటారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం కాన్సులర్ అధికారులు విద్యార్థి, సందర్శకుల వీసా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అమెరికా ఎంబసీ ప్రతినిధి తెలిపారు. 'దరఖాస్తుదారుడు అమెరికా చట్టాల ప్రకారం వీసా పొందేందుకు అర్హుడని నిర్ధారించే కాన్సులర్ అధికారి సంతృప్తి చెందేవరకు మేం వీసా జారీ చేయం. అందుకే ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది' అని పేర్కొన్నారు.

గాజాలో మానవతా సాయానికి ఇజ్రాయెల్ ఓకే

గాజా, టెల్ అవీవ్, జూలై 27: ప్రపంచ దేశాల నుంచి పెరుగుతున్న ఒత్తిడితో గాజాలో ఇజ్రాయెల్ మానవతా సాయం అందించడానికి అడ్డంకులు కొంతమేర తొలగించింది. మళ్లీ ప్రకటించే వరకు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు గాజాతోపాటు అల్ మవాసి, డెయిర్ అల్‌బలా ప్రాంతాల్లో సైనిక చర్యలు చేపట్టబోమని ప్రకటించింది. ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో 53 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. కాగా హమాస్ మాజీ చీఫ్ యహ్యా సిన్వర్ హతమవడంతో ఆయన భార్య సమర్ ముహమ్మద్ అబూ జమర్ గాజా నుంచి తుర్కియేకు పారిపోయి మరో వివాహం చేసుకున్నట్టు ఇజ్రాయెల్ వార్తా సంస్థ వైనెట్ తెలిపింది. గత ఏడాది అక్టోబరు 16న ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో సిన్వర్ ప్రాణాలు కోల్పోవడంతో జమర్ ఫోర్జరీ పాస్‌పోర్టులతో పిల్లలతోసహా తుర్కియేకు పారిపోయారు.

ఎస్ఐఆర్‌ను తక్షణమే ఆపండి: ఇండీ కూటమి

న్యూఢిల్లీ, జూలై 27: బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్ష ఇండీ కూటమి విరుచుకుపడింది. అస్పష్టత, లోపభూయిష్ట డేటాతో ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారని మండిపడింది. మరణాలు, వలసలు ఇతర కారణాల వల్ల 63 లక్షలకు పైగా ఓటర్లు నిర్దేశిత చిరునామాలో లేరంటూ ఈసీ తేల్చిన డేటాను ప్రస్తావిస్తూ.. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపేయాలంటూ డిమాండ్ చేసింది. ఈ సమస్య కేవలం ఇండీ కూటమి ఓటర్ల వరకే పరిమితం కాదని.. ఎన్డీయే మిత్రపక్షాలు కూడా ప్రభావితమవుతాయన్నది గుర్తుంచుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియ ముగిసేనాటికి దాదాపు 2 కోట్ల మంది ఓటు హక్కును కోల్పోతారని హెచ్చరించింది.

కాంగో చర్చిపై దాడి.. 34 మంది మృతి

కిన్షాసా, జూలై 27: ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ అనుకూల తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. తూర్పు కాంగోలోని ఓ క్యాథలిక్ చర్చిలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఇస్లామిక్ స్టేట్ మద్దతు గల అలైడ్ డెమొక్రటిక్ ఫోర్స్ (ఏడీఎఫ్)కు చెందిన సాయుధ తిరుగుబాటుదారులు చర్చి లోపల, వెలుపల విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. చర్చి ఆవరణలోని పలు ఇళ్లు, దుకాణాలను దహనం చేశారు. ఈ దాడుల్లో 34 మంది వరకు చనిపోయారని ఓ సామాజిక కార్యకర్త మీడియాకు వెల్లడించారు.

'టెంపుల్ వార్' విరమణకు సిద్ధం!

» నేడు మలేషియాలో థాయ్, కాంబోడియా నేతల చర్చలు

బ్యాంకాక్, జూలై 27: పురాతన శివాలయాలు ఉన్న ప్రాంతం కోసం మొదలుపెట్టిన యుద్ధాన్ని విరమించేందుకు థాయ్‌లాండ్, కాంబోడియా సిద్ధమయ్యాయి. మలేషియాలో ఇరు దేశాల ప్రతినిధులు సోమవారం చర్చలు జరపనున్నారు. ఆదివారం తెల్లవారుజామునే థాయ్, కాంబోడియా ప్రధానులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడారు. యుద్ధం ఆపకపోతే వాణిజ్య ఒప్పందాలు జరపబోమని స్పష్టం చేశానని, దీంతో ఆ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. అయినా ఇరుదేశాల మధ్య సరిహద్దుల వెంట పరస్పర దాడులు కొనసాగాయి. కానీ మలేషియా మధ్యవర్తిత్వంతో చర్చలకు సిద్ధమయ్యాయి. థాయ్‌లాండ్, కాంబోడియా సరిహద్దుల్లో ఉన్న పురాతన 'టా మ్యుయెన్' శివాలయాల సమూహం, ప్రీహ విహార్ ఆలయ ప్రాంతం విషయంలో ఇరుదేశాల మధ్య ఈ నెల 24న యుద్ధం మొదలైన విషయం తెలిసిందే.

రానిటిడిన్‌తో క్యాన్సర్ భయం

» ఎసిడిటీ మందుపై కేంద్రం విచారణ

న్యూఢిల్లీ, జూలై 27: ఎసిడిటీ చికిత్సకు ఉపయోగించే ఔషధం రానిటిడిన్‌తో క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ ఔషధంలోని నైట్రోసోడైమెథైలమైన్(ఎన్‌డీఎంఏ) అనే ప్రమాదకరమైన క్యాన్సర్ కారకం(కార్సినోజెన్) ఉన్నట్లు తేలింది. దీంతో.. తమ పరిధిలో తయారయ్యే రానిటిడిన్‌లో ఎన్‌డీఎంఏ స్థాయులను గమనించాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ(సీడీఎస్‌సీవో), అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఔషధ నియంత్రణ డైరెక్టర్ జనరళ్లకు ఆదేశాలు జారీ చేసింది. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశి సూచనతో.. డ్రగ్స్, టెక్నికల్ అడ్వైజరీ బోర్డు(డీటీఏబీ) సిఫార్సుల ఆధారంగా రానిటిడిన్‌లో క్యాన్సర్ కారకాలున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది.


ఉగ్రవాదులకు ఎక్కడా సురక్షిత చోటు లేదు

ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.. దేశవ్యాప్తంగా కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది

» చోళుల కాలం స్వర్ణయుగం

» ప్రజాస్వామ్య పాలన వారిదే: మోదీ

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): "మన సార్వభౌమాధికారంపై దాడి జరిగితే భారత్ ఎలా స్పందిస్తుందో ఆపరేషన్ సిందూర్ ఈ ప్రపంచానికి చూపింది. దేశవ్యాప్తంగా కొత్త మేల్కొలుపు, కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు, శత్రువులకు ఎక్కడా సురక్షితమైన చోటు లేదని నిరూపించింది" అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించిన మొదటి రాజేంద్ర చోళుడి ఆడి తిరువాదిరై (ఆషాఢ ఆరుద్ర) జయంత్యుత్సవాలు, బృహదీశ్వరాలయ శంకుస్థాపన సహస్ర వార్షికోత్సవాలు, రాజేంద్రచోళుడు ఆగ్నేయాసియా దేశాలపై జరిపిన దండయాత్ర సహస్ర వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. చోళులు సైనిక సంపత్తిలో కొత్త పద్ధతులు, కొత్త రకం ఆయుధాలను ఉపయోగించేవారని, ఆ రీతిలోనే ప్రస్తుతం తమ ప్రభుత్వం కూడా ఆయుధాలను స్వయంగా తయారుచేసి శత్రువులను మట్టుబెట్టేందుకు ఉపయోగిస్తుందని చెప్పారు. చోళ చక్రవర్తుల పరిపాలన భారతదేశపు స్వర్ణయుగాలలో ఒకటని, ప్రజాస్వామ్యానికి జన్మనిచ్చింది చోళ రాజులేనని అన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే బ్రిటన్ మాగ్నా కార్టా గురించి మాట్లాడుతుంటారని, వాస్తవానికి అంతకుముందే చోళసామ్రాజ్యంలో 'కుడవోలై' పద్ధతి (కుండలో అభ్యర్థుల పేర్లున్న తాటి ఆకుల్లో ఒకదాన్ని తీయడం)లో ప్రజాస్వామ్యం వెల్లివిరిసిందని చెప్పారు. బృహదీశ్వరుడి పాదాల వద్ద కూర్చునే భాగ్యం తనకు లభించిందని, ఆ సందర్భంగా 140 కోట్ల మంది భారతీయుల సంక్షేమం కోసం, దేశ పురోగతి కోసం ప్రార్థించానని చెప్పారు. ఇతర దేశాల నుంచి బంగారం, వెండి తీసుకొచ్చిన చాలామంది రాజులు గురించి మనకు తెలుసని, అయితే రాజేంద్రచోళుడు మాత్రం గంగాజలాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. బృహదీశ్వరాలయ సందర్శనకు వచ్చిన తాను కూడా కాశీ నుంచి గంగాజలాన్ని ఆవుడయార్ (పరమేశ్వరుడికి)కు సమర్పించేందుకు తీసుకురావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన చెప్పారు. కాగా, రాజేంద్ర చోళుడిని భావితరాలవారు స్మరించుకునే ఆ చక్రవర్తి రూపం ఉన్న ప్రత్యేక నాణేన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు.



బృహదీశ్వరాలయంలోకి గంగాతీర్థమున్న కలశాన్ని చేత పట్టుకుని వెళ్తున్న ప్రధాని మోదీ

ఆగస్టు.. విప్లవాల మాసం

» 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 27: ఆగస్టు నెలను విప్లవాల మాసంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. 'మన్ కీ బాత్' 124వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం ఆయన పలు అంశాలపై మాట్లాడారు. '1908 ఆగస్టు 11న బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో 18 సంవత్సరాల యువకుడిని దేశభక్తి ప్రదర్శించిన కారణంగా బ్రిటిషర్లు ఉరి తీశారు. ఆ సమయంలో అతడి ముఖం భయానికి బదులు గర్వంతో నిండి ఉంది. తమ దేశం కోసం ప్రాణాలు అర్పించేవారు అనుభవించే గర్వం అది. ఆ యువకుడే ఖుదీరాం బోస్. 18 ఏళ్ల వయసులో అతను ప్రదర్శించిన ధైర్యం యావత్ దేశాన్ని కదిలించింది. ఆగస్టు 1న లోకమాన్య బాల గంగాధర్ తిలక్ వర్ధంతి. 8న మహాత్ముడి నేతృత్వంలో క్విట్ ఇండియా ఉద్యమం మొదలైంది. 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు మన స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుంటాం' అని మోదీ పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌తో అద్భుత ఫలితాలు

'విజయవాడలో నీటి నిర్వహణ పద్ధతులు భేష్' అని ప్రధాని మోదీ ప్రశంసించారు. విజయవాడ, కరాడ్‌లో నీటి నిర్వహణ కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనేక వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నాయని తెలిపారు. కలిసి పనిచేస్తే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయొచ్చని స్వచ్ఛ భారత్ నిరూపించిందని చెప్పారు. ఈ మిషన్ త్వరలోనే 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఇదొక సామూహిక ఉద్యమంలా సాగిందని ఆయన పేర్కొన్నారు.

నేడు పార్లమెంటులో హోరాహోరీ!

» పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపై చర్చ

» పలు ప్రశ్నలు సంధించేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపై సోమవారం పార్లమెంటులో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం ప్రారంభం కానున్నది. ఈ అంశాలపై పలు ప్రశ్నలు లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో మోదీ సర్కారు వారిని ఎలా ఎదుర్కొంటుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలను వరుసగా 5 రోజుల పాటు స్తంభింపచేసిన ప్రతిపక్షాలు.. ఈ అంశాలపై ప్రభుత్వం చర్చకు సమయం కేటాయించిన తర్వాతే శాంతించాయి. సోమవారం లోక్‌సభలో 16 గంటల పాటు చర్చ నిర్వహించాలని, అది ముగిసిన వెంటనే రాజ్యసభలోనూ 16 గంటల పాటు చర్చించాలని శుక్రవారం పార్లమెంటరీవ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగిన అఖిల పక్ష భేటీలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. సమావేశాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండి కూటమి నేతలు సమావేశమై చర్చను ఎలా ఎక్కుపెట్టాలో వ్యూహరచన చేయనున్నారు. ప్రధానంగా జాతీయ భద్రత, విదేశీ విధానం అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. కాగా, సోమవారం నుంచి బుధవారం వరకు లోక్‌సభ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని కాంగ్రెస్ తన ఎంపీలకు విప్ జారీ చేసింది.

టేకాఫ్ అవుతుండగా విమానం టైరు నుంచి మంటలు

» అత్యవసర ద్వారం నుంచి బయటపడిన ప్రయాణికులు, సిబ్బంది

» అమెరికాలోని డెన్వర్‌లో ఘటన



డెన్వర్, జూలై 27 : అమెరికాలోని డెన్వర్ విమానాశ్రయం నుంచి అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఒకటి శనివారం టేకాఫ్ అవుతుండగా టైరు నుంచి మంటలు రావడంతో రన్‌వేపైనే నిలిచిపోయింది. అందులోని 173 మంది ప్రయాణికులు, సిబ్బంది అత్యవసర ద్వారం నుంచి బయటపడ్డారు. లాండింగ్ గేర్ సరిగ్గా పనిచేయక టైరు నుంచి మంటలు, పొగ వచ్చాయి. దీంతో ప్రయాణికులను అత్యవసర ద్వారం నుంచి సురక్షితంగా దింపినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఒక వ్యక్తికి మాత్రం స్వల్ప గాయాలైనట్లు పేర్కొన్నారు. మయామి బయలుదేరిన బోయింగ్ 737 మాక్స్8 విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు అత్యవసరం ద్వారం నుంచి జారి బయటపడుతుండగా.. టైరు నుంచి మంటలు, భారీగా పొగ రావడం వీడియోల్లో కనిపించింది. విమానం ఉన్న చోటును పొగ కమ్మేసింది. ఈ ఘటనపై విచారణ జరపనున్నట్లు అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. విమానం నుంచి వచ్చిన మంటలను అదుపు చేసినట్లు డెన్వర్ అగ్నిమాపక విభాగం పేర్కొంది. నిర్వహణ సమస్యతో విమానం టైరు నుంచి మంటలు వచ్చినట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. కాగా డెన్వర్‌లో ఇది రెండో ఘటన.

టీసీఎస్‌లో 12 వేల ఉద్యోగాల కోత!

2025-26 ఆర్థిక సంవత్సరంలో 2 శాతం సిబ్బందిని తొలగించనున్నట్టు ఆ సంస్థ వెల్లడి

» మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ప్రభావం



న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోనే అతి పెద్ద ఐటీ సేవల ఎగుమతి సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్).. భారీస్థాయిలో ఉద్యోగాల ఊచకోతకు సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిని 2 శాతం మేర తగ్గించుకోనున్నట్టు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఆ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 2% అంటే.. 12,200 మందికి పైగానే (మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069)!! ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, కృత్రిమ మేధ కారణంగా సాంకేతిక పరిజ్ఞానాలు మారుతున్న నేపథ్యంలో వ్యాపార గిరాకీ తగ్గిపోతుండడంతో ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. "టీసీఎస్.. భవిష్యత్తు పరిణామాలకు సిద్ధంగా ఉండే సంస్థగా మారే ప్రయాణంలో ఉంది. ఆ ప్రయాణంలో భాగంగా.. సంస్థకు ఉపయోగపడని ఉద్యోగులను ఏడాది వ్యవధిలో తొలగిస్తాం. ఈ ప్రభావం మా అంతర్జాతీయ సిబ్బందిలో 2% మందిపై.. ముఖ్యంగా మధ్య స్థాయి, సీనియర్ గ్రేడ్ ఉద్యోగులపై పడుతుంది" అని ఆ సంస్థ తన ప్రకటనలో వివరించింది. టీసీఎస్ సేవలను పొందేవారికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా, తమ సేవలపై ఎలాంటి ప్రభావం పడకుండా.. ఉద్యోగాల కోతకు ప్రణాళికలు రచించినట్టు వెల్లడించింది. ఉద్యోగాలు కోల్పోయే తమ సిబ్బందికి ఇది కష్టకాలమేనన్న సంగతి తమకు తెలుసునని.. వారి సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూనే కొత్త ఉద్యోగాలు వెతుక్కునేందుకు అన్ని రకాలుగా సాయం చేస్తామని టీసీఎస్ పేర్కొంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయేవారికి వారి నోటీసు కాలానికి సంబంధించిన జీతాలు చెల్లించడమే కాక.. కోత ప్యాకేజీ కింద మరికొంత అదనంగా ఇస్తామని తెలిపింది. వారికి బీమా ప్రయోజనాలను కూడా పొడిగించే అవకాశాలను పరిశీలిస్తామని.. 'ఔట్‌ప్లేస్‌మెంట్ ఆపర్చునిటీస్ (అంటే కొత్త ఉద్యోగం పొందడానికి వీలుగా రెజ్యూమ్ తయారు చేసుకోవడంలో, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం, కౌన్సెలింగ్ వంటి సహాయాలు)' అందిస్తామని వెల్లడించింది. టీసీఎస్ సంస్థ ఇటీవలే తన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ'ని సవరిస్తూ తీసుకున్న నిర్ణయంపై కొందరు ఉద్యోగులు లీగల్ కంప్లైంట్లు దాఖలు చేసిన కొద్దిరోజులకే ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సవరించిన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ' ప్రకారం.. టీసీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు ఏడాదికి గరిష్ఠంగా 35 రోజులు మాత్రమే బెంచ్‌పై (ఏ ప్రాజెక్టులోనూ లేని సమయం) ఉండాలి. అలాగే.. ఏటా కనీసం 225 రోజుల 'బిల్లబుల్ డేస్ (అంటే డబ్బులు వచ్చే ప్రాజెక్టుపై) పనిచేయాలి. అలా లేనివారిపై చర్యలు తీసుకునే విధంగా కొత్త విధానం ఉంది. కాగా.. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేవలం ఖర్చులను తగ్గించుకోవడానికి తీసుకున్న నిర్ణయంగా కాక, సంస్థ వ్యూహాత్మక మార్పు (స్ట్రాటజిక్ షిఫ్ట్)గా చూడాలని నిపుణులు భావిస్తున్నారు. టీసీఎస్ సీఈవో కృతివాసన్ సైతం ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని వెల్లడించారు. ఏఐ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా పనిచేసే తీరు మారుతోందని.. ఈ నేపథ్యంలో తాము భవిష్యత్తుకు సిద్ధంగా, వేగంగా స్పందించగలిగేలా ఉండాలని ఆయన వివరించారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్16 రిహార్సల్ విజయవంతం

» 30న నిసార్ ఉపగ్రహంతో రోదసీలోకి

» నేడు ఎంఆర్ఆర్ భేటీ.. రేపు కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇస్రో-నాసా సంయుక్తంగా చేపడుతున్న నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5:40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం రాకెట్ రిహార్సల్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రాకెట్‌ను మొబైల్ సర్వీస్ టవర్ నుంచి ముందుకు తీసుకొచ్చి మళ్లీ వెనక్కి తీసుకెళ్లే ప్రయోగ ప్రక్రియను శాస్త్రవేత్తలు నిర్వహించారు. రాకెట్‌లోని అన్ని దశల పనితీరును పరిశీలించి తుది దశ తనిఖీలు చేశారు. ప్రయోగానికి సంబంధించి రాకెట్ సంసిద్ధత (ఎంఆర్ఆర్) సమావేశం సోమవారం షార్‌లో జరగనుంది. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (లాబ్) సమావేశమవుతుంది. ఆ తర్వాత కౌంట్‌డౌన్ సమయాన్ని శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటిస్తారు. కౌంట్‌డౌన్ 24 గంటలు లేదా 25:30 గంటలకు ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది నాసా-ఇస్రో ఉమ్మడి ప్రాజెక్టు కావడంతో అమెరికా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు రానున్నారు.


జవాన్లకు శరీరంపై ధరించే కెమెరాలు

బంగ్లా సరిహద్దుల్లో భద్రత పటిష్ఠం

కేంద్ర హోంశాఖ నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 27: భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దు పొడవునా భద్రతా విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లకు 5,000 పై చిలుకు శరీరంపై ధరించే కెమెరాలు అందజేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. భారత్‌లో అక్రమంగా చొరబడ్డ బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపించేందుకు అవసరమైన ఆధారాలు, విజువల్ రికార్డుల సేకరణ కోసం జవాన్లకు వీటిని అందించాలని నిర్ణయానికి వచ్చింది. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లపై నేరగాళ్ల దాడుల నేపథ్యంలో కేంద్రం నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. దీనికి తోడు గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా సర్కారు పతనమైన తర్వాత సరిహద్దుల్లో భద్రత బలోపేతంతోపాటు జవాన్లకు శరీరంపై ధరించే కెమెరాలు అందించాలని బీఎస్ఎఫ్ తీసుకున్న నిర్ణయానికి కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపింది. సరిహద్దుల్లో 4,096 కి.మీ పొడవునా ఎంపిక చేసిన బీఎస్ఎఫ్ ఔట్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న వారికి ఈ కెమెరాలు అందిస్తారు.

కష్టపడి పనిచేసినా సీఎంని కాలేకపోయా: ఖర్గే



బెంగళూరు, జూలై 27: కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి కష్టపడి పనిచేసినా ముఖ్యమంత్రిని కాలేకపోయానని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా అయిదేళ్లపాటు శ్రమించానని, అయినా ముఖ్యమంత్రి పదవి దక్కలేదంటూ తన అనుభవాలను పంచుకున్నారు. ఆదివారం విజయపురలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు తాను కష్టపడ్డానని, కానీ పార్టీలో కేవలం నాలుగు నెలల ముందే చేరిన ఎస్.ఎం.కృష్ణకు పదవి దక్కిందని చెప్పారు. కర్ణాటక పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎస్.ఎం. కృష్ణ ప్రచారం చేయడంతో ఆయనకు పీఠం వరించింది. ఇలాంటి వైఫల్యాలను చూసి మనసులో ద్వేషం పెంచుకోకూడదని, అలా చేస్తే అనుకున్నవి సాధించలేరని అన్నారు. తాను సమితి అధ్యక్షుడి నుంచి ఏఐసీసీ అధ్యక్షుడి వరకు ఎదిగిన తీరును వివరించారు.

మహిళా స్కీమ్ సొమ్ము తినేస్తున్న మగాళ్లు!

మహారాష్ట్రలో 'లడ్కీ బహిన్' కుంభకోణం


ముంబై, జూలై 27: మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'లడ్కీ బహిన్ యోజన' పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ స్కీమ్ కింద మహిళలు లబ్ధి పొందాల్సి ఉండగా.. దాదాపు 14 వేల మందికి పైగా పురుషులు మోసపూరితంగా డబ్బులు కాజేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను తప్పుదోవ పట్టించి, మహిళలుగా పేర్లను నమోదు చేసుకొని, 'లడ్కీ బహిన్ యోజన' కింద లబ్ధి పొందారు. 14,298 మంది పురుషులకు రూ.21.44 కోట్ల మేర అందినట్లు మహిళా, శిశు అభివృద్ధి శాఖ (డబ్ల్యూసీడీ) ఆడిట్‌లో వెల్లడైంది. పథకాన్ని ప్రారంభించిన దాదాపు 10 నెలల తర్వాత ఈ ఘరానా మోసం బయటపడడం గమనార్హం. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు లడ్కీ బహిన్ స్కీమ్‌ను ప్రారంభించామన్నారు. తప్పుడు మార్గంలో లబ్ధి పొందిన పురుషుల నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. మరికొన్ని విధాలుగా ఈ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆడిట్‌లో తేలింది. పెద్ద సంఖ్యలో అనర్హుల నమోదు కారణంగా రూ.1,640 కోట్ల నష్టం జరిగిందని డబ్ల్యూసీడీ అంచనా వేసింది. ఈ పథకాన్ని ఒక్కో కుటుంబంలో ఇద్దరికే పరిమితం చేయగా.. 7.97లక్షల మందికి పైగా మహిళలు తమ కుటుంబాల నుంచి మూడో సభ్యురాలిగా నమోదు చేసుకున్నారు. తద్వారా ప్రభుత్వానికి రూ.1,196కోట్ల నష్టం వాటిల్లింది. గరిష్ఠ వయసు పరిమితి 65 ఏళ్లు పెట్టగా.. 65 ఏళ్లు దాటిన 2.87 లక్షల మంది స్కీమ్ లబ్ధి పొందారు. దీని వల్ల రూ.431.7 కోట్ల నష్టం జరిగింది. స్కీమ్‌లో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి.

కర్మభూమిలో ఎదగండి..

జన్మభూమి కోసమూ నిలవండి!

- తెలుగుజాతి ఎక్కడైనా వెలుగుజాతే
- నిజాయితీతో ఎదిగిన దేశం సింగపూర్
- అందుకే అమరావతిలో భాగస్వామిని చేశా
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడి.. సంపద సృష్టిస్తున్న తెలుగు వాళ్లు జన్మభూమిని మర్చిపోకూడదని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. ఐదురోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా ఆదివారం అక్కడి 'వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఓవిస్) డిజిటల్ క్యాంపస్‌లో జరిగిన 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా' కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్నార్టీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింగపూర్‌తో పాటు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్‌లలోని ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో మారుతున్న పరిణామాలను తెలుగుప్రజలు అందిపుచ్చుకున్నారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు వారి జీవితాలను మార్చాయని.. దాని ఫలితమే నేడు 120కిపైగా దేశాల్లో తెలుగు ప్రజలు ఉన్నారని చెప్పారు. చాలా దేశాల్లో స్థానికుల కంటే ఎక్కువగా తెలుగువారు సంపాదిస్తున్నారని అన్నారు. సత్య నాదెళ్లలాంటి వాళ్లు మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారని గుర్తుచేశారు.


సింగపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు

తాను ముఖ్యమంత్రిని కాకముందు ఉమ్మడి ఏపీలో ఇంజనీరింగ్ కాలేజీలు సింగిల్ డిజిట్‌లో ఉండేవని.. మూడేళ్లలో 300 ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పలు బహుళజాతి సంస్థల సీఈవోలుగా పనిచేస్తున్న ప్రవాస తెలుగు ప్రముఖుల నైపుణ్యాన్ని వినియోగించుకునేందుకు 'సీఎక్స్‌వో' (చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్) క్లబ్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. సభలో ఇంకా ఏమన్నారంటే..

పుట్టినగడ్డను మరవొద్దు..

1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, దశ, దిశ రూపకల్పన చేసిన వ్యక్తి ఆయన. అదే సమయంలో ఇంటర్నెట్ విప్లవం మొదలైంది. ఈ పరిణామాలను గుర్తించి భవిష్యత్ అంతా ఐటీ, నాలెడ్జ్ ఎకానమీకి ఉంటుందని నమ్మాను. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగుజాతి అగ్రగామిగా ఉండాలంటే ఐటీని ప్రమోట్ చేయాలని ఆలోచించాను. నేడు సింగపూర్‌లో వేల మంది తెలుగు ప్రజలు ఉన్నారంటే ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఆలోచనలే కారణం. ఒక మత్స్యకార గ్రామమైన సింగపూర్ నేడు ప్రపంచంలోనే గొప్ప దేశంగా ఎదిగింది. అందుకే ఈ దేశమంటే నాకు గౌరవం. నీతి నిజాయితీతో ఒక వ్యక్తి వేసిన పునాదితో గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. ఇక్కడ అవినీతి చాలా తక్కువ. సింగపూర్‌పై ఉన్న ఆ గౌరవంతోనే అమరావతిని సింగపూర్ మాదిరి చేస్తానని 2014 ఎన్నికలకు ముందు చెప్పా. చాలా మంది రాజకీయ నేతలు ఇక్కడకు వచ్చి ఎంజాయ్ చేసి వెళ్తారు. ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం ఇక్కడకొచ్చి మనం చేసిన మంచి పనులను తెలుసుకుని వాళ్ల రాష్ట్రంలో అమలు చేస్తున్నారని సింగపూర్ మాజీ ప్రధాని లీక్వాన్ యూ నా గురించి చెప్పారు. అలాంటి సింగపూర్‌లో 40 వేల మంది తెలుగు వారు ఉన్నారంటే గర్వంగా ఉంది. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా తయారుచేసి ఇచ్చింది. సీడ్ క్యాపిటల్‌లో సింగపూర్‌ను భాగస్వామిని చేస్తే ప్రపంచంలోని మంచి కంపెనీలను తీసుకొస్తారని భావించా. 2019 తర్వాత సింగపూర్ ప్రభుత్వాన్ని తప్పుబట్టే పరిస్థితి తెచ్చారు. పెట్టుబడులైతే తీసుకురాగలను కానీ ప్రభుత్వ బ్రాండ్ పోతే ఏపీ నష్టపోతుందని సింగపూర్ ప్రభుత్వానికి చెప్పా. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలని ఇక్కడ పర్యటనకు వచ్చా. మీకు జరిగిన ఇబ్బందికి బాధపడుతున్నాను. దానిని సరిదిద్దడానికే వచ్చానని వారికి చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆంధ్రలో పరిశ్రమలు స్థాపించేందుకు వీలుగా 'గ్లోబల్ ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ సెల్' ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. విదేశాల్లో ఉన్న తెలుగువారు 2024 ఎన్నికల్లో మా కోసం పనిచేశారు. చేయని తప్పునకు 53 రోజులు జైల్లో ఉన్నాను. దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగువారు నా కోసం పనులు వదిలిపెట్టి ఆందోళనలు చేశారు. నా గురించి వాళ్లు పడిన ఆందోళన, తపన ఎన్నటికీ మరచిపోలేను. ఎన్నికల్లో కూడా స్వచ్ఛందంగా వచ్చి పార్టీ కోసం పనిచేశారు. వారి రుణం తీర్చుకోలేను.

ప్రవాసులకు వెంకన్న ప్రత్యేక దర్శనం

తిరుమల బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం మన అదృష్టం. ఎన్ని కష్టాలున్నా వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో స్వామి ఆలయం ఉండాలి. సింగపూర్ నుంచి విజయవాడ, తిరుపతి, విశాఖకు నేరుగా విమానాలు వచ్చేలా చూస్తాను. ఈ మేరకు కేంద్రంతో మాట్లాడతాను.


ఇందిరాపార్కు వద్ద జరిగిన విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

- వంద బీసీ కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలి
- బీసీ విద్యార్థుల ధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

కవాడిగూడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): కాలేజీ విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 6 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మరో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేసి, బీసీ గురుకుల పాఠశాలల్లో 20శాతం సీట్లను పెంచాలన్నారు. బీసీ విద్యార్థి సంఘం, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు బకాయిల స్కీమ్‌ను ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా నీరుగారుస్తుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలైనా పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఏమౌతున్నాయని ఆయన ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోడి రాందేవ్, నాయకులు అనంతయ్య, రాజేందర్, శివ, అనురాధ గౌడ్, ఆశిష్ గౌడ్ తదితరులతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు: మంత్రి అడ్లూరి

దేవరకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకుని, అప్పులపాలు చేశారని, దళిత గిరిజనులను మోసం చేశారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో రూ.1.35 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలన్నీ అంచెలంచెలుగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్‌లకు కుర్చీపై ఉన్న ప్రేమ రాష్ట్ర అభివృద్ధిపై లేదని విమర్శించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి వివక్ష చూపుతోందని ఆయన ఆరోపించారు.

మానవ హక్కుల ఉల్లంఘనలపై నేడు, రేపు ఎన్‌హెచ్‌ఆర్‌సీ బహిరంగ విచారణ

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఈనెల 28, 29 తేదీల్లో తెలంగాణకు చెందిన 109 మానవ హక్కుల ఉల్లంఘన కేసులపై హైదరాబాద్‌లో ప్రత్యేక బహిరంగ విచారణ చేపట్టనుంది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ జస్టిస్ రామ సుబ్రమణియన్, సభ్యులు జస్టిస్ విద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయానీ సోమవారం ఉదయం 10గంటలకు మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో విచారణ జరుగుతుంది.

కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం

మరికల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే కన్న కూతురిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని ఓ గ్రామంలో ఈ నెల 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరికల్ మండలానికి చెందిన 9 ఏళ్ల బాలిక ఐదవ తరగతి చదువుతోంది. ఈ నెల 25న పాఠశాల నుంచి ఇంటికి వచ్చి హోంవర్క్ చేసుకుంటుండగా తండ్రి వచ్చాడు. ఆ సమయంలో కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేకపోవడంతో ఒంటరిగా ఉన్న కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు రక్తస్రావం కావడంతో పరారయ్యాడు. ఇంటికొచ్చిన తల్లి బాలిక పరిస్థితిని చూసి తల్లడిల్లింది. మరుసటి రోజు కూడా బాలికకు రక్త స్రావం కావడంతో ఆమెను మహబూబ్‌నగర్ జిల్లా అసుపత్రికి తీసుకువెళ్లింది. వైద్యులు పరీక్షించి బాలికపై అత్యాచారం జరిగినట్లు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలిక గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పారిపోయిన నిందితుడిని త్వరలో పట్టుకుంటామని చెప్పారు.

సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే బలమైన గాలులు అన్ని జిల్లాల్లోనూ వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల 31 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపింది.

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ పార్టీ

- ఎంజాయ్ కోసం ఏపీ నుంచి నగరానికి
- సీజ్ చేసిన కార్లలో ఒకదానిపై ఎంపీ స్టిక్కర్
- బడాబాబుల పిల్లల పాత్రపై అనుమానాలు
- 9 మంది అరెస్టు.. డ్రగ్స్ సీజ్

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లోని కొండాపూర్‌లో.. ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్న ముఠా ఆటను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం కట్టించింది. నిందితులంతా ఏపీకి చెందినవారే..! ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారి ప్రదీప్‌రావు కథనం ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన అశోక్ నాయుడు కొండాపూర్ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తుంటారు. ఏపీకి చెందిన కెంగర్ రాహుల్, ఉన్నాటి ఇమాన్యుయేల్ అలియాస్ అనీల్ అలియాస్ ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నేల నుంచి ఇతను డ్రగ్స్(ఓజీకుష్, మ్యాజిక్ మష్రూమ్, చరస్, ఎల్ఎస్‌డీ బ్లాట్స్, గంజాయి) కొనుగోలు చేస్తూ, సర్వీస్ అపార్ట్‌మెంట్లలో డ్రగ్స్, రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో కొండాపూర్ జేవీజీ హిల్స్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను బుక్ చేశారు. విజయవాడ, మంగళగిరి, కాకినాడ, రాజమండ్రికి చెందిన సమ్మెల సాయికృష్ణ, నాగెళ్ల లీలామణికంఠ, హిల్టన్ జోసఫ్ రోల్ఫ్, అడప యశ్వంత్ శ్రీదత్త, తోట కుమారస్వామి, నందం సుమంత్ తేజలను పార్టీకి ఆహ్వానించారు. వీరంతా పార్టీలో ఉండగా.. ఉప్పందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం దాడి చేసి, అశోక్‌నాయుడు, అతని కస్టమర్లను అరెస్టు చేసింది. వారికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలింది. నిందితుల నుంచి 2.08 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీకుష్, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చరస్, 4 ఎల్ఎస్‌డీ బ్లాట్లు, రెండు ఫోర్డ్ కార్లు(ఏపీ07సీయూ-7154, ఏపీ39ఎస్ఆర్-0001), రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు శ్రీనివాస్ చౌదరి అలియాస్ వాసు, అఖిల్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. సీజ్ చేసిన కార్లలో ఒకదానిపై ఎంపీ స్టిక్కర్ ఉండడంతో.. ఈ కేసులో బడాబాబుల పిల్లల పాత్ర ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

ఈసా కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

- మొండి కత్వపై నడుస్తూ

ఫొటోలు దిగుతుండగా కాలు జారి ప్రమాదం


అక్షిత్ రెడ్డి (ఫైల్)

రాజేంద్రనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఈసా కాలువపై ఉన్న మొండి కత్వపై నడుస్తూ ఫొటోలు దిగుతుండగా జారి పడి అక్షిత్ రెడ్డి (20) అనే బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ ప్రదేశం హిమాయత్ సాగర్ నుంచి బాపు ఘాట్ మూసీ నది వరకు ప్రవహించే ఈసా కాలువ మార్గంలో జన చైతన్య వెంచర్ వద్ద ఉంది. ఈసా కాలువపై మొండి కత్వ గోడ పైనుంచి నీరు పారుతూ కనిపిస్తుంది. ఇది సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌లో అందమైన జనచైతన్య వాటర్ ఫాల్స్ అంటూ ప్రచారం జరుగుతోంది. వర్షాలు పడుతుండడంతో గోడపై గడ్డి మొలిచి పాకురు పట్టి ప్రమాదకరంగా మారింది. జీడిమెట్ల జగద్గిరిగుట్టకు చెందిన వీజేఐటీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న అక్షిత్ రెడ్డి ముగ్గురు స్నేహితులతో కలిసి మొండి కత్వ వద్దకు ఆదివారం వచ్చారు. మొండి కత్వ గోడపై నడుస్తూ ఫొటోలు దిగుతుండగా అక్షిత్ రెడ్డి కాలు జారి కాలువలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. రాజేంద్రనగర్ పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంత్రం వరకు గాలించినా ఫలితం కనిపించలేదు. మొండి కత్వ వద్దకు ఎవరూ వెళ్లొద్దని, ఆ ప్రదేశం చాలా ప్రమాదకరమని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. సెలవుల్లో ఇంటికి వచ్చిన అక్షిత్‌రెడ్డి తిరిగి సోమవారం హాస్టల్‌కు వెళ్లాల్సివుందని, ఇంతలోనే ఈ దారుణం జరిగిపోయిందని అక్షిత్ రెడ్డి తండ్రి రవీందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రవాణా సేవల భారం!

- ఆదివారం ఉదయం నుంచే అమల్లోకి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ సేవలు మరింత భారంగా మారాయి. ప్రభుత్వం పలు సేవల ధరలను పెంచుతూ.. కొత్త ఫీజులను ప్రకటించింది. రవాణా శాఖ నుంచి ఎలాంటి బహిరంగ ప్రకటన లేకుండానే.. ఆదివారం ఉదయం నుంచే ఈ మార్పు అమల్లోకి వచ్చింది. అధికారులు చడీచప్పుడు కాకుండా రవాణాశాఖ వెబ్‌సైట్‌లో కొత్త ధరలను అప్‌డేట్ చేశారు. పలు సేవల ఫీజులు నామమాత్రంగా పెరగ్గా.. మరికొన్నింటికి భారం తడిసి మోపెడుకానుంది. ఉదాహరణకు.. లెర్నర్స్ లైసెన్స్‌కు గతంలో రూ.335 ఫీజు ఉండేది. దాన్ని తాజాగా రూ.440కి పెంచారు. రెండు కేటగిరీలు-- ద్విచక్రవాహనం, కారు లెర్నర్స్ లైసెన్స్ ఫీజు రూ.450 నుంచి రూ.585కు పెరిగింది. ఇక పర్మినెంట్ లైసెన్సుకు సంబంధించిన డ్రైవింగ్ టెస్టుకు గతంలో రూ.1,035 వసూలు చేసేవారు. దాన్ని ఇప్పుడు రూ.1,135కు పెంచారు. వాహనాల యాజమాన్య బదిలీకి గతంలో రూ.935 ఫీజు ఉండగా.. ఇప్పుడు రూ.1,805కు పెరిగింది. ఫైనాన్స్‌పై వాహనాలు తీసుకున్న వారికి ఆయా కంపెనీల హామీ పత్రం(హైపొథికేషన్) ఫీజు రూ.2,135గా ఉండేది. ఇప్పుడు ఏకంగా వెయ్యి రూపాయలు పెరిగి.. రూ.3,135కు చేరుకుంది. రుణ బదిలీకి ఫీజు రూ.2,445 నుంచి రూ.2,985కి.. ఆటోరిక్షా డ్రైవింగ్ టెస్ట్ ఫీజు రూ.800 నుంచి రూ.900కు పెంచారు. గతంలో రవాణాశాఖ అధికారులు ఈ పెంపునకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. సర్కారు అనుమతించడంతో ఇప్పుడు ఫీజులను పెంచినట్లు తెలుస్తోంది.

111 మంది విద్యార్థినులకు అస్వస్థత

కలుషిత ఆహారమే కారణం

- ఆస్పత్రిలో చికిత్స.. అనంతరం డిశ్చార్జి
- పాఠశాల క్యాటరింగ్ కాంట్రాక్టు రద్దు

నాగర్‌కర్నూల్/హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 111 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో శనివారం రాత్రి భోజనం తర్వాత విద్యార్థినులకు కడుపునొప్పితో వాంతులు, విరేచనాలు కావడంతో ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు వెంటనే వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం విద్యార్థునుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ముగ్గురు విద్యార్థినులు మినహా అందరినీ డిశ్చార్జి చేశామని డాక్టర్ పూర్ణిమ తెలిపారు. పరీక్షల నిమి త్తం విద్యార్థినులకు అందించిన ఆహార నమూనాలను జిల్లా వైద్యాధికారులు సేకరించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ప్రాథమిక విచారణ ఆధారంగా క్యాటరింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.


నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

విద్యార్థుల భవిష్యత్తు మా బాధ్యత: మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంత్రి జూపల్లి కృష్ణారావు కూచకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి: హరీశ్

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక దాదాపు 100 మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు అనారోగ్య కారణాలతో మృతి చెందారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఘటనకు సీఎం నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో అసౌకర్యాలపై మానవ హక్కుల కమిషన్ స్పందించాలని, హైకోర్టు ఈ సంఘటనను సుమోటాగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్ఖాల ముసుగులో చోరీలు

సూర్యాపేట నగల దుకాణంలో చోరీ కేసులో మహిళ అరెస్టు

- 14 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- పరారీలో మరో ఆరుగురు

సూర్యాపేట క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గూర్ఖాల ముసుగులో రాష్ట్రంలో ఓ ముఠా చోరీలకు పాల్పడుతోంది. సూర్యాపేట ఎంజీ రోడ్డులోని శ్రీ సాయి సంతోషి నగల దుకాణంలో ఈ నెల 20న రూ.కోట్ల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆదివారం సూర్యాపేట బస్టాండ్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా, యశోద అనే మహిళ వారికి అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు ఆమె వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో బంగారు ఆభరణాలు లభించాయి. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో, విచారించగా.. సూర్యాపేట నగల దుకాణం చోరీతో పాటు ఖమ్మంలో వీరి గ్యాంగ్ చేసిన దొంగతనాల గురించి పోలీసులకు తెలిపింది. ఖమ్మంలో కొంతకాలంగా గుర్ఖాలుగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన భట్ట అమర్, ప్రకాష్ అనిల్‌కుమార్ అక్కడి పలు దుకాణాలు, బ్యాంకుల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో యశోదకు ప్రకాశ్ అనిల్‌కుమార్‌కు మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అప్పటినుంచి అనిల్‌కుమార్ చేసే చోరీల్లో యశోద సాయం చేస్తూ వస్తోంది. వీరు ముగ్గురూ కలిసి ఖమ్మంలోని నగల దుకాణాలు, బ్యాంకుల్లో చోరీలు చేశారు. ఇతర ప్రాంతాల్లోనూ దొంగతనాలు చేయాలని భావించి సూర్యాపేటను ఎంచుకున్నారు. మే నెల మొదటి వారంలో ముగ్గురూ కలిసి సూర్యాపేటకు వచ్చారు. జార్ఖండ్ నుంచి కడకొసింగ్ అనే వ్యక్తితో పాటు మరో ముగ్గురిని అనిల్‌కుమార్ సూర్యాపేటకు పిలిచాడు. వీరందరూ కలిసి ఈ నెల 20న అర్ధరాత్రి శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో చోరీ చేసి ఖమ్మం వెళ్లారు. తాను నేపాల్ వెళ్తున్నానని చెప్పి అనిల్‌కుమార్ 14 తులాల బంగారు ఆభరణాలను యశోదకు ఇచ్చి వెళ్లాడు. ఆమె తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను హైదరాబాద్‌లో విక్రయించేందుకు బస్సులో వెళ్తూ మూత్ర విసర్జన కోసం బస్సు దిగి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు యశోదను పట్టుకున్నారు. యశోద చెప్పిన వివరాల ఆధారంగా నేపాల్‌కు చెందిన గుర్ఖాలు ప్రకాష్ అనిల్‌కుమార్, భట్ల అమర్‌తో పాటు జార్ఖండ్‌కు చెందిన కడకొసింగ్‌తో పాటు అదే రాష్ట్రానికే చెందిన మరో ముగ్గురు గుర్తుతెలియని యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- వేదిక కానున్న దండకారణ్యం .. పోలీసుల గాలింపు
- దంతెవాడలో 3 స్మారక స్తూపాల కూల్చివేత

చర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించనుంది. పార్టీలో పనిచేస్తూ అసువులు బాసిన నాయకుల కోసం ఈ వారోత్సవాలను ప్రతీ ఏటా ఆ పార్టీ నిర్వహిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా పార్టీకి దిశా నిర్దేశం, సభలు, సమావేశాలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలన్నిటికీ దండకారణ్యం వేదిక కానుంది. కాగా.. ఈ ఏడాది సుమారు 357 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నాడు. మరోవైపు.. ఆ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే ఈ వారోత్సవాలను తిప్పికొట్టాలని పోలీసులు అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో తనిఖీలు చేస్తూ, అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు తమ ఉనికి చాటుకోవడం కోసం విధ్వంసకర ఘటనలకు పాల్పడే అవకాశం ఉండడంతో.. పట్టణాలు, పల్లెల్లో తనిఖీలు చేస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఛత్తీస్‌గఢ్‌కి వెళ్లే రహదారులను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన కల్వర్టులు, నూతనంగా నిర్మించిన రహదారులను బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్నారు. అలాగే వెంకటాపురం, వాజేడు మండలాల్లో కూడా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో మావోయిస్టుల హిట్‌లిస్టులో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు. 2024 నుంచి ఆపరేషన్ కగార్ మొదలైంది. రెండు సంవత్సరాల్లో 700 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ పార్టీని నడిపించే నాయకులు ఉన్నారా? అన్న సందేహం సర్వత్రా కలుగుతోంది. అయితే అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని ఆ పార్టీ లేఖల ద్వారా పిలుపునిచ్చింది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కచ్చెనార్ గ్రామంలో ఆదివారం మావోయిస్టు పార్టీకి చెందిన మూడు స్మారక స్తూపాలను కేంద్ర బలగాలు కూల్చివేశాయి. వారోత్సవాల నేపథ్యంలోనే వీటిని తయారుచేశారని పోలీసులు చెబుతున్నారు.

ప్రాజెక్టులకు జలకళ.. పర్యాటకం జోరు

- లక్నవరంలో బోటింగ్ పునఃప్రారంభం
- బొగత సందర్శనకు అనుమతి
- భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి

గోవిందరావుపేట, వాజేడు, భద్రాచలం, నాగార్జునసాగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రకృతి రమణీయ తీరం లక్నవరం సరస్సు పర్యాటకులకు మళ్లీ ఆహ్వానం పలుకుతోంది. జలకళతో కళకళలాడుతున్న సరస్సులో 111 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత బోటింగ్ ప్రారంభమైంది. ఇటీవలి వర్షాలు, వరదలతో సరస్సులోకి గరిష్ఠ స్థాయిలో నీటిమట్టం చేరింది. ఈనేపథ్యంలో బోటింగ్‌ను ప్రారంభించారు. ప్రకృతి ప్రేమికులు బోటుషికారు చేస్తూ ఆనందంగా గడిపారు. కాటేజీల ఆన్‌లైన్ బుకింగ్‌లు కూడా పెరిగినట్లు అధికారులు తెలిపారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం సందర్శనకు సోమవారం నుంచి అనుమతిస్తూ అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా ఈనెల 23 నుంచి బొగత సందర్శనను అధికారులు నిలిపివేశారు. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టడంతో సందర్శనను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వీక్షణ మాత్రమే అనుమతి ఉంటుందని, ఈత కొలను దిగి స్నానాలు చేయొద్దని సూచించారు.


583 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం సూచీ

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు 35.4 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రం 5 గంటలకు 34.6 అడుగులకు తగ్గింది. గోదావరి ఒడ్డున స్నానఘట్టాలు నీటమునిగే ఉన్నాయి.

583 అడుగులకు సాగర్ నీటిమట్టం

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి భారీగా నీరు వస్తుండటంతో 583 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590అడుగులు. సాగర్ నుంచి మొత్తంగా 35,749 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి 1287.02 క్యూసెక్కుల వరద నీరు మూసీ రిజర్వాయర్‌కు చేరుతోంది. 645 అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రం 643.30 అడుగులకు చేరింది. ప్రాజెక్టు రెండు క్రస్టుగేట్ల నుంచి 1286.79 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో పంటల సాగుకు మరో 525.69 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కె.ఎన్. జయమ్మ స్ఫూర్తి పురస్కారం

కె.ఎన్. జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని సీనియర్ సంపాదకుడు, ఉపన్యాసకుడు, సాహిత్య విశ్లేషకుడు కె. శ్రీనివాస్ స్వీకరిస్తారు. ఆగస్టు 8 మ.2 గంటలకు పలమనేరులో జరిగే సాహిత్య కార్యక్రమంలో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. పురస్కారం కింద జ్ఞాపిక, ఇరవై ఐదువేల రూపాయల నగదు అందచేస్తారు. వివరాలకు: 94409 95010.

పలమనేరు బాలాజి

రాచకొండ సాహితీ పురస్కారం

రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రావి శాస్త్రి సాహితీ పురస్కార ప్రదాన సభ జూలై 30 సా.6గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం, ద్వారకానగర్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని దాట్ల దేవదానం రాజు స్వీకరిస్తారు. అధ్యక్షత గండికోట రఘురామారావు. సభలో రాచకొండ ఉమా కుమార శాస్త్రి, ప్రయాగ సుబ్రహ్మణ్యం, టి. రవిరాజు, డి.వి. సూర్యారావు, శిఖామణి ప్రసంగిస్తారు.

విశాఖ రసజ్ఞ వేదిక

'ద ద్వారం స్కూల్ ఆఫ్ వయొలిన్' ఇష్టాగోష్ఠి

వయొలిన్ కళాకారులు, సంగీత విద్వాంసులు ద్వారం దుర్గా ప్రసాదరావు గారు సంగీత, సాహిత్య, జీవన విషయాలపై రాసిన వ్యాస సంకలనం 'జీవాళి' ఇటీవల ప్రచురితమైన నేపథ్యంలో 'ద ద్వారం స్కూల్ ఆఫ్ వయొలిన్' పేరుతో ఆయనతో సోదాహరణ ప్రసంగం, ఇష్టాగోష్ఠి కార్యక్రమం ఆగస్ట్ 2 సా.6.30గం.లకు 'సప్తపర్ణి' సాంస్కృతిక కేంద్రం, ప్లాట్ 21, రోడ్ నెంబర్ 8, బంజారా హిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ద్వారం సత్యనారాయణ రావు వయొలిన్ కచేరితో కార్యక్రమం ప్రారంభమవుతుంది. మృదంగ సహకారం: శ్రీ పెరవలి జయభాస్కర్.

సుమనస్పతి

విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం, వరంగల్ ఇచ్చే ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం – 2025 కోసం విమర్శా గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. 2021 జూలై నుంచి 2025 జూన్ మధ్యలో ప్రచురితమైన విమర్శా గ్రంథాలు నాలుగు ప్రతులను ఆగస్టు 31 లోగా చిరునామా: బూర భిక్షపతి, ఇం. నెం: 2–12–293/20, రోడ్ నెంబర్ 2బి, విజయనగర్ కాలని, గోపాలపురం రోడ్, హనమకొండ – 506009, ఫోన్– 9866612712కు పంపాలి. ఎంపికైన గ్రంథకర్తకు అక్టోబర్ 2025లో హనుమకొండలో జరుగు ప్రత్యేక కార్యక్రమంలో రూ.5000 నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం ఉంటుంది.

బూర భిక్షపతి

నవీన జాను తెనుగు కవి

ప్రపంచీకరణ పెను దుమారం నుంచి కాపాడుకునే రక్షణ కవచాలు దేశీ రచనలు. దేశీయతలో భాగమైన జాను తెనుగుదనం జాతికి జవమూ జీవమూ. దేశీ కవిత్వం దేశీ రక్తమాంసాలతో నిర్మాణమవుతుంది. సామాన్యంగా ఉంటూ నైసర్గిక స్వభావంతో అలరారుతుంది. వస్తువులో రూపంలో భావంలో ప్రకటనలో స్థల కాలాలను ప్రతిబింబిస్తుంది. 'ఎవరిబిడ్డ! ఇది' అంటే, 'ఇది తెలుగువాడి బిడ్డ' అని గర్వంగా చెప్పుకునేటట్టుగా ఉంటుంది. ఈ బాటలో తెలుగు సాహిత్యంలో పాల్కురికి బాటకు ఆధునిక కొనసాగింపు అన్నవరం దేవేందర్.

ప్రాచీనకాలంలో "జాను తెనుగు విశేషము ప్రసన్నతకు" అన్న మాటలకూ, "సరళముగాగ భావములు జాను తెనుగున ఇంపు పెంపుతో" అన్న భావనకూ అక్షర సాక్ష్యం నేటి అన్నవరం దేవేందర్ కవిత్వం.

దేవేందర్ ఎనభయ్యవ దశకంలో 'జీవగడ్డ', 'ప్రతిపక్షం', 'అన్న', 'ఆంధ్ర జ్యోతి' మొదలైన పత్రికల్లో తెలంగాణ నుడికారంతో ప్రత్యేక శీర్షికలు నిర్వహించాడు. అప్పటి కల్లోల తెలంగాణ విప్లవ అలజడులను అధ్యయనం చేశాడు. తన ప్రాంతమైన హుస్నాబాద్ సాయుధ పోరాట కాలపు మొదటి ఎన్‌కౌంటర్‌కు, ఆసియాలోనే అతిపెద్ద స్తూప నిర్మాణానికి నిలువెత్తు సాక్ష్యం. తొంభయ్యవ దశకంలోనే ప్రాంతీయ ఆధిపత్యపు అణచివేత తీవ్రమైంది. అస్తిత్వ ఉద్యమాలు, ప్రపంచీకరణ ప్రభావాలు పురుడుపోసుకున్నాయి. హుస్నాబాద్‌లో రిక్కల సహదేవరెడ్డి మొదలైన వారితో కలిసి 1986లో 'నూతన సాహితి' స్థాపకులలో దేవేందర్ ఒకడుగా ఉన్నాడు. 'సిమాంట' పేరుతో ప్రాంతీయ కవితా సంకలనం వెలువరించాడు. 1993లో దళిత బహుజన సోయితో మొదలైన 'దళిత రచయితలు కవులు మేధావుల ఐక్య వేదిక' (దరకమే) కార్యశాల నిర్వహణలో పాలుపంచుకున్నాడు. ఈ స్థల కాలాల మీదుగా అన్నవరం దేవేందర్ విప్లవ భావజాలం, ప్రాంతీయ భాషా సంస్కృతుల పట్ల మమకారం, దళిత బహుజన అస్తిత్వ ప్రకటన, ప్రపంచీకరణ వ్యతిరేక దృక్పథంతో 'తొవ్వ', 'నడక' సంపుటాలతో కవిగా బయలుదేరాడు. ప్రపంచీకరణతో కుదేలైన పల్లెల ముఖచిత్రాన్ని 'మంకమ్మ తోట లేబర్ అడ్డా'గా ముద్రించాడు. 'బుడ్డ పర్కలు' నానీల సంపుటిలో కుల మత ఆధిపత్య దురహంకారాల మీద నిప్పు కణికలు విసిరాడు. 2001లో పురుడు పోసుకున్న 'తెలంగాణ రచయితల వేదిక' వ్యవస్థాపక సభ్యుడిగా ఉండి, ఆ వేదిక నుంచి వెలువడిన త్రైమాసిక పత్రిక 'సోయి'లో విస్తృతంగా భావజాల వ్యాప్తికి పాదులు వేశాడు. 'బొడ్డుమల్లె చెట్టు', 'పొద్దు పొడుపు', 'పొక్కిలి వాకిళ్ళ పులకరింత' పుస్తకాల్లో తెలంగాణోద్యమ చైతన్యాన్ని కవితా ప్రవాహం చేశాడు. నాటి నుండి నేటి వరకు నాలుగు దశాబ్దాలుగా విరామం లేకుండా కవిత్వం రాస్తున్నాడు.

అన్నవరం కవిత్వం భాషలో భావంలో ఈ కాలపు కవులందరికన్నా భిన్నమైనది. అది వర్తమాన చరిత్రను, తెలంగాణ సాంస్కృతికతను ప్రజల భాషలో ప్రకటిస్తుంది. జాతీయత దేశీయత అతని నుడికారంలో వ్యక్తమవుతుంది. సాధారణంగా వచన రచనల్లోనే సామెతలు, జాతీయాలు, పలుకుబడులు, కాకువు వంటి వాటిని ఎక్కువగా ప్రయోగిస్తుంటారు. అన్నవరం కవిత్వంలో అచ్చమైన దేశీయతా జాను తెనుగు లక్షణాలను పుణికిపుచ్చుకున్న జీవద్భాషా పరిమళాలు వీస్తాయి. వస్తువు విషయంలో స్థానీయతకు ప్రాధాన్యతను ఇచ్చినా ఇతర అంశాలను కవిత్వం చేసేటప్పుడు దాన్ని కూడా స్థానిక వేషభాషలతో రాణింపజేస్తాడు. భావ స్ఫూర్తి కోసం వినూత్న పదబంధాలను రూపొందించడం పాఠకుడిని ఆశ్చర్య చకితుణ్ణి చేస్తుంది. నిత్య జీవితంలో దర్శించే సామాన్య వస్తువులను ఒక జెన్ తాత్వికునిలా కొత్తగా పరిచయం చేస్తాడు అన్నవరం. జీవితంలోని వివిధ సందర్భాల్లోని సున్నిత భావ స్పందనలను కవిత్వంలోకి తీసుకువచ్చి తన కవితా ప్రయాణాన్ని కొత్త దారుల్లో నడిపిస్తాడు. అలంకరణ సామాగ్రి అంతా పల్లె నేపథ్యం నుంచి దృశ్యమానం చేస్తుంది.

"కళాత్మకంగా కుండను వానినట్టు
నాణ్యతగా చెప్పును ముడిచినట్టు



అందమైన చీరను నేసినట్టు
నేను కవిత్వాన్ని పదిలంగా అల్లుతాను" – అంటూ ఉత్పత్తి కులాల సృజన మూలమే తన కవితకు ఆయువుపట్టని స్పష్టంగా ప్రకటించాడు. "ఎల్లలు ఎన్ని దాటినా, నా మట్టి వాసనే నాకు పులకరింత, నా ప్రాదేశికత ముందు, ప్రపంచీకరణ గుడ్డ పేలిక, విస్తరిస్తున్న విశ్వీకరణకు, ప్రాంతీయాత్మే ప్రతిఘటన" అన్నప్పుడు అన్నవరం కవితలోని సూటిదనం మనల్ని ఆకట్టుకుంటుంది. "కోల్గేట్ యాప పుల్లను నమిలి మింగింది, రెక్సోనా గట్టి పిండిని ఎండగట్టింది, విమ్ బార్‌తో తౌడు కొట్టుకపోయింది, క్లినిక్ ప్లస్‌ల కుంకుడు కాయ మునిగింది" అన్న పాదాలలో ప్రపంచీకరణ ప్రభావాన్ని ప్రాంతీయ క్రియా పదాలతో స్పష్ట పరచడం అన్నవరం సరళాభివ్యక్తికి మచ్చు తునక. ప్రపంచీకరణతో పట్నం బాట పట్టిన రైతు కూలీల దీన స్థితిని "మంకమ్మ తోట లేబర్ అడ్డా మీద, బక్క చిక్కిన దేహాలన్నీ, లొట్ట బోయిన కండ్లతో చూస్తున్నాయి" అన్న దృశ్యంతో కరుణ రసాత్మకంగా మనస్సులో ముద్రించాడు. "దొడ్డు దొడ్డు నిఘంటువులు ఓరకు పెట్టి, ప్రబంధాలన్నీ కాసేపు తనబ్బిల దాసుకోండ్రి, ఏరుకోండ్రి ఏరుకోండ్రి, నిఘంటువుల కెక్కని నిఖార్సయిన పదాలు, తేట తేట పదాలు సామెతల సౌరభాలు" అని ఒక పల్లెటూరి గొంతుతో పలకడం అన్నవరం కవిత ప్రత్యేకత. పదాలను పునరావృత్తి చేసి దీప్తిమంతం చేయడం, మనస్సులో స్థిరమయ్యేట్టు చెయ్యడం అన్నవరం కవిత్వంలో కనిపిస్తుంది.

అన్నవరం దేవేందర్ కవిత్వమంతా ఊరును కేంద్రంగా చేసుకొని ప్రపంచాన్ని దర్శింప జేసే రీతిలో ఉంటుంది. "ఇల్లు వాకిలే కాదు, మా ఊరంటే సుత, నాకు పెయ్యంత పులకరింత, బడి, బాయి, ఎద్దూ ఎవుసం, వాగులు వాడలు, నన్ను నన్నుగా తీర్చిదిద్దిన శిల్ప రహస్యాలు" అంటూ తన కవితా శిల్పం ఊరి నుంచి తీసుకున్నదేననే విషయాన్ని గుర్తు చేస్తాడు దేవేందర్.

అన్నవరం కవిత్వమంతా ఊరును కేంద్రంగా చేసుకొని ప్రపంచాన్ని దర్శింపజేసే రీతిలో ఉంటుంది. "ఇల్లు వాకిలే కాదు, మా ఊరంటే సుత, నాకు పెయ్యంత పులకరింత, బడి, బాయి, ఎద్దూ ఎవుసం, వాగులు వాడలు, నన్ను నన్నుగా తీర్చిదిద్దిన శిల్ప రహస్యాలు" అని తన కవితా శిల్పం ఊరి నుంచి తీసుకున్నదేననే విషయాన్ని గుర్తు చేస్తాడు. అన్నవరం పుస్తకాల పేర్లు, కవితల శీర్షికలు జాను తెనుగుతనంతో శోభిస్తాయి. 'మంకమ్మ తోట లేబర్ అడ్డా', 'బుడ్డపర్కలు', 'పొద్దు పొడుపు', 'పొక్కిలి వాకిళ్ల పులకరింత', 'వరి గొలుసులు', 'గవాయి', 'ఊరి దస్తూరి' వంటి పుస్తకాల పేర్లు దీనికి నిదర్శనం. 'బీమారి', 'ఇగం', 'ఎటమటం', 'నీల్గుడు', 'పెయ్యికాక', 'బుదురకిచ్చు', 'పంచగజ్జ పలారం', 'అగిర్త', 'సొక్కం', 'జిట్టికండ్లు', 'సడక్', 'దస్కత్' వంటి ఎన్నెన్నో జాను పదాలు కవితా శీర్షికలై అలరిస్తాయి. జాను పదకల్పన అన్నవరంకు అల్కటి ముచ్చట. వీటిలో ఆధునిక పదజాలాన్ని కూడా వాడుకోవడం, ఆడుకోవడం కనిపిస్తుంది. ఉదాహరణకు: 'అమెరికాపురం', 'ఇడుపుల మాయ', 'పైస మొలక', 'పుస్తక వికసన', 'జియో సాలెగూడు', 'నెట్టురోగం', 'సెల్ గిచ్చుడు', 'వయసహంకారం', 'భయోమయం', 'ఎర్ర సెజ్'... వంటి వందలాది పదబంధాలు అన్నవరం సృజనాత్మక అభివ్యక్తిని సౌందర్యమయం, కళామయం చేస్తాయి. అన్నవరం కవిత్వ రూపంలో ఏ వస్తువునైనా తెలంగాణీకరించే ప్రత్యేకత ఉంది. తెలంగాణ నుడికారాన్ని నేర్పుగా వాడే శక్తి ఉంది. ఆధునిక నాగరిక భాషను తెలంగాణ నుడికారంలోకి తర్జుమా చేయగలిగే నైపుణ్యం ఉంది. కొత్త పదాలను, సమాసాలను పరికల్పన చేసే బహుముఖీన ప్రతిభ ఉంది. సందర్భోచితంగా భావ చిత్రాలు, మానవీకరణ, వ్యంగ్య భాష ద్వారా కవిత్వాన్ని దృశ్యీకరించే సొబగు ఉంది. ఆధునిక తెలుగు కవిత్వంలో అన్నవరం జాను తెనుగు కవిత్వానికి ప్రతినిధి అనడం సముచితమే.

(అన్నవరం దేవేందర్ దాశరథి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా)

■ **బూర్ల వెంకటేశ్వర్లు**
✆ 94915 98040

ఇద్దరు బంగారు తల్లులు



మీరు
నా గుండెపై
విప్పుకున్న పూల రేకులు
యదపై తారాడే రంగుల సీతాకోకలు

పాలపుంతల నక్షత్ర వీధుల్లో
ఆటలాడుకుని వస్తారు
అప్పుడు మీ అరమోడ్పు కళ్లలో
మిరుమిట్లుగొలిపే కాంతి రజను
నడిసముద్రపు లోతుల్లో
మునకలేసి వచ్చుంటారు
అందుకే మీ స్పర్శకి
వెచ్చని ఇసుక తడి

ఊహాతీత లోకాల్లోని
తూనీగల్లా మోసుకొచ్చిన
ప్రేమ పుప్పొడి
నాలో ఆకలిదప్పుల్ని దహిస్తుంది

మీ బోసి నవ్వులు
నీటి బుడగ కాలానికి
దిశ నిచ్చిన ప్రాణ వాయువులు
మీ బుల్లి బుల్లి వేళ్ళ అంచులతో
నా గుండెపై రాసిన కవితలకి
కిన్నెర రాగాలు కడతాను
అప్పుడు నా హృదయం
సుగంధభరితమౌతుంది
నేను నాకు అత్యంత
విలువైనదానిలా కనిపిస్తాను

నాలో నాకే తెలీని
ఎన్నో ఆశలూ భావాలు
రంగులూ కాంతులూ అనుభూతులూ
మీతో పాటే చిగురించాయి
మీలాగే అందంగా పెరిగి పెద్దయ్యాయి

ఎన్నడూ లేని
భయాలు ఆందోళనల్ని
మీ కౌగిళ్ళ వెచ్చదనంలోంచి
నేనెదుర్కొన్నాను

అమ్మచెట్టుకు అల్లుకున్న
పూలతీగలు మీరు
మీకు నే దన్నుననుకుంటాను గానీ
మీరు లేని నాకు ఉనికి లేదు
మీకన్నీ నేర్పానని విర్రవీగినా
నిజానికి నేర్చుకున్నది నేనే

రెక్కలొచ్చి ఎగిరినపుడు
మీ విశాల ఆకాశాన్ని నేనవుతాను
అలసిన మీ కాలిచక్రాలకి కందెన నేను
గెలుపోటముల బతుకాటలో
నవ్వినపుడు
మీ కన్నుల్లో వెలిగే కాంతి నేను
దుఃఖాలని ఎవరాపగలరు కానీ
మీ కన్నీటి చుక్కలన్నిటినీ
కాచి వడబోసి ముత్యాలుగా మలిచి
నా మెడకున్న తాళ్లతో
హారాలు కడతాను

జీవితపు మలుపుల్లో
సందిగ్ధపు దారులలో
అయోమయంగానో అసమంజసంతోనో
మీరు నన్ను వెతుక్కున్న రోజు
ఆ విలువైన హారాలు మీకు కానుకిస్తాను

ఇక్కడున్నా లేకపోయినా
ఎప్పటికీ
వాటికి పడబోయే చిక్కుముడులన్నిటినీ
విప్పుతూనే ఉంటాను.

■ **కవిత కుందుర్తి**

గొప్ప జాతరలా ఆవిష్కరణ!

నా మొదటి పుస్తకం

ఆశారాజు

ఇంత వరకు నావి 23 కవిత్వ సంపుటాలు వచ్చాయి. నా మొదటి పుస్తకం 'నేపథ్యం' 1991లో వచ్చింది. నేను కవిత్వంలోకి ఆలస్యంగా వచ్చినా చాలా విరివిగా కవిత్వం రాశాను. కొన్ని సార్లు ఒకే రోజు ఐదారు పేపర్లలో కవితలు వచ్చేవి.



ద్వారకా మిత్రులు రోజూ కలుసుకొంటున్న క్రమంలో– శివారెడ్డి సార్, దేవిప్రియ సార్, "నీ పుస్తకం రావాలి రాజూ," అన్నారు. నాకు ప్రచురణ గురించి ఏమీ తెలియదు. వాసిరెడ్డి నవీన్‌తో మాట్లాడి నన్ను కవితలు ఫెయిర్ చేసి తెమ్మన్నారు. వాళ్ల వాటిని చదివి, ఆలోచించి 'నేపథ్యం' టైటిల్ ఖాయం చేశారు. నవీన్ ఒక నాలుగు రోజుల తర్వాత డిటిపి పేపర్లు తెచ్చి నన్ను ప్రూఫ్‌లు చూడమన్నారు.



ముందుమాట కోసం శివారెడ్డి చాలా టైం తీసుకొని రాశారు. ఒకరోజు కవర్ పేజీ గురించి శీలా వీర్రాజు గారికి స్క్రిప్ట్ ఇచ్చి వచ్చాం. మరునాటి నుండి హైదరాబాద్‌లో మూడు రోజులు కర్ఫ్యూ. ఆ సమయంలో కవర్ పేజీ పూర్తయింది. కవర్ పేజీ బొమ్మను చూసి నేను థ్రిల్ అయ్యాను. వీర్రాజుగారు నన్ను కాచిగూడాకో మరెక్కడికో బ్లాకులు చేయించడానికి తీసుకెళ్లారు. బ్లాకులు వచ్చాక వాటిని నవీన్ గారికి అందజేశాను. అంతా నవీన్ గారే చూసుకొన్నారు. పుస్తకాన్ని చూడగానే నా కళ్లల్లో ఆనందం తడిసింది

ఆవిష్కరణ 1991 మార్చి 12న హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీ, చిక్కడపల్లిలో జరిగింది. సినారె ముఖ్య అతిథి, ఆవిష్కర్త. దేవిప్రియ అధ్యక్షులు. కవిత్వం గురించి మాట్లాడే వాళ్లు, పాపినేని శివశంకర్, స్మైల్. ఆనాటి పద్ధతి ప్రకారం ముందుమాట రాసిన శివారెడ్డిని వేదిక మీదికి పిలవలేదు. ఝరీ పోయెట్రీ సర్కిల్ సంప్రదాయం ప్రకారం పూల దండలు లేవు, శాలువాలు లేవు. ఆవిష్కరణ సభ గొప్ప జాతరలా జరిగింది. హాలంతా కిటకిట లాడింది. అంత మంది వస్తారనుకోలేదు. ఆ రోజు 70–80 కాపీలు అమ్ముడుపోయాయి. అప్పట్లో అది పెద్ద విషయం.

సినారె అద్భుతంగా మాట్లాడారు. గారడీవిద్యలా కవిత్వాన్ని ప్రదర్శించారు. మాంత్రికుడిలా మాటలు అల్లి మెస్మరైజ్ చేశారు. పుస్తకం చేతిలో పట్టుకొని, "నేను ఒక పేజీ తెరుస్తాను. అందులో కవిత్వం లేకపోతే, స్టేజీ దిగిపోతాను", అని, సవాల్ విసిరినట్టు, ఉప్పొంగి ప్రసంగించారు. దేవిప్రియ సార్ సభను ముషాయిరాలా జరిపారు. ఆయన మాట్లాడుతూ, "వీర్రాజు గారు కవరు పేజీ ఇలా వేశారు కానీ, ఆశారాజు ఒక చేతికి పూలదండ చుట్టి, మరొక చేతిలో సైకిల్ చైన్ పెట్టి, చార్మినార్ ముందు నిలుచున్నట్టు ఉంటే బాగుండేది", అని మురిసిపోయారు. ఒక నాటకంలా సభ ముగిసింది. సభ ముగిసిన తర్వాత చేరా, శివారెడ్డి, దేవిప్రియ, స్మైల్, జగన్నాథ శర్మ, పాపినేని గారి హోటల్‌కు, నాంపల్లి వెళ్లాం. అక్కడ రాత్రంతా కవిత్వం నిషాలో షైమరిచారు. ఒక లారీ నిండా ఫుడ్ వదిలేశారు. జగన్నాథ శర్మ జంధ్యం డాన్స్ చేసి రాత్రిని ఊపేశాడు. చేరా ఒలికి పోకుండా మునిలా నవ్వుతూ కూర్చున్నారు. అలా దృశ్యాలు దృశ్యాలుగా సభానంతర సభలో తెల్లవారింది.

asharaju.poet@gmail.com

రాసేటప్పుడు ఆ కథ పట్ల ఎంతో నిజాయితీ ఉంటే తప్ప రాయలేను

చదువు ముచ్చట

వి మల్లికార్జున్



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి ఇష్టపడ్డారు?

ఈ మధ్యనే జి. కళ్యాణరావు రాసిన 'అంటరాని వసంతం' నవల చదివాను. నన్ను జ్వరం పట్టుకున్నట్టు పట్టుకుందా పుస్తకం. దాదాపు వందేళ్ళపాటు సాగే ఏడు–ఎనిమిది తరాల జీవితాన్ని ఒడుపుగా అల్లిన విధానం నాకు బాగా నచ్చింది. నేనింకా ఎన్నెలదిన్ని దాటి రానే లేదు.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

నేను టీనేజీలో ఉన్నప్పుడు ఎక్కడో విని మా ఊరి లైబ్రరీలో ఉన్న చలం 'మైదానం' నవల చదివాను. నా మీద చెరగని ముద్ర వేసిన పుస్తకం అది. ఒకసారి చదివిన వెంటనే ఆ చివరి పేజీని అర్థం చేసుకోవడానికి మళ్ళీ వెంటనే పుస్తకమంతా చదివా. ఇప్పటికి చాలాసార్లు చదివా. ప్రతిసారీ అందులో కొత్త విషయమేదో దొరుకుతూ ఉంటుంది.

ఒకప్పటికీ ఇప్పటికీ మీ పుస్తకాల ఎంపిక, చదివే పద్ధతి ఎలా మారింది?

చిన్నప్పట్నుంచీ నాకు పుస్తకాలంటే ఇష్టమున్నా, నాకు తెలిసినవాళ్ళెవ్వరికీ పుస్తకాలు చదివే అలవాటు లేకపోవడంతో, మొదట్లో ఏది దొరికితే అది చదివేవాడ్ని. ఆ తర్వాత క్లాసిక్స్ అని విన్నవి చదివేవాడ్ని. కొన్నాళ్ళకు నేనేం ఇష్టపడుతున్నానో ఆలోచించి అర్థం చేసుకొని ఇవి నాకు నచ్చొచ్చు అని వెతుక్కొని చదువుతున్నా. ఈ ప్రయాణం గమ్మత్తుగా ఉంటుంది. ఒక్కోసారి పుస్తకం టైటిల్ చూసి చదువుతా. ఒక్కోసారి రచయిత గురించి తెలుసుకొని చదువుతా. ఏ రచయిత పుస్తకమైనా విపరీతంగా ప్రభావితం చేస్తే వాళ్ళ పుస్తకాలన్నీ చదివే ప్రయత్నం చేస్తా (బిభూతిభూషణ్ బంద్యోపాధ్యాయ, ఆల్బర్ట్ కామూ, ఫ్రాంజ్ కాఫ్కాలను అలాగే చదివా). ట్విటర్, రెడిట్ డిస్కషన్స్‌లో నాకు ఏ పుస్తకమైనా ఆసక్తి కలిగిస్తే చదువుతా. కంటెంపరరీ కూడా ఎక్కువే చదువుతా. ఇంత చదివినా ఎంత చదవకుండా ఉండిపోతున్నానో కదా అనిపిస్తుంది ఒక్కోసారి.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

దోస్తొయెవ్‌స్కీని కలవగలిగితే బాగుంటుందని ఎప్పుడూ అనుకుంటాను. ఆయన పుస్తకాల గురించి కంటే హ్యూమన్ సఫరింగ్ గురించి మాట్లాడవచ్చనుకుంటాను.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది?

ఆల్బర్ట్ కామూ 'ది స్ట్రేంజర్' నవలలోని మెర్సాల్ట్ పాత్ర నా ఆల్టర్ ఈగో అనిపిస్తుంది. మేమిద్దరమూ ఒకే కాలంలో ఒకే ప్రాంతంలో ఒకే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం గల ఇద్దరు మనుషులమేమో అనుకుంటాను. ఆ అబ్జర్డ్ పరిస్థితులకు ఇద్దరమూ లొంగిపోయేవాళ్ళమే అయినా అందుకు మేము ఎంచుకునే మార్గాలు భిన్నంగా ఉంటాయనిపిస్తుంది.

రచన విషయంలో మీకు ఉపయోగపడిన సలహా ఏదైనా?

రాయడనమనేది నాకు చాలా పర్సనల్. అంతే ప్రైవేట్ కూడా. ఇన్నేళ్ళలో ఏ పుస్తకమైనా రచయితైనా మనుషులైనా నన్ను ప్రభావితం చేసి ఉంటే అది నాలో భాగమై ఉండొచ్చేమో ఇప్పటికే. అలా కాకుండా ఏదైనా కచ్చితంగా చెప్పగలిగే ఒక సలహాను నేను రాయడానికో రాస్తూ ఉండటానికో ఎవరినుంచైనా తీసుకొని పాటిస్తున్నానా అంటే చెప్పలేను. ఒకటైతే నా అంతట నేను పాటించేది ఎప్పటికీ పోగొట్టుకోవద్దు అనుకుంటాను – అది నిజాయితీ. రాసేటప్పుడు ఆ కథ పట్ల ఎంతో నిజాయితీ ఉంటే తప్ప నేనది రాయలేను.

(వి. మల్లికార్జున్ కథా రచయిత. ఇప్పటిదాకా నాలుగు కథల పుస్తకాలు ప్రచురించారు. అవి: 'ఇరానీ కేఫ్' (2018), 'కాగితం పడవలు' (2019), 'నల్లగొండ కథలు' (2020), 'నానిగాడు' (2022))

✆ 70752 75454

నిజాంపై అజ్ఞానపు రాతలు



దాశరథి శత జయంతి ఉత్సవాల మీద జూలై 14 నాటి వివిధ లో టి. ఉదయవర్లు రాసిన వ్యాసంలో నాటి దక్కను రాజ్య అధినేత నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌పై అజ్ఞానంతో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన దక్కను వాస్తవ చరిత్రపై దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్న అవాస్తవాలనే తిరగ రాశారు. వందేళ్ళ కిందనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను స్థాపించి, ఆంధ్రా ప్రాంతం నుంచి డా. రాయప్రోలు సుబ్బారావును ఆహ్వానించి శాఖాధిపతిగా నియమించిన ఘనత నిజాంది. అలాంటి వ్యక్తి గురించి "తెలుగు మాట వినిపిస్తేనే వొంటిపై తేళ్లు పాకినట్లుగా వ్యవహరించినాడు" అని రాయడం తీవ్ర అభ్యంతరకరం. తెలుగు భాష కోసం హైదరాబాద్ తెలుగు అకాడెమీ (ఆ తర్వాత తెలుగు అకాడెమీగా మారింది) ని స్థాపించి, నిధులు ఇచ్చి, తెలుగు భాషను ప్రోత్సహించిన వ్యక్తి నిజాం. నిజాం ప్రభుత్వం తెలుగు భాషకు చేసిన సేవను సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి వాళ్ళు మెచ్చుకున్నారు. మహాకవి శ్రీశ్రీ మొదలుకొని నిజాం ప్రభుత్వంలో ఎంతోమంది తెలుగు వాళ్ళు ఉద్యోగం చేసారు. కురుగంటి సీతారామయ్య పంతులు లాంటి వారు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌ను శ్రీరాముడి అవతారం అని తెలుగులో రచనకూడా చేసాడు. మాడపాటి లాంటి వాళ్ళు కూడా ఏనాడూ నిజాం తెలుగును అణచి వేశాడు అననే లేదు కదా! దాశరథి గొప్పతనాన్ని చెప్పాలంటే నిజాంను దూషించాలి అన్న అపరిపక్వత వ్యాసంలో రావడం దురదృష్టకరం.

■ **రామ్, అజయ్**, హైదరాబాద్ డెక్కన్ రీసెర్చర్స్ గ్రూప్



1.
అనివార్యమయ్యే మరణాలు
ఛిద్రమయ్యే దేహాల మధ్య
మనిషి ఉనికిని
ఇంకా వెతుకుతూనే ఉంటావు



2.
ఎన్నో విరక్తుల మధ్య
ఎంతోకొంత బ్రతుకును
మిగుల్చుకుంటూనే ఉంటావు!
బ్రతుకు ఉన్నంత వరకు
చుట్టూ ప్రపంచం మాయమవ్వదు!



3.
ఏదో ఒక రోజు
మనుషులందరూ మన్నించి శాంతిస్తారు!
మిగిలిపోయిన భయాలు, సందేహాలు
దేహం చుట్టూ గోడలు కట్టేస్తూంటాయి!



4.
ఎప్పటికప్పుడు
ప్రేమాప్యాయతలు పెట్టే గాట్లు
అర్థం లేకపోయినా
అనుసరించాల్సిన శాంతి మంత్రాలు
ఉద్దేశాలకు అవతల వినిపించే పదాలు
బరువుగా తోచే అస్తిత్వాలు!



5.
తొలగించివేసిన అనవసరాలేవో
ఇంకా అంటిపెట్టుకున్న మమకారాలేవో
నిర్ధారణ లేని విషయాల మధ్య
విముక్తమయ్యే హృదయాలు ఏవని
వెతికి ఆరా తీస్తూంటావు!

■ **రాళ్ళబండి శశిశ్రీ**
✆ 74163 99396


భూపాలపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- చేసిన పనుల్ని చెప్పుకోలేకనే గత ఎన్నికల్లో ఓడిపోయాం..
- స్థానిక సంస్థల్లో గెలిచే వారినే గుర్తించి టికెట్లు ఇస్తాం..
- కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదని ముఖ్యమంత్రి మామే చెప్పిండు
- అందాల పోటీల్లో భామలకోసం ఒక్కోప్లేట్ భోజనం ఖర్చు లక్షల్లో
- గురుకులం విద్యార్థులకు బువ్వ పెట్టే తెలివైతే లేదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- భూపాలపల్లిలో కార్యకర్తల సమావేశంలో ప్రసంగం

ఒక్కటే గళం.. కేసీఆర్ దళం..

కృష్ణకాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఒక్కటే గళం.. కేసీఆర్ దళం.. అనే నినాదంతో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని, ఏదైనా మనస్పర్థలు, పొరపాట్లు ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలే తప్ప.. రోడ్డున పడొద్దని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) సూచించారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతుల నేతృత్వంలో గజ పూలమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతంతో ఓటమి చెందామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేవాళ్లను గుర్తించి టికెట్ ఇస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి పరిశీలకులు కూడా వస్తారని తెలిపారు. గ్రూపులు లేకుండా అందరు సమష్టిగా ఉండాలన్నారు. ఈ ఎన్నికలు చాలా కీలకమని, ఇప్పుడు సత్తాచాటితేనే శాసనసభ ఎన్నికల్లో రాణించగలమని కేటీఆర్ వెల్లడించాడు.

ప్రతీ ఇంటికి వెళ్లి పలకరించాలి..

అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, వాటన్నింటినీ చెప్పుకోలేకపోవడం వల్ల నే ఓటమిని చూడాల్సి వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇకనైనా కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలను పలకరించాలని సూచించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలోని నీళ్ల చంద్రబాబు, నిధులు

(మిగతా 7లో..)

పోలీసులకు భయపడొద్దు..

ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని అనుకోవద్దని, ఒక సంవత్సరం ఎన్నికల హడావుడితోనే సరిపోతుందని, ప్రస్తుతం మనకు రెండేళ్ల సమయం మాత్రమే ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఉత్సాహంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ తప్పిదాలు, ఇబ్బందుల్ని మీమీ గ్రామాలు, మండలాల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలన్నారు. అలా చేసిన వెంటనే పోలీసులు ఫోన్ చేస్తారని, వారికి ఎవరూ భయపడవద్దని సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీనో గెలిస్తే మళ్లీ మీ వద్దకే పోలీసులు వస్తారని స్పష్టం చేశారు. ఎలాంటి కేసులు పెట్టినా ఎదుర్కొనేందుకు లీగల్‌సెల్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.


పరకాలలో కేసీఆర్ కిట్ అందజేస్తున్న కేటీఆర్

గూండాయిజంతో పరిశ్రమలు తరలిపోతాయి..

- కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కాంగ్రెస్ దోపిడీ
- తమ వారికే ఉద్యోగాలు ఇవ్వాలని బెదిరింపులు
- బీసీలకు న్యాయం చేసింది కేసీఆరే..
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

7


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

- ఏ గాంధీ పేరు పెట్టినా సహించేది లేదు..
- కౌలు రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన రేవంత్‌రెడ్డి
- స్థానిక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలను నిలదీయాలి
- నాది రైతు కుటుంబం.. పొలంలో దిగి నాట్లు వేశా..
- వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- ఆగస్టు 6న జయశంకర్ జయంతి, జాగృతి ఉత్సవాలు వరంగల్‌లో నిర్వహిస్తాం..
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

7


బాలుర సింగిల్స్ లో విజేతగా నిలిచిన శశాంక్ వనమాల(నల్లగొండ)కు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి శ్రీసాయిహర్షిత్

వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ
- బాలుర సింగిల్స్‌లో శశాంక్ వనమాల, బాలికల విభాగంలో సరయు సూర్యనేని విజయం

6

నేడు జీడబ్ల్యూఎంసీలో
ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

వ్యాధుల కాలం.. జర పైలం..

- డెంగీ, చికున్‌గున్యా, మలేరియా ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని అంటున్న వైద్యులు

7

హద్దు, పద్దు లేక..

ఆక్రమణలకు గురవుతున్న నగర చెరువులు

- చెరువుల విస్తీర్ణంపై అధికారుల మీనమేషాలు
- సర్వే చేసి ఆరు నెలలు గడిచినా పట్టింపు లేనితనం
- ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు, యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు


చెరువును సర్వే చేస్తున్న దృశ్యం

హనుమకొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చెరువులకు రక్షణ లేకుండా పోతోంది. నిర్దిష్టమైన హద్దులు లేకుండాపోవడంతో కబ్జాదారులు ఆక్రమణలకు తెరలేపుతున్నారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో చెరువులు నామరూపాలు లేకుండా పోతున్నాయి. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో చెరువు శిఖాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తుండగా, రెండో రాజధానిగా పేరున్న వరంగల్‌లో అలాంటి చర్యలు లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్వే నామమాత్రం

కిందటేడు గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ, కాజీపేట, ఖిలా వరంగల్ పరిధిలో చెరువుల రక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. సుమారు 73 చెరువుల్లో అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఇరిగేషన్ శాఖ అధికారులు డ్రోన్ కెమెరాలతో సర్వే చేశారు. ఆపై జిల్లా రెవెన్యూ అధికారులకు డిజిటల్ మ్యాపింగ్‌తో సర్వే రిపోర్ట్‌ను పంపించారు. అయితే ఆరు నెలలు గడిచినా చెరువులకు రెవెన్యూ శాఖ అధికారులు డిజిటల్ మ్యాపింగ్ ఫిక్స్ చేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో కబ్జాదారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలతో పాటు క్రయ విక్రయాలు చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని చిన్న వడ్డెపల్లి, బంధం చెరువు, భద్రకాళి చెరువు, సంతోషిమాత ఎఫ్‌టీఎల్ పరిధిలో చెరువు భూములు అన్యాక్రాంతానికి గురైనట్లు అధికారులే చెబుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతానికి

(మిగతా 8వ పేజీలో...)

అధికారులపై ఆగ్రహం

కిందటేడు అక్టోబరు నెలలో గ్రేటర్ వరంగల్‌లోని 73 చెరువులను డ్రోన్ కెమెరాల ద్వారా సర్వే చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై స్థానిక ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో చెరువుల హద్దులకు సంబంధించి డిజిటల్ మ్యాప్ సిద్ధం చేయలేకపోతున్నట్లు కొందరు అధికారులు వాపోతున్నారు.

ముల్కనూర్ గ్రంథాలయం ఆదర్శనీయం

- తెలుగు సాహిత్యంపై పోటీ ఉండాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


ముల్కనూర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రంథాలయాలకు ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం ఆదర్శగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాత్రి ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీలకు బహుమతులను ప్రజా గ్రంథాలయం అధ్యక్షుడు వంగ రవి అధ్యక్షతన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాలకు పునరుజ్జీవానికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంపై ఆరోగ్యపరమైన పోటీ ఉండాలన్నారు. అప్పుడే నాణ్యమైన తెలుగు సాహిత్యం బయటకు వస్తుందన్నారు. విద్య ఉన్నప్పుడే వారికి సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్యం జగన్నాథ రథచక్రాలుగా ముందుకు సాగాలన్నారు. ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కాగా, కిందటేడు జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీలకు సంబంధించిన పుస్తకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. నమస్తే తెలంగాణ, ముల్కనూర్ సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలకు 470 కథలు పోటీకి వచ్చాయని ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం ముఖ్య సలహాదారు వేముల శ్రీనివాసులు తెలిపారు. అంతకు ముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కొప్పూర్ గ్రామంలో రూ. 3.29కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. కొత్తకొండలో రూ. 20లక్షలతో

(మిగతా 8వ పేజీలో...)


చర్చావేదికలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

'వరంగల్'ను విభజించి
ఆగం చేశారు..

- గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధిలో వెనుకంజ
- వరంగల్, హనుమకొండను ఒకే జిల్లాగా మార్చి అభివృద్ధి చేయాలి
- ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు
- హనుమకొండలో మేధావుల చర్చా వేదిక

6



లక్నవరంలో బోటింగ్ పునఃప్రారంభం

111 రోజుల విరామం తర్వాత షురూ..

గోవిందరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రకృతి రమణీయ తీరం లక్నవరం సరస్సు పర్యాటకులకు మళ్లీ ఆహ్వానం పలుకుతోంది. జలకళతో కళకళలాడుతున్న సరస్సులో 111రోజుల సుదీర్ఘ విరామం తర్వాత బోటింగ్ ప్రారంభమైంది. వేసవి తాపానికి సరస్సులోని నీరంతా అడుగంటిపోవడంతో ఏప్రిల్ 7న పర్యాటక శాఖ అధికారులు బోటింగ్‌ను నిలిపివేశారు. దీంతో పర్యాటకుల రాక తగ్గింది. ప్రధానమైన రెండు, మూడో ఐలాండ్‌లలోని అధునాతన కాటేజీలు ఇన్ని రోజులు వెలవెలబోయాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు, ముంచెత్తిన వరదలతో సరస్సులోకి గరిష్ఠ స్థాయిలో నీటిమట్టం చేరింది. సరస్సు చుట్టుపక్కల పరిసరాలన్నీ పసరిక అందాలను సంతరించుకున్నాయి. ప్రకృతిని ఆస్వాదించేందుకు పర్యాటకులు నిత్యం వేలాదిగా తరలివస్తున్నారు. ఈనేపథ్యంలో లక్నవరం టూరిజంలో ప్రత్యేక ఆకర్షణ అయిన బోటింగ్‌ను ఆదివారం మేనేజర్ శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రకృతి ప్రేమికులు బోటుషికారు చేస్తూ ఆనందంగా గడిపారు. కాటేజీల ఆన్‌లైన్ బుకింగ్‌లు కూడా పెరిగినట్లు అధికారులు తెలిపారు.

బొగత సందర్శనకు అనుమతి



వాజేడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అడవీ ప్రాంతంలోని బొగత జలపాతం సందర్శనకు సోమవారం నుంచి అనుమతిస్తూ అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా ఈనెల 23 నుంచి బొగత సందర్శనను అధికారులు నిలిపివేశారు. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టడంతో సందర్శనను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. వీక్షణ మాత్రమే అనుమతి ఉంటుందని, ఈత కొలను దిగి స్నానాలు చేయొద్దని పేర్కొన్నారు.

ఏసీ బస్సులకు తగ్గిన టికెట్ ధర

హనుమకొండ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, బెంగుళూరుకు వెళ్లే లహరి, ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులలో జూలై 26 నుంచి టికెట్ ధర తగ్గించినట్లు వరంగల్ -1 డిపో మేనేజర్ పి.అర్పిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధరలలో ఎలాంటి మార్పు లేదని, హైదరాబాద్ నుంచి బెంగుళూర్‌కు వెళ్లే బస్సులలో టికెట్ ధర తగ్గినట్లు తెలిపారు. గతంలో లహరి బస్సు ఒకరికి బెంగుళూరుకి రూ. 1440 ఉండగా, రూ.1250 తగ్గించినట్లు, స్లీపర్ చార్జి రూ.1800 ఉండగా, రూ. 1620కి తగ్గించినట్లు, లగ్జరీ బస్సులలో హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు రూ.1080 ఉండగా, రూ.990 తగ్గించినట్లు వరంగల్ -1 డిపో మేనేజర్ అర్పిత ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గార్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముల్కనూరు ఎంపీపీఎస్ ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు ధారవత్ నరేష్‌ను సస్పెండ్ చేస్తూ మండల విద్యాశాఖాధికారి మంకిడి వీరభద్రం ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో క్రిమినల్ కేసు ఉన్న విషయాన్ని దాచిపెట్టి ప్రభుత్వ ఉద్యోగంలో చేరి విధులు నిర్వహించడంలో డీఈవో ఆదేశాలమేరకు విచారణ చేపట్టి విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

నకిలీ వైద్యులపై కేసు నమోదు

వరంగల్ మెడికల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు నమోదైంది. హనుమకొండ జులైవాడలోని యశస్వి క్లినిక్ నిర్వాహకుడు కె.రాజు, దీన్‌దయాల్‌నగర్‌లోని అభిరామ్ క్లినిక్ నిర్వాహకుడు ఇ.మహేందర్‌లపై ఎన్ఎంసీ చట్టం 34 54 టీఎస్ఎంపీఆర్ చట్టం 22, బీఎన్ఎస్ 318, 319 ప్రకారం ఆదివారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్, చైర్మన్ డాక్టర్ కె.నరేశ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఎలాంటి అర్హత లేకుండా అలోపతి, మోడర్న్ మెడిసిన్ వైద్య సేవలు అందించరాదని, ప్రథమ చికిత్స ముసుగులో ఇష్టం వచ్చినటు వైద్యం చేస్తే చట్ట ప్రకారం యేడాది జైలుశిక్ష, రూ.5లక్షల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా
తీర్చిదిద్దేందుకు సీఎం కృషి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ● ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో విజయం సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి శ్రీసాయిహర్షిత్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 27(ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఎడ్యుకేషన్, హెల్త్, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్, కిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడురోజులుగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా దూసుకుపోతూ విజయాన్ని అందిపుచ్చుకున్నారు. క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన మహబూబాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేదు.

కాగా, బాలుర సింగిల్స్ ఫైనల్స్‌లో శశాంక్ వనమాల (నల్లగొండ) వర్సెస్ యువ సూర్య (హైదరాబాద్) మధ్య పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. ముందు నుంచే శశాంక్ దూకుడుగా ఆడుతూ యువ సూర్యను రెండు సెట్లలో ఓడించి విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, యువసూర్య ద్వితీయ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ పాఠశాల నిర్మించాలని సీఎంకు విన్నవించగా స్పందించి పది రోజుల్లో విధివిధానాలను రూపొందించాలని అధికారులకు ఆదేశాల జారీ చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా ఆగస్టు 15న హనుమకొండ జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా స్పోర్ట్స్ పాఠశాలలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారన్నారు. అతి త్వరలోనే నగరంలో స్పోర్ట్స్ పాఠశాలతో పాటు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణం చేపట్టడం ఖాయమన్నారు.

మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్‌లు మాట్లాడుతూ.. మూడు రోజులుగా ఆఫీసర్స్ క్లబ్, కిట్స్ కళాశాలలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీని పండుగా వాతవరణంలో నిర్వహించడమే కాకుండా, క్రీడాకారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సౌకర్యాలను కల్పించామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన షట్లర్లు డిసెంబర్ మొదటి వారంలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి శ్రీసాయిహర్షిత్ శాఖమూరి, డీసీపీ (ఎస్‌టీవో మాదాపూర్) పుల్లా శోభన్‌కుమార్, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అంతర్జాతీయ పూర్వపు బ్యాడ్మింటన్ క్రీడాకారులు సీఎం శశిధర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్, వరంగల్ క్లబ్ ఇన్‌చార్జి కార్యదర్శి బి.కన్నారెడ్డి, షటిల్ కోర్టు ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, సభ్యులు నేరెళ్ల విజయ్, వద్దిరాజు వెంకన్న, సురభి కిరణ్, అమరలింగేశ్వర్, మనోహర్‌రావు, టోర్నమెంట్ అబ్జర్వర్లు యూవీఎస్. బాబు, రెఫరీ కె.హనుమంతరావు, మ్యాచ్ కంట్రోల్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- అండర్ -17 బాలుర సింగిల్స్‌లో..: శశాంక్ వనమాల (నల్లగొండ) వర్సెస్ జె.యువ సూర్య (హైదరాబాద్)పై 15-11, 17-15 తేడాతో శశాంక్ గెలుపొందాడు.
- బాలికల విభాగంలో.. : సరయు సూర్యనేని (హైదరాబాద్), ప్రాంజల నిసర్గ (రంగారెడ్డి)పై 9-15, 15-12, 15-12 తేడాతో విజయం.
- బాలుర డబుల్స్‌లో.. : బుడిద తనీష్‌రెడ్డి (రంగారెడ్డి), తన్మయి నిహాల్ ఉత్తం (కరీంనగర్) వర్సెస్ అక్షత్‌రెడ్డి బెంజారం (రంగారెడ్డి), వజ్రాచౌదరి అలూరి (రంగారెడ్డి)పై 15-11, 15-9 తేడాతో విజయం.
- బాలికల డబుల్స్‌లో..: హెచ్ఎం శ్రీదేవికాదిశ్య (సంగారెడ్డి), వై.శృతి (సంగారెడ్డి)వర్సెస్ ఆరాధ్యరెడ్డి హన్మంతయ్యగారి(రంగారెడ్డి), అవనిరెడ్డి హన్మంతయ్యగారి (రంగారెడ్డి)పై 15-13, 15-10 తేడాతో విజయం.
- మిక్స్‌డ్ డబుల్స్‌లో.. : ఎస్.అఖిలేష్‌గౌడ్ (నల్లగొండ), రిత్విక్‌శ్రీ (భద్రాద్రి కొత్తగూడెం)వర్సెస్ వినయ్ అబ్బూరి (మేడ్చల్), వైనవి తాడూరి (హైదరాబాద్)పై 15-6, 9-15, 15-12 తేడాతో విజయం సాధించారు.

హెచ్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా
శ్యామల పవన్‌కుమార్



వరంగల్ స్పోర్ట్స్, జూలై 27(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఎఫ్ఐ) సంయుక్త కార్యదర్శిగా హనుమకొండకు చెందిన శ్యామల పవన్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో సర్వసభ్య సమావేశం, ఎగ్జిక్యూటివ్ 2025-28 ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ మేరకు హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులుగా మహేష్‌కుమార్ చౌహాన్, ప్రీతిపాల్‌సింగ్ సలూజు, కోశాధికారిగా డాక్టర్ గురు చరణ్‌సింగ్ గిల్‌లు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. అదే విధంగా తెలంగాణ నుంచి హనుమకొండకు చెందిన శ్యామల పవన్‌కుమార్ ఇప్పటికే హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తనకు హెచ్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా నియామకానికి సహకరించిన హెచ్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులకు, రాష్ట్ర కమిటీ సభ్యులకు పవన్ కుమార్ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. కాగా హనుమకొండ జిల్లాకు చెందిన పవన్‌కుమార్ హెచ్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియామితులు కావడంతో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.5కోట్లతో మేడారంలో
అతిథి గృహం

పరిపాలనా అనుమతి ఉత్తర్వులు జారీ

హనుమకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాంగణంలో అన్ని హంగులతో కూడిన ఆధునాతన అతిథి గృహాన్ని రూ.5కోట్లతో నిర్మించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇస్తూ ఈనెల 24న ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అతిథి గృహంలో నాలుగు సూట్లు ఉంటాయి. రోడ్లు, భవనాల శాఖ సెక్షన్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంటుంది. వచ్చే యేడు జనవరిలో మహాజాతర ప్రారంభం కావడానికి ముందే భవన నిర్మాణం పూర్తి చేయనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తోంది. జాతర ప్రాంగణంలో ప్రస్తుతం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న అతిథి గృహం పాతపడిపోవడమే కాకుండా వసతులు లేవు. జాతరకు వివిధ శాఖల అధికారులతో పాటు ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వస్తారు. వారి సౌకర్యార్థం ఈ అతిథి గృహాన్ని నిర్మిస్తున్నారు.

ఉప్పల్ ఆర్వోబీపై గడ్డర్ల బిగింపు

3 గంటలు రైళ్లు ఆపి.. చెన్నై నుంచి క్రేన్లు తెప్పించి..

కమలాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ మండలం ఉప్పల్ ఆర్వోబీ పనుల్లో కీలక ఘట్టమైన గడ్డర్ల బిగింపు పనులను ఆదివారం రైల్వే అధికారులు పూర్తి చేశారు. కేంద్ర మంత్రి సంజయ్ ఇటీవల రైల్వే శాఖ అధికారులతో ఉప్పల్ ఆర్వోబీ పనులపై చర్చించారు. రైల్వే జీఎం, ఏజీఎంతో బండి సంజయ్ మాట్లాడి పనులు చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం సాయంత్రం చెన్నై నుంచి ఉప్పల్ ఆర్వోబీ వద్దకు క్రేన్లు చేరుకున్నాయి. సుమారు 3 గంటల పాటు జమ్మికుంట, ఉప్పల్ వైపు వెళ్లే రైళ్ల రాకపోకలను ఆదివారం నిలిపివేశారు. చెన్నై నుంచి తెప్పించిన క్రేన్లతో పాటు అందుబాటులో ఉన్న మరో క్రేన్‌తో గడ్డర్లను బిగించి కీలక ఘట్టాన్ని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ పూర్తి చేశారు. దీంతో ఆగస్టు నెల చివరి వారంలోపు ప్రజలకు ఆర్వోబీ అందుబాటులోకి వస్తుందని, రాకపోకలు జరుపవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.



ఉప్పల్ రైల్వేలైన్‌పై గడ్డర్లను బిగించిన దృశ్యం

పూర్వపు వరంగల్ జిల్లాను
విభజించి ఆగం చేశారు..

వరంగల్, హనుమకొండలను ఒకే జిల్లాగా చేసి అభివృద్ధి చేయాలి

చర్చా వేదికలో ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు



హనుమకొండలో చర్చా వేదికలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

హనుమకొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పూర్వపు వరంగల్‌జిల్లాను గత పాలకులు అడ్డగోలుగా విభజించి అభివృద్ధి చేయకుండా ఆగం చేశారని ప్రముఖ సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆరోపించారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే జిల్లాగా కలపాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ప్రముఖులు, మేధావులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడారు.

పూర్వపు వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా విభజించి రాజకీయ చైతన్యం ఎదగకుండా గత పాలకులు విభజించారని అన్నారు. పౌర సమాజం చైతన్యంతో హనుమకొండ జిల్లాను వరంగల్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా గతం, వర్తమానం, భవిష్యత్తును గుర్తుంచుకోవాలని, దాని రాజకీయ చైతన్యాన్ని, చరిత్రను, అభివృద్ధి గతిని కాపాడుకోవాలని కోరారు. జిల్లాను ఆశాస్త్రీయంగా విభజించి అభివృద్ధిని అడ్డుకున్నారని పేర్కొన్నారు. వరంగల్ వ్యాపార పారిశ్రామిక కేంద్రమని, హనుమకొండ ప్రభుత్వ కార్యాలయాలు విద్యా సంస్థలకు కేంద్రమని, అర్థం చేసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లాను విభజించడం వలన ఉమ్మడి జిల్లాకు ఉన్న న్యాయవ్యవస్థ తన శక్తిని కోల్పోయిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి జిల్లాలను కలపడమే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, కన్నెబోయిన రాజయ్యయాదవ్, సీపీఎం నాయకులు చుక్కయ్య, ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు నున్నా అప్పారావు, ఎం.డి. అబూబక్కర్, చిల్లా రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.150 కోట్లతో మేడారం అభివృద్ధి

శాశ్వత సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టాం : రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మేడారంలోని వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానాన్ని రూ.150కోట్లతో అభివృద్ధి చేస్తామని, భక్తులకు శాశ్వత సకల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తామని పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో మంత్రి ఆదివారం పర్యటించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా జంపన్నవాగు పరిసరాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రూ.5కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు పరిసరాలు వంతెనలకు ఇరువైపులా భక్తులను ఆకర్షించేలా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు వాతావరణ సూచనలు, వరదల ఉధృతి తెలియజేస్తూ ఉండాలన్నారు. అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో పూజారులతో సమావేశమై మేడారం దేవస్థానం అభివృద్ధి పనులపై మాట్లాడారు. గద్దెల వద్ద జరుగనున్న అభివృద్ధి పనులలో భాగంగా గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను ప్రాంగణంలో స్థల మార్పు గురించి చర్చించారు. మహాజాతరలో భక్తులందరికీ నలుగురు దేవతల దర్శనం కలిగేలా ఎగ్జిట్ గేట్ల వద్ద పునఃప్రతిష్ఠాపన పనులు చేపట్టాలన్నారు. గద్దెల ప్రాంగణం తిరిగి పరిశీలించిన మంత్రి పూజారులు సూచనల మేరకు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసి మంత్రికి తల్లుల ప్రసాదాలను అందించారు.

ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో విలేకరులతో మంత్రి సీతక్క మాట్లాడారు. మేడారం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్ని కోట్లు ఖర్చయినా నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. మేడారం వనదేవతల చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు భావి తరాలకు తెలిసేలా అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. మాస్టర్ ప్లాన్‌పై తప్పుడు ప్రచారాలు సరికాదని, పూజారుల నిర్ణయాలతో అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందుతాయని అన్నారు. 2026 మహాజాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత ఏర్పాట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖులు బస చేయడానికి అతిథిగృహాల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, తాడ్వాయి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వరావు నాయకులు బత్తిని రాజు, ఇర్ప సునీల్, పీరిల వెంకన్న పులి సంపత్, చర్ప రవీందర్, సంజీవరెడ్డి, మడకం శోభన్, నూనవత్ శ్రీను, నేతాజీ, తోలెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు సామాజిక బాధ్యత ఉండాలి

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులకు సామాజిక బాధ్యత ఉండాలని, నైతిక విలువలను మరిచిపోవద్దని, అప్పుడే సమాజంలో ఆదరణ లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఆదివారం వరంగల్ జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నైతిక నియమాలు - మీడియా చట్టాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం వార్తల సేకరణ సులభతరం అయిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమీ అన్ని చర్యలను చేపట్టిందని, అందులో భాగంగానే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. పాత్రికేయులు నైతిక విలువలు కాపాడుకోవడంతో పాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడే ప్రజల్లో గౌరవం పెరుగుతుందని, జర్నలిస్టులు నైతిక విలువలు పాటించాలని సూచించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్, నాన్ జర్నలిస్ట్ తదితర అంశాలపై ఆయన వివరించారు. భవిష్యత్తులో పత్రిక నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించబోతోందని, రాబోవు కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరపున నిర్వహిస్తామని అన్నారు.


ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు - మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్తున్నాయని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ చిల్ల మల్లేశం మాట్లాడుతూ.. భాష, తప్పొప్పులు, దిద్దుబాట్ల గురించి వివరించారు. రిపోర్టర్లు వాడుక భాషలో మాత్రమే వార్తలను డెస్క్‌కు పంపాలని, అవసరంలేని సాహిత్య పదజాలం, అర్థం కాని తెలుగు పదాలను ఉపయోగించకూడదని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం-2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్ శైలేష్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) అధ్యక్షుడు శ్రీరామ్‌చందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, డీపీఆర్‌వో ఆయూబ్ అలీ, తాళ్లపద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ వరుణ్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వ్యాధుల కాలం.. జర పైలం..

- వర్షాలతో ఇళ్లలో పెరుగుతున్న దోమలు
- డెంగీ, చికున్‌గున్యా, మలేరియా ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



వరంగల్ మెడికల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు, విషజ్వరాలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో సీజనల్ విష జ్వరాలతో పాటు కలుషిత నీరు కారణంగా డయేరియా, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉంటుంది. దోమలు వృద్ధి చెంది దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

డయేరియా, అతిసార వ్యాధి

కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల డయేరియా సోకుతుంది. వ్యాధి సోకిన వారికి నీళ్ల విరోచనాలు అవుతాయి. రోజుకు నాలుగైదు సార్లు విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. అతిసార వ్యాధి కూడా కలుషిత నీరు, ఆహార పదార్థాలతో సోకుతుంది. రోగికి 10 నుంచి 20 సార్లు నీళ్ల విరోచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువ అవుతాయి. ఈవ్యాధి సోకిన వారు నీరసించి పోతారు. రక్తపోటు కూడా తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

రక్త విరోచనాలు

ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని సమయాల్లో తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రక్త విరోచనాలు అవుతుంటాయి. ఈ రక్త విరోచనాలు చూసి ప్రజలు భయపడకుండా వైద్యుల సహాయం తీసుకోవాలి.

జాగ్రత్తలు

- రక్త విరోచనాలు జరిగినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- డయేరియా సోకిన రోగికి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి.
- రోగికి కొబ్బరినీళ్లు, మజ్జిగ, కొన్నిరకాల శీతల పానీయాలు ఇవ్వాలి.
- లీటర్ నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను కలిపి మూడు నుంచి నాలుగు గంటలకోసారి తాగించాలి.
- ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయట ఆహారం తీసుకోరాదు.
- నిల్వ ఆహార పదార్థాలు తినొద్దు
- విరోచనానికి వెళ్లిన తరువాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

వైరల్ ఫీవర్ (విష జ్వరం)

వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్ సోకుతుంది. ఒకరికి విషజ్వరం వస్తే కుటుంబ సభ్యులు కూడా ఆ వ్యాధిన పడే అవకాశాలు ఉన్నాయి. రోగికి 103 నుంచి 107 ఫారన్‌హీట్ వరకు జ్వరం ఉంటుంది. గొంతునొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటి నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

చికున్‌గున్యా



డెంగీ కారక దోమకాటుతో చికున్‌గున్యా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిని కుట్టిన దోమలు మరొకరిని కుట్టడం ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ రకమైన జ్వరం వచ్చిన వారికి ఒంటి, కీళ్ల నొప్పులు ఉంటాయి. కాళ్లు, చేతుల్లో వాపులు కూడా కనిపిస్తాయి. మూడు నుంచి ఆరు నెలలపాటు ఈ నొప్పులు తగ్గవు.

డెంగీ

నీటిలో పెరిగే ఎడిస్ అనే దోమకాటుతో డెంగీ జ్వరం సోకుతుంది. మానవ శరీరంలోకి డెంగీ వైరస్ ప్రవేశించిన వారం రోజులకు మనుషులకు వ్యాపింపజేస్తుంది. దోమ కుట్టిన వారం రోజులకు విపరీతమైన జ్వరం ఆకస్మికంగా వస్తుంది. కొందరిలో శరీరంపై పొక్కులు, రాషెస్ లాంటివి కూడా వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన, కడుపునొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి కారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతున్న ప్లేట్లెట్స్‌ను తినేస్తుంది. దీంతో రోగిలో ప్లేట్లెట్స్ సంఖ్య గణనీయంగా తగ్గి అంతర్గత బ్లీడింగ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్తలు

నీటిపై ఉండే దోమల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అందుకే నీరు నిల్వ ఉండే బిందెలపై కచ్చితంగా మూతలు ఉంచాలి. డెంగీ జ్వరంతో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు వైద్యుడిని సంప్రదిస్తూ చికిత్స పొందాలి.

పెరుగుతున్న మలేరియా, డెంగీ కేసులు

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మలేరియా, డెంగీ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు ఈ ఏడాది 16 డెంగీ పాజిటివ్ కేసులు, రెండు మలేరియా కేసులు నమోదు అయ్యాయి. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 16 డెంగీ, 5 మలేరియా కేసులు నమోదు అయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రిలో ఇప్పటి వరకు ఈ ఏడాది 43 డెంగీ పాజిటివ్‌లు, 86 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంజీఎంకు వచ్చిన కేసుల్లో ఒక్క ములుగు జిల్లా నుంచి ఈ నెలలో 19 మలేరియా పాజిటీవ్‌లు నమోదు అయినట్లు తెలుస్తుంది.

మలేరియా

వర్షాకాలంలో దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మలేరియా ప్రధానమైనది. దోమ కుట్టిన పది నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్నిసార్లు వాంతులు అవుతాయి. జ్వరం వచ్చిన తొలి రోజునే మలేరియాను నిర్ధారించవచ్చు. మలేరియా వ్యాధికి సకాలంలోచికిత్స అందించకపోతే కాలేయం, కిడ్నీ, గుండె రక్తనాళాలపై మలేరియా ప్రభావం పడి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రమాదం

డాక్టర్ ఎం.దేవేందర్, జనరల్ ఫిజీషియన్, హనుమకొండ



శరీర ఉష్ణోగ్రత పెరిగి ప్లేట్‌లెట్స్ సంఖ్యతగ్గితే ప్రమాదం. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. వర్షాకాల సీజన్‌లో సొంత వైద్యం చేసుకోవడం వల్ల ఆరోగ్యం మరింత క్షీణించే ప్రమాదం ఉంటుంది. వాంతులు, విరోచనాలను ఈ సీజన్‌లో తేలిగ్గా తీసుకోవద్దు. పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కూలర్స్‌లోని నీటిని తొలగించాలి. మలేరియా జ్వరాను నిర్లక్ష్యం చేస్తే మెదడుకు చేరే ప్రమాదం ఉంటుంది. కొన్ని రకాల జ్వరాల వల్ల అంతర్గత రక్తస్రావం జరిగి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది. అర్హులైన వైద్యులచే సకాలంలో చికిత్స పొందితే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యశాఖ అప్రమత్తం

డాక్టర్ అప్పయ్య, డీఎంహెచ్‌వో, హనుమకొండ



ప్రస్తుత వర్షాకాల సీజన్‌ను ఎదుర్కొనేందుకు ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు అర్బన్ హెల్త్ సెంటర్లలో 30 రకాల మందులను అందుబాటులో ఉంచాం. రక్త పరీక్షలకు సంబంధించి రీఏజెంట్లతోపాటు డెంగీ, మలేరియా కిట్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా పాజిటివ్ కేసులు నమోదైతే దోమల నివారణకు ఉపయోగించే పైరత్రం, ఏసీఎం స్ప్రేలు అందుబాటులో ఉన్నాయి. ఎవరికి వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సమాజం పరిశుభ్రంగా ఉంటుంది.



జాలువారుతున్న జలపాతం..

మహబూబాబాద్ జిల్లా బయ్యారం గుట్టల్లో జలపాతం కనువిందు చేస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో అటవీ ప్రాంతం నుంచి గుట్టల ద్వారా వరద నీరు వచ్చి జలపాతం నుంచి జాలువారుతోంది. పర్యాటకులు, యువకులు జలపాతానికి వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/హనుమకొండ

భవానికి సఫల్ కళారత్న అవార్డు

హసన్‌పర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సంగీతంలో రాణిస్తున్న ప్రముఖ గాయకురాలు పిట్ట భవానికి ఆదివారం సఫల్ భారతీయ కళారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని హనుమకొండ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ సంగీతం సమాజాన్ని చైతన్యం చేసే శక్తివంతమైన సాధనమన్నారు. సంగీతంతో పాటు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేస్తానని అన్నారు.

ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

- కౌలు రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన రేవంత్‌రెడ్డి
- వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కవిత

హనుమకొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరులో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు రాణిరుద్రమదేవి పేరు పెట్టాలని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ గాంధీ పేరు పెట్టినా సహించమని హెచ్చరించారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. కౌలు రైతుల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. రైతులను, కౌలు రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాంటి శిక్ష విధించాలో చెప్పాలని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో ప్రచారానికి వస్తే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు వస్తేనే రైతు భరోసా నిధులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. తమది రైతు కుటుంబం అని, పొలం మడుల్లో దిగి నాట్లు వేశానని కవిత చెప్పారు. అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన హాఫ్ సెంచరీ దాటిందని, ఇప్పటి వరకు ప్రధానికి రైతుల సమస్యలు వివరించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలైనా రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ధర్మసాగర్ దేవాదుల ప్రాజెక్టు పంప్ ఆన్ చేస్తే పైపులు పగిలిపోతున్నాయని, మంత్రులు సాగునీరు అందించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఆగస్టు 6న జయశంకర్ సార్ జయంతి రోజున జాగృతి వార్షికోత్సవాన్ని వరంగల్‌లో నిర్వహిస్తామని కవిత పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ జాగృతిని బలోపేతం చేసేందుకు కమిటీలను ప్రకటిస్తామని తెలిపారు. రుణమాఫీపై ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి అందరి దేవుళ్లపై ఒట్టువేశారని, కానీ 50 శాతం మాత్రమే రుణమాఫీ చేశారని అన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదని, వెంటనే హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం ఏర్పడక ముందు 789 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే రాష్ట్రప్రభుత్వం సుమారు 400 మంది రైతు కుటుంబాలకు రూ.5లక్షలు ఇచ్చిందని, మిగతా రైతు కుటుంబాలకు తెలంగాణజాగృతి తరఫున సుమారు 389 మందికి ప్రతీనెల రూ.4,500 పెన్షన్ అందించినట్లు ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు. రైతుల సమస్యలను తీర్చడంలో శాస్త్రవేత్తలతో జాగృతి సంస్థ చర్చలు జరిపి పరిష్కరించిందన్నారు. రైతుల పొలాల్లోకి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ కృష్ణా, గోదావరి నీళ్లను మళ్లించారని గుర్తు చేశారు. వరంగల్ అభివృద్ధికి కేసీఆర్ హాస్పిటల్‌తోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని, కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. నకిలీవిత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పి కట్టడి చేయలేదని అన్నారు. రైతులకు రుణమాఫీ పూర్తిచేసి పండించిన పంటలకు బోనస్ సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జాగృతి సంస్థను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

గూండాయిజంతో పరిశ్రమలు తరలిపోతాయి..

- కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కాంగ్రెస్ దోపిడీ
- అందులో తమ వారికే ఉద్యోగాలు ఇవ్వాలని బెదిరింపులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పరకాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పరకాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కాంగ్రెస్ నాయకులు దోపిడీకి పాల్పడుతూ, గూండాయిజం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తమ వారికే ఉద్యోగాలు ఇవ్వాలంటూ హీటెక్స్ సంస్థను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం పరకాల పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన మహిళలకు కేసీఆర్ కిట్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసింది మాజీ సీఎం కేసీఆరేనని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికమెజారిటీతో గెలిపిస్తేనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు సెట్‌రైట్ అవుతారని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో ఉన్న 55 ఎంపీటీసీ స్థానాల్లో 32స్థానాలు బీసీలకే ఇచ్చామని, 109 సర్పంచ్‌లలో 49 స్థానాలు బీసీలకు కేటాయించామన్నారు. 6 జడ్పీటీసీల్లో 3, ఎంపీపీల్లో 3 స్థానాలను బహుజనులకే ఇచ్చినట్లు తెలిపారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో 25వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన హీటెక్స్ సంస్థను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారన్నారు. పార్కులోని కాలువ నిర్మాణానికి మరో రూ.167 కోట్లు పెంచి టెండర్ వేశారని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో టెక్స్‌టైల్ పార్కు, పరిశ్రమలను తెప్పిస్తే కాంగ్రెస్ నేతలు నిలువు దోపిడీ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ప్రశ్నించకపోతే కాంగ్రెస్ నేతలు చేస్తున్న దోపిడీ ఆగదని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అక్రమాలపై నిలదీస్తానని తెలిపారు. ఎన్నికలు ఉన్నప్పుడు రైతు భరోసా వేస్తున్నారని, అది ప్రజలు గమనించాలన్నారు. బీఆర్ఎస్ పరిపాలనలో ఏనాడూ ఎరువుల కొరత లేదని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులు యూరియా బస్తాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో 3వేలమంది గృహలక్ష్మి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నా బిల్లులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. వారి పై ధర్మారెడ్డి కోర్టుకు పోతే న్యాయస్థానం చెప్పినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు అసెంబ్లీలో కొట్లాడుతామని పేర్కొన్నారు. తెలంగాణ షాన్‌గా ఉన్న అజంజాహి మిల్లు సమైక్య పాలనలో మూతపడిందని, ఆభూములను అడ్డంగా అమ్ముకున్నారని తెలిపారు. ఆమిల్లు మూతపడడంతో బతుకుదెరువు కోసం బీమండి, సూరత్, సోలాపూర్ వంటి నగరాలకు వలస వెళ్లారని తెలిపారు. వారిని స్వరాష్ట్రానికి తీసుకురావడానికి ఉద్యమ కాలంలో కేసీఆర్ వరంగల్ గడ్డపై 1500 ఎకరాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధి, పట్టుదల, నిజాయితీ కారణంగా కేరళకు చెందిన హీటెక్స్ సంస్థ రూ.204 కోట్లను పెట్టుబడిగా పెట్టిందన్నారు. దీంతోపాటు జంక్‌వన్, కొరియా సంస్థ, గణేష్ అనే ముంబయి సంస్థలు పెట్టుబడులు పెట్టడంతో 2022-23 నాటికి టెక్స్‌టైల్ పార్కులో ఒక యూనిట్‌ను ప్రారంభించామన్నారు. శిక్షణ పొందుతున్న ఆడబిడ్డలకు కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. శ్రామికులుగా సూరత్‌కు వలస పోయిన కార్మికులను తిరిగి పరిశ్రమలకోసం రప్పించేందుకు కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మడికొండలో ఏర్పాటు చేసిన షెడ్లను కాంగ్రెస్ నిర్వాకంతో నిరుపయోగంగా మారాయని తెలిపారు.

కేసీఆర్ మహనీయుడు

కేసీఆర్ మహనీయుడని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రైతాంగాన్ని అభివృద్ధి చేసేందుకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆదుకున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మూడేళ్లు పంటలకు నీరందించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సంగెం మండలంలో రైతులు యూరియా తీసుకెళ్తుంటే వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించాడని అన్నారు. కొట్లాడి పరకాలకు ఆర్డీవో కార్యాలయం, 100 పడకల ఆస్పత్రి తీసుకొస్తే నేడు రంగులు వేసి ఆస్పత్రిని ప్రారంభించే సత్తా కూడా స్థానిక ఎమ్మెల్యేకు లేదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా 5వేల మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్లు అందించడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చెప్పిన మాట ప్రకారం 5వేల మందికి శిక్షణతో పాటు కుట్టు మిషన్లు అందించామన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, తాటికొండ రాజయ్య, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాంబారి సమ్మారావు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సర్పాల సయ్యాట!

వర్షాలతో పచ్చిక బయళ్లు ఆకుపచ్చని రంగు పరుచుకుంది. ఆ గుబురులోంచి రెండు సర్పాలు బుసలు కొడుతూ ఒకటిని మరొకటి పెనవేసుకుని పరవశించిపోతున్నాయి. 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో సర్పాల సయ్యాట కనువిందు చేసింది. ఓ అరగంట పాటు సాగిన ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు ఆదివారం చిక్కింది.

- ఫోటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/వరంగల్

ఒక్కటే గళం.. కేసీఆర్ దళం..

(5వ పేజీ తరువాయి)

రాహుల్‌గాంధీ, నియామకాలు చంద్రబాబు తొత్తులకు పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నెరవేర్చని హామీల్ని, మనం అందించిన ఫలాల్ని ప్రజలకు గుర్తు చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

అద్భుతమైన నిర్మాణం కాళేశ్వరం ప్రాజెక్టు

అత్యంత అద్భుతమైన నిర్మాణం కాళేశ్వరం ప్రాజెక్టు అని, ఇంతటి ప్రాజెక్టుపై బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 2పిల్లర్లు కుంగిన ఘటనలో తనకు అనుమానం ఉందని, కాంగ్రెస్సే ఏదో చేసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. లక్ష కోట్ల అవినీతి జరగలేదని రేవంత్‌రెడ్డికి పిల్లనిచ్చిన మామే అన్నారని, ప్రాజెక్టు 80వేల కోట్లు మాత్రమే అని ఆయన మామ పద్మారెడ్డే స్వయంగా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. పార్టీలు జంప్ కొట్టి సీఎం సీటు కొట్టిన రేవంత్ ఇకనైనా మారాలని కేటీఆర్ హితవుపలికారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులపై లేదా..?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులపై లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. అందాల భామలకు పెట్టిన భోజనం ఒక్క ప్లేటు రూ.లక్ష అని, అలాగే వేములవాడకు వచ్చి రివ్యూ పెట్టి ఒక్కో ప్లేటు భోజనం రూ.1.35లక్షలు బిల్లు చేసుకున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇదే సర్కారు గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టించలేకపోతున్నారని, వారి కోసం కనీసం రూ.100, రూ.150 ఖర్చు చేయరా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారమే 111 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ అయి ఆస్పత్రుల్లో చేరారనే వార్త విని కడుపులో దేవినట్లు అయిందని ఆవేదన చెందారు. రేవంత్‌రెడ్డి.. మీ ఇంట్లోని పిల్లలకు అలాంటి బువ్వ పెడితే ఎలా ఉంటుందని మండిపడ్డారు. గురుకులాలన్నింటినీ బీఆర్ఎస్ శ్రేణులు పరిశీలించి ప్రభుత్వం పట్టించుకునేలా చూడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కన్ఫ్యూజన్ అక్కర్లేదు.. గండ్రకే పగ్గాలు..

- మధుసూదనాచారికి కేసీఆర్ మంచి అవకాశాలు ఇచ్చారు

కృష్ణకాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకత్వంపై ఎవరికీ కన్ఫ్యూజన్ అక్కర్లేదని, ఇదివరకే చెప్పాను.. మళ్లీ చెబుతున్నాను.. భూపాలపల్లిలో రమణారెడ్డి నాయకత్వంలోనే ముందుకు వెళతామని కేటీఆర్ స్పష్టం చేశారు. మధుసూదనాచారి అంటేతమకు చాలా గౌరవం ఉందని, 2014లో తెలంగాణలో అధికారంలోకి వచ్చాక.. తొలి సభాపతిగా కేసీఆర్ అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అయినప్పటికీ 2018 ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ ఓటమి చెంది కాంగ్రెస్‌లో ఉన్న గండ్ర గెలిచారన్నారు. దీంతో తానే రమణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తే ఎలాంటి షరతు పెట్టకుండా వచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం చూసి వస్తున్నానని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గండ్ర కోరారని తెలిపారు. ఆ తరువాత మధుసూదనాచారిని పిలిచి మళ్లీ ఎమ్మెల్సీ చేసి మండలిలో కేసీఆర్ అవకాశం కల్పించారని తెలిపారు. బీఆర్ఎస్ ఓటమి చెందినా కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న మధుసూదనాచారిని ప్రస్తుతం కేబినెట్ హోదా అయిన ప్రతిపక్ష నేతగా అవకాశం ఇచ్చారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. భూపాలపల్లిలో మధుసూదనాచారికి అభిమానాలు ఉంటారని, వారంతా కలిసికట్టుగా పనిచేయాలనికోరారు. అందరినీ కలుపుకొని ముందుకుసాగాలని రమణారెడ్డికి సూచిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టంచేశారు.



వాగులో చేపల వేట

ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో పలు చోట్ల నీరు చేరగా శివారు ప్రాంతాల్లో చిన్న చిన్న వాగులు పొంగుతున్నాయి. దీంతో స్థానికులు, యువకులు ఆ వాగుల్లో చేపల వేట ప్రారంభించారు. ఇలా హనుమకొండలోని 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని ఓ వాగులో యువకులు గాలాలతో చేపలు పడుతున్న దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/వరంగల్

ఇందిరానగర్‌లో డ్రెయినేజీలను నిర్మించాలి


ఇందిరానగర్‌లో శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్‌లో శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీలను తొలగించి కొత్తగా నిర్మించాలని కాంగ్రెస్ 59వ డివిజన్ ఇన్‌చార్జి కేతిడి దీపక్‌రెడ్డి కోరారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్‌లో శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరానగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు ఇరుకుగా ఉండడం వలన వర్షం కురిసినప్పుడు వరద నీరు రోడ్లపై ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూరెల్ల రవికిరణ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు తేళ్ల సుగుణ కిశోర్, బీసీ సెల్ నేత దొంగర శ్రీనివాస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభించిన క్లబ్ సభ్యులు

బేబీ ఫీడింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-1లోని బేబీ ఫీడింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ శరత్‌బాబు అన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1లో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బేబీ ఫీడింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడారు. ఈ స్టేషన్ మీదుగా ప్రయాణించే 50వేల మంది ప్రయాణికులకు ఈ సెంటర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విరవీందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన పోస్టల్ పెన్షనర్లు


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న పెన్షనర్లు

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం భారతీయ పోస్టల్ పెన్షనర్ల సంఘం, ఆర్ఎంఎస్ సభ్యులు కాజీపేట నుంచి ఢిల్లీ వెళ్లారు. ఈ మేరకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని పెన్షనర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో పెన్షనర్ల సంఘం నాయకులు ఎస్.సదానందం, చాద జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కక్కెర్ల సాంబయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాలవికాసలో అబ్దుల్ కలామ్‌కు నివాళి


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లీడ్ ఫౌండేషన్ సభ్యులు

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేట బాలవికాసలో ఆదివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ ఆధ్వర్యంలో ఆరోగ్యమిత్ర, లిబర్టీ ఫౌండేషన్ సహకారంతో 'నివారయోగ్యమైన భాగోళ పరివర్తన' అనే అంశంపై డాక్టర్ పి.అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బాలవికాస డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, స్నేహా యువ కేంద్రం కో ఆర్డినేటర్ అన్వేష్, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్‌రావు, జనవిజ్ఞాన వేదిక లక్ష్మారెడ్డి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

ఓబీసీ సభలను జయప్రదం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శోభారాణి


జవహర్ కాలనీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం మహిళా నేతలు

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమ వాటా తమకు కావాలని డిమాండ్ చేస్తూ గోవాలో ఆగస్టు 7న నిర్వహించే ఓబీసీ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీసీ సంఘాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించి రిజర్వేషన్లను సాధించుకుందామన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా అన్ని బీసీ సంఘాలు సంఘటితం కావాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా నాయకురాళ్లు తంగెళ్లపల్లి అరుణ, నీరటి విజయలక్ష్మి, చెరుకు సరిత, నరెడ్ల విజయ, మార్క భాగ్య, పిట్టల వసంత, మాగంటి సునిత, జిల్లెల్ల పెల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వీధులు.. అధ్వానంగా రోడ్లు..

- చిరుజల్లులకే చిత్తడి.. శిథిలావస్థలో డ్రెయినేజీలు
- అభివృద్ధికి ఆమడదూరంలో జవహర్ కాలనీ
- కనీస వసతులు కల్పించాలని కోరుతున్న ప్రజలు


గుంతలమయంగా మారిన జవహర్‌కాలనీ ప్రధాన రోడ్డు

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని జవహర్ కాలనీ కనీస వసతులు లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కాలనీ ఏర్పడి నాలుగు దశాబ్దాలైనా అంతర్గత రోడ్లు అధ్వానంగానే ఉన్నాయి. డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరాయి. మౌలిక వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

కాలనీలోని అంతర్గత రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. ఇరుకు వీధులతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పక్కారోడ్లు మచ్చుకైనా కనిపించవు. చిరుజల్లులకే వీధులన్నీ జలమయమవుతాయి. రోడ్లపై వర్షపు నీరు పారుతుంది. దీంతో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.


ఖాళీ ప్లాటులో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు

శిథిలావస్థలో డ్రెయినేజీలు

ఇప్పటివరకు డ్రైనేజీలు నిర్మించలేదు. గతేడాది వర్షాలకు ఇసుక మేటలు వేసి డ్రైనేజీలు పూడుకుపోయాయి. పేరుకుపోయిన మట్టిని తొలగించిన దాఖలాలు లేవు. శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీలు విశాలంగాలేక చిన్నపాటి వర్షానికే వర్షం నీరు రోడ్లపై పారుతోంది. దీంతో చిరువ్యాపారులు, పాదచారులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధి ఎరుగని జవహర్ కాలనీ

తమ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతుందని కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీల్లోని ఖాళీ ప్లాట్లల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు పాములు, తేళ్లకు నిలయాలుగా మారుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాలనీవాసులతో పాటు పారిశుధ్య కార్మికులు చెత్తను, వ్యర్థాలను ఖాళీ ప్లాట్లల్లో వేయడం వల్ల దుర్వాసనతో సతమతమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా ఉన్న జవహర్ కాలనీ ప్రధాన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



జవహర్ కాలనీలో శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీలు

కనీస వసతులు కల్పించాలి

దేవులపల్లి రమేష్, జవహర్ కాలనీవాసి



కాలనీలో కనీస వసతులు కల్పించాలి. అంతర్గత రోడ్లను నిర్మించడంతో పాటు డ్రైనేజీలను విశాలంగా ఏర్పాటు చేయాలి. ఖాళీ ప్లాట్లల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, నిరుపయోగమైన చెట్లను తొలగించి పాముల బెడదను అరికట్టాలి. కాలనీ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే రైతులకు నోటీసులు అందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ రహీం పాషా, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐలు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్లు నరేష్, సతీష్, శ్వేత, రికార్డ్ అసిస్టెంట్ శ్రీను, కిరణ్, అటెండర్, వీఆర్ఏలు ఉన్నారు.

గురుకుల విద్యాలయం తనిఖీ

ఎర్రగట్టు గుట్ట క్రాస్ రోడ్డులోని బాలికల గురుకులాన్ని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, రికార్డులు, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రామ పరిపాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ ఇందుమతి, తహసీల్దార్ చల్ల ప్రసాద్, బోధన సిబ్బంది తదితరులు ఉన్నారు.


విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన డీఎస్ఎస్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ఏర్పాటుచేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ విమానాశ్రయానికి రూ.205 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీఎస్ఎస్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జన్ను శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా మిథున్, జిల్లా నాయకులు ఎం.మహేందర్, బాషి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం

- భయంతో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థినులు

వరంగల్ మెడికల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలోని నర్సింగ్ స్కూల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ వర్షాకాల సీజన్‌లో పై కప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయని నర్సింగ్ విద్యార్థినులు వాపోతున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. డ్రెయినేజీ, శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా లోపించింది. పైగా స్లాబ్‌పై నీరు నిల్వ ఉండటంతో వర్షాకాలంలో స్లాబ్ తరుచూ కురవడం మామూలుగా మారింది. జీఎన్ఎంకు సంబంధించిన మూడు బ్యాచ్ విద్యార్థులు, ఎంపీహెచ్‌డబ్లు శిక్షణ పొందుతున్న వందల మంది విద్యార్థులు భవనంలోనే శిక్షణ పొందుతూ ఇదే భవనంలోని హాస్టళ్లలో ఉంటున్నారు.

రాంకీ వద్దకు మార్పు ఏమైనట్లు..

ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరినట్లు గుర్తించిన జిల్లా కలెక్టర్ సత్యశారద ఈ భవనాన్ని ఖాళీ చేసి రాంకీ వద్ద ఉన్న ప్రభుత్వ భవన సముదాయంలోకి మార్చాలని సూచించారు. అక్కడికి మారడం ఇష్టం లేని కొందరు ఉద్యోగులు వెనుకుండి విద్యార్థులచే ఆందోళన చేయించినట్లు సమాచారం. అప్పుడు ఎమ్మెల్యే ఎవరో ఏమో కానీ మొత్తానికి భవన మార్పు ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తగిన ఆదేశాలు జారీ చేసి నర్సింగ్ స్కూల్‌ను రాంకీ వద్దకు మార్చాలని విద్యార్థినులు విజ్ఞప్తి చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం

హద్దు, పద్దు లేక..

(5వ పేజీ తరువాయి)

గురవుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో హద్దులకు సంబంధించి రెవెన్యూ అధికారులు డిజిటల్ మ్యాప్ తయారు చేయవలసి ఉండగా నీటి పారుదల శాఖ అధికారులు చేసిన చెరువుల సర్వే రిపోర్టులే మొత్తం కంగడం లేదు. ఇప్పటికైనా చెరువుల పరిరక్షణ కోసం హద్దులు ఖరారు చేసి హైదరాబాద్ తరహాలో గ్రేటర్ వరంగల్‌లో 73 చెరువులకు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. డిజిటల్ మ్యాప్ సిద్ధం చేసి కుడా పరిధిలో అందుబాటులోకి తీసుకొస్తే చెరువులలో ఆక్రమణలు జరగకుండా చేయవచ్చు. అలాగే ఎఫ్‌టీఎల్ హద్దులు దాటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ముల్కనూర్ గ్రంథాలయం ఆదర్శనీయం

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన త్రిశూలం చౌరస్తాకు భూమిపూజను ఆలయ ఈవో కిషన్‌రావుతో కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్, జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ శేఖర్, నిర్వాహకులు మాజీ ఎంపీపీలు ఆకోక్ ముఖర్జీ, కొదూరి నరేశ్‌న, చంద్రశేఖర్‌గుప్తాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘానికి సంపత్‌రావు నాలుగోసారి ఎన్నిక



హనుమకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా జూలపల్లి సంపత్‌రావు నాలుగోసారి ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఈనెల 21 నుంచి 23వ వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగిన ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో జరిగింది. ఈ ఆల్ ఇండియా సమావేశంలో బీఎస్ఎన్ఎల్‌ను పునరుజ్జీవింపజేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. వొడాఫోన్, ఐడియా వంటి ప్రైవేటు కంపెనీలకు లక్షలాది కోట్ల రూపాయలను రాయితీగా మంజూరు చేస్తూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణను 2017 నుంచి పెండింగ్‌లో ఉంచిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు తప్పుబట్టారు. ఉత్కృష్టమైన సేవల కోసం అవసరమైన పరికరాలు బీఎస్ఎన్ఎల్‌కు అందించడంలో కూడా పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఈ సమస్యలు త్వరగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని సమావేశంలో యూనియన్ తీర్మానించింది. దేశీ హితానికి బీఎస్ఎన్ఎల్ అవసరమైనా ఏ రాజకీయ పార్టీ దీనికి ప్రాధాన్యత ఇవ్వకుండా ముందుకు రావడం లేదని సమావేశం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

బైక్‌లు చోరీ చేసి పట్టుబడిన విద్యార్థులు

ఐనవోలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు చోరీ చేసిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో పోలీసులకు పట్టుబడ్డారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం మేరకు.. వరంగల్ పడమరకోటకు చెందిన జి.రోహిత్, బి.బిన్నీక్ (ఇంటర్ పూర్తయింది) మరో మైనర్ విద్యార్థితో కలిసి బైక్‌లను చోరీ చేశారు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి బైక్‌లను తస్కరించి విక్రయించిన డబ్బులతో ఎంజాయ్ చేసేవారు. ఈ సంవత్సరం సంక్రాంతిని ఐనవోలు జాతరలో ఆంజనేయ పార్కింగ్ స్థలంలో రాత్రి మూడు బైక్‌లను చోరీ చేశారు. ఈ బైక్‌ల విక్రయించి జల్సాలకు వినియోగించారు. మరో రెండు బైక్‌లను వారే వాడుతున్నారు. ఆదివారం రెండు బైక్‌లపై వర్ధన్నపేట వైపు వెళ్తున్నారు. పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడగా విచారణ చేయగా బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. అరెస్టు చేసి వారి నుంచి రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రద్దు చేసిన ట్రేడ్లను పునరుద్ధరించాలి

- కాజీపేట ఐటీఐలో డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్ కోర్సుల నిలిపివేత
- విద్యార్థులకు నష్టమంటున్న విద్యావేత్తలు
- పునరుద్ధరించాలని కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ లేఖ



కాజీపేటలోని ఐటీఐ

హనుమకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్) ట్రేడ్లను నిలిపివేయడంతో విద్యార్థులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ రెండు ట్రేడ్లకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. కానీ, కొంత కాలంగా ఈ ట్రేడ్లలో విద్యార్థుల ప్రవేశం తక్కువగా ఉండటాన్ని కారణంగా చూపి ఈ విద్యా సంవత్సరంలో ఉపాధి, శిక్షణ డైరెక్టర్ వీటిని నిలిపివేసింది. నాలుగేళ్లుగా ప్రవేశాలు అంతగాలేని ట్రేడ్లను రేషనలైజ్ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటీఐలలో కొన్ని ట్రేడ్లలో ప్రవేశాలను నిలిపివేసింది. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరం కాజీపేట ఐటీఐలో డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్ (ఇంగ్లిష్) ట్రేడ్లలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వలేదు.

అవగాహన, ప్రచారం లేక..

ఐటీఐలలోని కొన్ని ట్రేడ్ల గురించి అవగాహన, ప్రచారం లేకపోవడంతో ప్రవేశాలు ఆశించినంతగా రావడం లేదు. ఈ క్రమంలోనే గతంలో కాజీపేట ఐటీఐలో డ్రెస్‌మేకింగ్, స్టెనోగ్రాఫర్ ట్రేడ్లలో ప్రవేశాలు తక్కువగా ఉండేవి. విచిత్రంగా ఈ సారి ఈ రెండు ట్రేడ్లకే ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇది వరకు ఎప్పుడూ లేనంతగా డ్రెస్‌మేకింగ్ ట్రేడ్‌కు 50 మంది, స్టెనోగ్రాఫర్ ట్రేడ్‌కు 30 మందికిపైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా తమకు ప్రవేశాలు కల్పించాలని ఐటీఐ చుట్టూ తిరుగుతున్నారు.

ఈ విషయమై కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు లేఖ రాశారు. ఈ ట్రేడ్లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేట పట్టణం, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ రెండు ట్రేడ్ల ప్రాముఖ్యత గురించిన ప్రచారం విస్తృతంగా జరగడం, వాటి పట్ల అవగాహన పెరగడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఐటీఐలో చేరడానికి ముందుకు వస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. పైగా ఒక్క కాజీపేట ఐటీఐలో తప్ప చుట్టు పక్కల జిల్లాల్లోని ఏ ఐటీఐలో ఈ రెండు ట్రేడ్లు లేవన్నారు. ఐటీఐలో జరిగిన టీఎంసీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, స్టేక్‌హోల్డర్లు కూడా స్థానికంగా ఉండే పరిశ్రమలు, కార్యాలయాల్లోని ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ఈ రెండు ట్రేడ్లను కొనసాగించాలని సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ట్రేడ్లు కొనసాగేలా చూడాలని ఆయన కలెక్టర్‌ను అభ్యర్థించారు.

ఆ రెండు కోర్సులకు మంచి డిమాండ్..

మార్కెట్‌లో దుస్తుల తయారీ శిక్షణ కాలంలో డిమాండ్ బాగా పెరిగింది. ఇందులో శిక్షణ పొందినవారికి ఆదాయం కూడా బాగానే వస్తోంది. టెక్స్‌టైల్, ఫ్యాషన్ డిజైనింగ్, బొటిక్ రంగాల్లో ఉపాధి అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి. దీనితో డ్రెస్ మేకింగ్ పట్ల యువతులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఈ డ్రెస్‌మేకింగ్ ట్రేడ్‌లో శిక్షణ పొందడానికి ఈ సారి ఎక్కువ మంది విద్యార్థినులు పోటీ పడుతున్నారు. కానీ కాజీపేట ఐటీఐలో ఈ ట్రేడ్ లేకపోవడంతో ప్రవేశాలు కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థినులు నిరాశకు లోనవుతున్నారు. అలాగే స్టెనోగ్రాఫర్ ట్రేడ్ కోసం కూడా ఈసారి చాలామంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వీరి నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ రంగ సంస్థలేకాకుండా ప్రైవేటు సంస్థలు కూడా స్టెనోగ్రాఫర్లను పెద్దఎత్తున నియమించుకుంటున్నాయి. దీనితో స్టెనోగ్రాఫర్ ట్రేడ్ కోసం కాజీపేట ఐటీఐకి పెద్దసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కానీ ప్రవేశాలు లేవు.

ఔషధ 'అక్షర దార'!

ప్రకృతిలో మనకు ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. కానీ వాటి గురించి మనకు పెద్దగా తెలియదు. అలాంటి ఒక మొక్క 'అక్షర దార'. ఇది పలు అనారోగ్యలకు ఔషధంగానే కాక మరెన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఆ మొక్క గురించి తెలుసుకుందాం..

నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ 'అక్షర దార' మొక్క మనగలుగుతుంది. ఈ మొక్కకు 'స్ట్రెబ్లస్ ఆస్పర్' అని శాస్త్రీయ నామం ఉంది. ఈ మొక్కను శాండ్ పేపర్ ట్రీ అని కూడా అంటారు. ఇది భారతదేశంతో పాటు శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం, మలేషియా, కంబోడియా, ఫిలిప్పీన్స్.. పలు దేశాల్లో పెరుగుతుంది. ఈ





మొక్క దట్టంగా 4-15 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు అండాకారంలో ఉంటాయి. ఈ మొక్క పువ్వుల నుంచి అండాకారం కాయలు కాస్తాయి. అవి పండిన తరువాత పసుపు రంగులోకి మారతాయి. ఈ మొక్క ఆకులను, బెరడును సంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారు. పంటి నొప్పి, విరేచనాలు, పాముకాటు.. మొదలైన వాటికి విరుగుడుగా కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ వంటి ఇరవైకి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయి. ఆ మొక్క బెరడు క్రిమిసంహారకంగా ఉపయోగపడుతుంది. అలాగే 'అక్షర దార'తో చీజ్ తయారీ కోసం పాలను గడ్డకట్టించే ప్రోటీజ్ ఉంటుంది. దీని ఆకులను పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. దీని వలన పాల దిగుబడి పెరుగుతుంది. అలాగే ఈ ఆకులు జంతువులలో రుమెన్ కిణ్వ ప్రక్రియను ప్రోత్సహిస్తాయి.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

వినూత్నం

నీళ్ల మీద రంగవల్లులు దిద్దుతూ వినూత్నమైన కళకు శ్రీకారం చుడుతున్నారు హైదరాబాద్‌కు చెందిన **సమ్మెట రేవతి**. ఆకర్షణీయమైన రంగుల ముగ్గులతో ఇప్పటివరకూ వందకు పైగా దేవతామూర్తుల రూపాలను నీళ్ల మీద సృష్టించారామె. ఈ కళ పట్ల ఏర్పడిన మక్కువ గురించీ, పొందుతున్న ఆదరణ గురించీ 'నవ్య'తో ఇలా ముచ్చటించారు.



నీళ్ల మీదా రంగోలీ!

నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలేయడమంటే ఇష్టం. అలాగే ముగ్గులు కూడా ఇష్టంగా వేసేదాన్ని. చిన్నప్పుడు మా ఇంటి పక్కనే ఉన్న రామాలయం ముందు పండుగల్లాంటి ప్రత్యేకమైన రోజుల్లో రంగులతో రంగవల్లులు దిద్దుతూ ఉండేదాన్ని. ముగ్గు వేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం కోసం నీళ్ల పక్కనే పెట్టుకుంటూ ఉంటాను. అయితే ఒకసారి ముగ్గు వేస్తున్న సమయంలో నా చేతిలో నుంచి రంగు ముగ్గు జారి నీళ్లలో పడిపోయింది. అది నీళ్ల మీద తేలుతూ ఉండడంతో నీళ్ల మీద రంగవల్లులు దిద్దితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చింది. అలా గత ఫిబ్రవరిలో నీళ్ల మీద ముగ్గులేసే 'ఫ్లోటింగ్ ఆర్ట్'కు బీజాలు పడ్డాయి. అంతకు ముందు ఆరేళ్ల నుంచీ ఆర్ట్ వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తున్నప్పటికీ శివరాత్రి నాడు, నీళ్ల మీద వేసిన శివుడి రంగోలీతో మంచి ఆదరణ దక్కింది. పలువురు ఫలానా దేవుడి బొమ్మ వేయండి అంటూ సోషల్ మీడియా ద్వారా నన్ను అడుగుతూ ఉంటారు. తాజాగా కొమరవెల్లి మల్లన్న రంగోలీ వేయమని ఎంతో మంది నన్ను అడిగారు. కానీ ఆంధ్రలో పుట్టి పెరిగిన నాకు తెలంగాణా మల్లన్న స్వామి గురించిన అవగాహన లేదు. దాంతో గూగుల్‌లో వెతికి మల్లన్న స్వామి రూపురేఖలను గమనించి, ఆ తర్వాత రంగోలీకి పూనుకున్నాను. అలాగే అభిమానుల కోరిక మేరకు స్థానిక దేవతలు, గ్రామ దేవతల రంగోలీలు కూడా వేస్తూ ఉంటాను. ఇలా ఇప్పటివరకూ వందకు పైగా దేవతా రంగోలీలు వేశాను.

భక్తిశ్రద్ధలతోనే...

నీళ్ల మీద ముగ్గు వేయడం ఒకింత కష్టమేనని చెప్పాలి. ముగ్గు బరువుగా ఉంటుంది కాబట్టి చటుక్కున పోసేస్తే నీళ్లలో మునిగిపోతుంది. కాబట్టి నీళ్ల మీద తేలేలా ముగ్గును నెమ్మదిగా పోయాలి. బొమ్మ వేసే ముందు నేనెలాంటి సాధనా చేయను. వేయబోయే దేవతా చిత్రాన్ని, ధరించిన నగలనూ పది నిమిషాల పాటు గమనించి, నీళ్ల మీద రంగోలీ మొదలుపెట్టేస్తూ ఉంటాను. ముగ్గు వేసే సమయంలో ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండడం కోసం భక్తి పాటలు వింటాను. దేవునికి ఉపయోగించే సామాగ్రిని కూడా దైవసమానంగానే భావించాలని సనాతన ధర్మం చెప్తోంది. కాబట్టి రంగోలీ కోసం నీళ్ల నింపే స్టీలు పళ్లెం, ముగ్గు భరిణెలను పూజా సామాగ్రితో సమానంగా భావిస్తాను. రంగోలీ పూర్తి అయిపోయిన తర్వాత, ఆ నీళ్లను అందరూ తొక్కే వీల్లేకుండా పార్కులో ఓ మూలన పోరబోస్తాను. అడుగున పేరుకున్న ఇసుకను కూడా దగ్గర్లోని కాల్వల్లో కలిపేస్తూ ఉంటాను. అలాగే రంగోలీకి ముందూ, తర్వాత సదరు దేవతలకు నమస్కరించుకుంటూ ఉంటాను.

> నేను క్లాసికల్ డాన్సర్‌ను. ఐదేళ్ల వయసు నుంచి ఇప్పటి వరకూ 350 కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చాను. అలాగే బాధ్యత, భగవంత్ కేశరి, గుంటూరు కారం, ఖుషి మొదలైన సినిమాల్లో చిన్న పాత్రల్లో కూడా నటించాను. పలు టీవీ సీరియల్స్‌లో కూడా నటించాను. మాది ఏలూరు జిల్లా, కలిదిండి. నేను అక్కడే పుట్టి పెరిగాను. నాన్న సమ్మెట రామారావు, జనరల్ స్టోర్ నడుపుతూ ఉంటారు. అమ్మ అమ్మాజీ టైలర్. మావారు సివిల్ ఇంజనీర్. మాకొక బాబు. నీళ్ల మీద రంగోలీ నాతోనే మొదలైందని అందరూ అంటూ ఉంటారు. ఇంటర్నెట్‌లో కూడా ఇలాంటి కళ నాకెక్కడా కనిపించలేదు. ఈ ఫ్లోటింగ్ ఆర్ట్ ఎంతలా విస్తరిస్తే, నేను కూడా అంతలా అందరికీ గుర్తుండిపోతాను. కాబట్టి భవిష్యత్తులో ఈ కళను పలువురికి నేర్పించాలనే ఆలోచన ఉంది.



లక్ష మంది సబ్‌స్క్రైబర్లు ఆ దేవుడి చలవే!

అమ్మవార్ల బొమ్మలైనా, ఇతర దేవతల బొమ్మలైనా బొమ్మ మొత్తం పూర్తయిన తర్వాత చివర్లో బొట్టు పెట్టి ముగించడం నాకు అలవాటు. అలా ఒకసారి నాలుగున్నర గంటల పాటు కష్టపడి నీళ్ల మీద వేంకటేశ్వర స్వామి వారి రంగోలీ వేశాను. కానీ చివర్లో నామం పెట్టే సమయంలో, కాస్త ఎక్కువ ముగ్గు జారి పడిపోవడంతో, ఆ ప్రదేశం నుంచి నీళ్లు బయటకు వచ్చేయడం మొదలుపెట్టాయి. ఎంత సరిదిద్దే ప్రయత్నం చేసినా వీలు పడలేదు. దాంతో నాకు ఏడుపొచ్చేసింది. అయినా వీడియోలో ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసుకోవచ్చు. కానీ అందుకు నాకు మనస్కరించలేదు. మళ్లీ ఆ నీళ్లన్నీ ఒంపేసి, ఇంకొక నాలుగున్నర గంటల పాటు కష్టపడి అదే బొమ్మను సృష్టించాను. ఆ బొమ్మతో యూట్యూబ్‌లో నాకు లక్ష మంది సబ్‌స్క్రైబర్లు పూర్తవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ప్రస్తుతం నాకు ఒక లక్ష 65 వేల మంది యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. పేపర్ లేదా కాన్వాస్‌ల మీద వేసే బొమ్మలు శాశ్వతంగా ఉండిపోతాయి. కానీ నీళ్ల మీద వేసే రంగోలీలను అలాగే ఉంచుకోలేం! మరొక రంగోలీ వేయాలంటే, ఆ నీళ్లను ఒంపేసి, తాజా నీళ్లను నింపుకోక తప్పదు. ఇదెంతో బాధాకరమైన విషయం. అయితే ఒకటి కావాలంటే మరొకటి వదులుకోక తప్పదు కాబట్టి మరొక కొత్త రంగోలీ కోసం పాత రంగోలీని తొలగిస్తున్నట్టు నాకు నేను సర్దిచెప్పుకుంటూ ఉంటాను. నిజానికి రంగోలీని తొలగించేటప్పుడు బాధ కలగకుండా ఉండడం కోసం, రంగోలీని కలిపే దృశ్యాన్ని వీడియో తీసి, దాన్ని రివర్స్ చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ ఉంటాను.

● గోగుమళ్ల కవిత

ఆ ఇబ్బంది తగ్గించేందుకు..

నెలసరి.. ఆడవారిలో ప్రతినెలా జరిగే ఒక సహజ ప్రక్రియ. ఆ సమయంలో మహిళలు మార్కెట్‌లో దొరుకుతున్న శానిటరీ ప్యాడ్‌ల వలన దురద, దద్దుర్లు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ ప్యాడ్‌ల వలన అందరి కంటే ఎక్కువ బాధను అనుభవించారు గుజరాత్‌కు చెందిన **గీతా సోలంకి**. అందుకే వాటికి ప్రత్యామ్నాయంగా వస్త్రంతో ప్యాడ్‌ల తయారీకి శ్రీకారం చుట్టారు. ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం...



గీతా సోలంకి.. గుజరాత్ సౌరాష్ట్ర ప్రాంతంలోని వెరవల్ అనే తీరప్రాంత పట్టణంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. ఆమె చిన్నతనం అంతా అక్కడే గడిచింది. ఆమెకు యుక్త వయసులో ఓ కణితి ఏర్పడడంతో కూర్చోడానికి, నడవడానికి కూడా ఇబ్బంది పడేవారు. ఇక నెలసరి సమయంలో ఆమె బాధ మరింత ఎక్కువయ్యేది. మార్కెట్‌లోని ప్యాడ్‌ల వాడకం వలన దురద, చికాకుతో నరకం అనుభవించారు. తన బాధను తల్లితో పంచుకోగా, ఆమె మెత్తని వస్త్రం వాడమని చెప్పారు. అందుకు గీత మొదట ఒప్పుకోలేదు. ఇన్ఫెక్షన్ వస్తుందని తిరస్కరించింది. అమ్మ నచ్చ చెప్పడంతో చివరికి అంగీకరించింది. వాడిన తరువాత గీతకు ఎంతో ఉపశమనం కలిగింది.

ఆలోచన అలా వచ్చింది..

గీతది ఉమ్మడి కుటుంబం కావడంతో ఇంట్లో ఎక్కువ మంది ఉండేవారు. ఇంట్లోని ఆడవారు శానిటరీ ప్యాడ్‌ల వలన ఎదుర్కొంటున్న సమస్యలను, అనుభవాలను అప్పుడప్పుడు వారితో ఒకరు పంచుకునే వారు. అప్పుడే గీతకు, వస్త్రంతోనే ప్యాడ్‌లు ఎందుకు తయారు చేయకూడదనే ఆలోచన వచ్చింది. ఆ తరువాత ప్యాడ్‌ల తయారీపై లోతైన పరిశోధన చేసి, 2018లో యునిప్యాడ్స్ సంస్థను



స్థాపించారు. మొదట్లో ప్యాడ్‌లు కుట్టేందుకు మనుషులు దొరకలేదు. కొందరు ఆడవారు రావాలనుకున్నా నెలసరి మీద అపోహలతో వారి కుటుంబాలు ఒప్పుకోలేదు. దాంతో ఎంతో ఆలోచించి ఓ తెలివైన నిర్ణయం తీసుకున్నారు గీత. జీతం ఇచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తామని చెప్పారు. దాంతో ఇంట్లోని వారు ఆడవారిని పంపడానికి ఒప్పుకున్నారు. అలా వచ్చిన వారు రోజులు గడిచే కొద్దీ నెలసరి గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. తరువాత వారి అనుభవాలు పంచుకున్నారు. నెల రోజుల కుట్టు మిషన్ ట్రైనింగ్ అయిపోయాక మరుసటి రోజు నుంచి తాము ప్యాడ్‌ల తయారీ మొదలుపెడుతున్నామని, ఆసక్తి ఉన్నవారు రావొచ్చని గీత చెప్పారు. మిషన్ నేర్చుకున్న 15 మందిలో 11 మంది ప్యాడ్‌లు కుట్టేందుకు వచ్చారు.

ఎన్నో అనుమానాలు..

చదువుకున్న వారిలోనూ వస్త్రంతో రూపొందించిన ప్యాడ్లపై ఎన్నో అనుమానాలు. అవి పరిశుభ్రం కాదనీ, పాత విధానమని ఎవరు వాడటానికి ముందుకు రాలేదని గీత గుర్తు చేసుకున్నారు. "దాంతో మొదట కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వారికి ఈ ప్యాడ్‌లు అందించాం. వారు ఉపయోగించి తరువాత వారే మా ప్యాడ్‌లు అమ్మడం మొదలుపెట్టారు. అలా "కళ్యాణి" వ్యవస్థ పుట్టింది. కళ్యాణిలు వారి గ్రామాల్లో మా ప్యాడ్లు అమ్ముతారు. అందుకు వారికి కమిషన్ లభిస్తుంది. అలాగే నెలసరి ఆరోగ్యం మీద ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం గుజరాత్ వ్యాప్తంగా దాదాపు 200 మంది కళ్యాణీలు పనిచేస్తున్నారు" అని గీత చెప్పారు.

పిల్లల హాజరు పెంచేందుకు..

కొంతమంది పిల్లలు నెలసరి సమయంలో బడికి వెళ్లరు. ఈ పద్ధతిని నిర్మూలించడం కోసం యూనిప్యాడ్స్ 'స్కూల్ మైల్స్' పేరిట ఓ వినూత్న కార్యక్రమం చేపట్టింది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమ్మాయిలకు కిట్(ఏడాదిన్నరపాటు వినియోగించుకునే క్లాత్ ప్యాడ్స్, వస్త్రంతో తయారుచేసిన స్కూల్ బ్యాగ్, లోదుస్తులు, సబ్బు, హాట్ వాటర్ బ్యాగ్)ను అందిస్తుంది. ఆ తరువాత ప్రతినెలా వారి హాజరును పరిశీలిస్తుంది. హాజరులో మెరుగుపడిన వారికి యూనిఫాం, స్టేషనరీ, కొత్త ప్యాడ్‌లు అందిస్తుంది.

కేన్స్‌లో అవార్డు

నెలసరిలో ఉన్న ఆడవారిని వంటింట్లోకి రానివ్వకపోవడం మీద యూనిప్యాడ్స్ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించింది. అహ్మదాబాద్ లోని ఓ పెద్ద రెస్టారెంట్‌లో నెలసరిలో ఉన్నవారితోనే వంట వండించింది. చాలామంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, నాయకులు వాటిని తిని నిరసనకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని డాక్యుమెంటరీగా చిత్రీకరించగా అది కేన్స్ క్రియేటివిటీ ఫెస్టివల్‌లో 'సిల్వర్ గ్లాస్ లయన్' అవార్డు గెలుచుకుంది.

బద్ధకం వదలాలంటే..!

ఒక్కోసారి మనకు బద్ధకంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. దీనివల్ల సమయం వృథా అవుతూ ఉంటుంది. అలా కాకుండా బద్ధకాన్ని ఎలా వదిలించుకోవాలో తెలుసుకుందాం..



- ఎప్పుడు చేయాలనుకున్న పనిని అప్పుడే పూర్తిచేస్తూ ఉంటే బద్ధకంగా అనిపించదు. పనులను వాయిదావేయడం మానుకోవాలి.
- ఏ పనిచేస్తే ఏమవుతుందో అన్న భయం కూడా మంచిది కాదు. దీనివల్ల తెలియకుండానే పనులను వాయిదా వేస్తూ ఉంటారు. భయాందోళనలకు గురికాకుండా పనులు చేస్తూ ఉంటే బద్ధకం దరిచేరదు.
- నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎప్పుడూ గుర్తుచేసుకుంటూ ఉండాలి. దీంతో ఆ లక్ష్య సాధన కోసం త్వరగా పని పూర్తిచేయాలన్న ఆలోచన వస్తుంది. శరీరం చురుకుగా పనిచేస్తుంది.
- రోజూ ఒకే దినచర్యను పాటించాలి. సమయానుసారం నిద్రించడం, ఉదయాన్నే వ్యాయామం చేయడం, అల్పాహారం తీసుకోవడం లాంటివి బద్ధకాన్ని వదిలిస్తాయి.
- శరీరం అలసిపోయినా కూడా బద్ధకంగా అనిపిస్తుంది. కాబట్టి శ్రమ అనిపించినప్పుడు కొద్దిగా విశ్రాంతి తీసుకోవాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయడం కూడా ఉపకరిస్తుంది.
- పూర్తి చేయాలనుకున్న పనులను ఒక లిస్టుగా రాసుకోవాలి. తరచూ ఈ లిస్టును చూస్తూ ఒకదాని తరవాత మరోదాన్ని పూర్తిచేస్తూ ఉండాలి.
- పెద్ద పనులు అనుకోకుండా త్వరగా పూర్తయినప్పుడు ఆ ఆనందాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించాలి. అప్పుడే బద్ధకం వదిలి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుంది.

నీళ్ల బాటిళ్లు ఇలా శుభ్రం!




పాఠశాలలకు, ఆఫీసులకు లేదా బయటకు వెళ్లేటప్పుడు వెంట మంచినీళ్ల బాటిల్‌ను తీసుకెళ్తాం. అందులో ఉండేది నీళ్లే కదా అని బాటిళ్లను తరచూ శుభ్రం చేయరు. దాంతో బ్యాక్టీరియా చేరి బాటిళ్లు వాసన వస్తాయి. కాబట్టి నీళ్ల బాటిళ్లను తరచూ సులువుగా ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం..

- బాటిల్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల బేకింగ్ సోడా లేదా ఉప్పు వేసి, కొంచెం నీరు పోసి మూతపెట్టి బాగా కదపాలి. తరువాత బ్రష్‌తో బాటిల్‌ను రుద్ది శుభ్రం చేయాలి.
- కొంచెం నిమ్మరసాన్ని బాటిల్‌లో పోసి మూతపెట్టి బాగా కదిపి మంచి నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే దుర్వాసన దూరం అవుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, కొంచెం నీరు పోసి పదిహేను నిమిషాల తరువాత బాటిల్‌ను బాగా కదిపి నీటితో శుభ్రం చేయాలి.
- ఒక టీ బ్యాగ్‌ను బాటిల్‌లో వేసి గోరువెచ్చని నీరు పోసి రాత్రంతా అలా వదిలేసి ఉదయాన్నే బ్రష్‌తో రుద్ది కడగాలి.
- అలాగే బాటిల్ మూతను శుభ్రం చేసే విషయంలోనూ శ్రద్ధ వహించాలి. మూతను సబ్బు నీటిలో బాగా కడగాలి.
- కొన్ని బాటిళ్లకు పాస్టిక్ సీల్ ఉంటాయి. ఆ సీల్‌ను తొలగించి శుభ్రం చేస్తే మంచి ఫలితముంటుంది.
- బాటిల్‌ను శుభ్రం చేసి తడి పూర్తిగా ఆరే వరకు మూత పెట్టకూడదు. అలాగే ఇంటికి వచ్చాక బాటిల్‌లో మిగిలిన నీటిని పారబోసి నీటితో శుభ్రం చేసి పూర్తిగా ఆరాకే మూత పెట్టాలి.

అమ్మ మనసు పాఠం చెబుతోంది!

వైకల్యాల కారణంగా అవహేళనలు ఎదుర్కొన్న కుమారుడి కోసం డాక్టర్ వృత్తిని వదిలేసి టీచర్‌గా మారారు **దీప్తి తివారీ**.కాన్పూర్‌లో ఆమె ఏర్పాటు చేసిన స్పెషల్ స్కూల్... వైకల్యాలున్న కొన్ని వందలమంది పిల్లలను అక్కున చేర్చుకుంది. ఆ పిల్లలకు నైపుణ్యాలను, వారి తల్లితండ్రులకు ఊరటను అందిస్తోంది.



అది నాకు జీవితాంతం గుర్తుండిపోయే సంఘటన. మా అబ్బాయి భరత్‌ను ఆ రోజే కొత్త స్కూల్‌లో చేర్పించాం. అతణ్ణి తరగతి గదిలోకి పంపించి... నేను బయట బెంచీ మీద కూర్చున్నాను. కొద్ది సేపటికి భరత్ ఏడుపు వినిపించింది. క్లాస్‌లోకి తొంగి చూశాను. మిగిలిన పిల్లలు అతణ్ణి ఆట పట్టిస్తున్నారు. టీచర్ దాన్ని పట్టించుకోనట్టు ఉన్నారు. నేను వెళ్ళి ఆమెను అడిగాను. 'ఈ స్కూల్ మీ అబ్బాయిలాంటి వాళ్ళ కోసం కాదు' అన్నట్టు మాట్లాడారు. వెంటనే భరత్‌ను తీసుకొని బయటకి వచ్చేశాను. ఇలాంటి అనుభవాలు మాకు ఎన్నో ఎదురయ్యాయి.

తెల్లకోటు వదిలేసి...

డాక్టర్ కావాలనేది నా చిన్ననాటి లక్ష్యం. దాన్ని నెరవేర్చుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. వివాహం అయ్యాక... నా స్వస్థలమైన కాన్పూర్‌లోనే ప్రాక్టీస్ పెట్టాను. 1998లో భరత్ పుట్టాడు. కొన్ని నెలల తరువాత తనకు ఆరోగ్యపరమైన లోపాలు ఉన్నట్టు గ్రహించాను. వైద్య పరీక్షలు చేయించాక... భరత్‌కు శారీరకంగాను, మానసికంగాను వైకల్యాలు ఉన్నట్టు తేలింది. కాన్పూర్‌తో పాటు లఖ్‌నవూ, ఢిల్లీ, బెంగళూరు... ఇలా ఎన్నో నగరాలకు చికిత్స కోసం అతణ్ణి తీసుకువెళ్ళాను. కానీ భరత్ పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు. తను ఈ సమస్యతో జీవితాంతం బాధపడాల్సిందేనని తెలిశాక... ఎంతో వేదన అనుభవించాం. కానీ ధైర్యం మాత్రం కోల్పోలేదు. మాకు వీలైనంత వరకూ భరత్‌కు అన్నీ నేర్పించాలని అనుకున్నాం. అయితే బడిలో అడ్మిషన్ సంపాదించడం కష్టమయింది. మా అబ్బాయి మిగిలిన పిల్లల కన్నా భిన్నమైనవాడని మాకు తెలుసు. కానీ ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే తను అర్థం చేసుకోగలడు. భరత్‌ను ఎవరైనా వెక్కిరించినా, అల్లరి పెట్టినా తన బాధను, కోపాన్ని వ్యక్తం చెయ్యగలడు. మామూలు స్కూళ్ళ వాతావరణంలో తను ఇమడలేడని గ్రహించాం. భరత్ లాంటి ఎందరో పిల్లల తల్లితండ్రులు కూడా నాకు పరిచయం అయ్యారు. వారి ఆవేదనను కూడా గమనించిన తరువాత... శారీరక, మానసిక వైకల్యాలు, ఆటిజం సమస్య ఉన్న పిల్లల కోసం నేనే ఒక స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. 2007లో 'సంకల్ప్ స్పెషల్ స్కూల్' స్థాపనతో తొలి అడుగు వేశాను. దానికోసం నేనే టీచర్‌గా మారాను. తెల్ల కోటు వదిలేసి... బ్లాక్ బోర్డు మీద పాఠాలు చెప్పడం మొదలుపెట్టాను.



చదువుతో పాటు నైపుణ్యాలు కూడా...

పిల్లలు సంతోషంగా ఉండడం, ఒత్తిడి లేకుండా తమకు వీలైనవి నేర్చుకోవడం, తోటి పిల్లలతో కలిసి ఆటపాటలతో గడపడం... ఇదీ ఈ పాఠశాల ఏర్పాటు వెనుక ప్రధానమైన ఆశయం. గత 18 ఏళ్ళలో కొన్ని వందలమంది పిల్లలు మా పాఠశాలలో చేరి, వివిధ నైపుణ్యాలు నేర్చుకున్నారు. ప్రస్తుతం అయిదు నుంచి ఇరవై ఎనిమిదేళ్ళ మధ్య వయసున్న వారు మా బడిలో చదువుతున్నారు. నిర్దిష్టమైన ఫీజులేవీ ఇక్కడ లేవు. ఎవరు ఎంత ఇవ్వగలిగితే అంత ఇవ్వొచ్చు. అది కూడా చెల్లించలేనివారికి అంతా ఉచితంగానే అందిస్తున్నాం. చదవడం, రాయడంతోపాటు హస్తకళలు, ఆట పాటలు, వివిధ నైపుణ్యాలను మా విద్యార్థులు నేర్చుకుంటున్నారు.

నాటికలు, ఏకపాత్రాభినయాలు కూడా వివిధ వేదికల మీద ప్రదర్శించి ప్రశంసలందుకుంటున్నారు. ఇంతకుముందు మా అబ్బాయి ఎక్కువ సమయం నాతో గడిపేవాడు. ఇప్పుడు తనకు ఎంతోమంది స్నేహితులు. నా మీద తను ఆధారపడడం తగ్గించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. అలాగే మా బడి పిల్లల తల్లితండ్రుల్లో సంతోషాన్ని చూస్తున్నప్పుడు ఎంతో సంతృప్తి కలుగుతోంది."

దిక్సూచి

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐటీ బాంబే సర్టిఫికెట్ ప్రోగ్రామ్

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఐఐటీ బాంబే ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. పన్నెండు నెలల ఈ కోర్సును పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. పరీక్షలు ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఇది పూర్తిగా వర్కింగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ ఫ్యాకల్టీలతోపాటు ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి రూపొందించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి కోర్సు ప్రారంభం కానుంది. పూర్తి వివరాల కోసం ఐఐటీ బాంబే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐబీపీఎస్ పీవో, ఎస్‌ఓ దరఖాస్తుల గడువు జూలై 28

ప్రొబెషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు దాఖలు గడువును ఐబీపీఎస్ పొడిగించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 28లోపు ibps.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

కోర్సు కాలవ్యవధి: 18 నెలలు
అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.
కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31
ఫోన్: 040 24008442, 7416860345,
Email: dec.nird@gov.in.
వెబ్‌సైట్: www.nirdpr.org.in

మ్యాట్ 2025 సెప్టెంబర్ సీజన్

సీబీటీ & పీబీటీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మ్యాట్ 2025' సెప్టెంబర్ సీజన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉద్దేశించిన ప్రధాన ఎంట్రెన్స్‌ల్లో 'ద మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్'(మ్యాట్) ఒకటి. ఈ ఎంట్రెన్స్‌ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. 2003 నుంచి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ దీనిని జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడల్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు మోడల్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని, ఆసక్తిని బట్టి ఈ రెంటిలో ఒకటి కానీ, రెంటినీ కానీ ఎంచుకోవచ్చు. మ్యాట్ స్కోరు వ్యాలిడిటీ ఒక సంవత్సరం ఉంటుంది. దేశవ్యాప్తంగా 600 పైగా బిజినెస్ స్కూల్స్ ఈ స్కోరు ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చు. అయితే కౌన్సెలింగ్ సమయంలోపు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం: మ్యాట్ ఎంట్రెన్స్ నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో ఐదు సెక్షన్లు ఉంటాయి. ప్రతీ సెక్షన్‌లో ముప్పై ప్రశ్నలు అంటే మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎంట్రెన్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానికి పావు మార్కు తగ్గిస్తారు.

● లాంగ్వేజ్ కాంప్రహెన్షన్	30
● ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్	30
● మేథమెటికల్ స్కిల్స్	30
● డేటా అనాలిసిస్ అండ్ సఫిసియన్సీ	30
● ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్	30

పీబీటీ ఎగ్జామ్

● పరీక్ష తేదీ:	2025 సెప్టెంబర్ 21
● రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:	2025 సెప్టెంబర్ 15
● హాల్ టికెట్ల విడుదల:	2025 సెప్టెంబర్ 18


సీబీటీ ఎగ్జామ్

● పరీక్ష తేదీ:	2025 సెప్టెంబర్ 28
● రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:	2025 సెప్టెంబర్ 22
● హాల్ టికెట్ల విడుదల:	2025 సెప్టెంబర్ 25

ఫీజు: పీబీటీ లేదా సీబీటీల్లో ఏదో ఒకటే రాయాలనుకున్న అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.2,200/-. రెండు ఎంట్రెన్స్‌లు రాయాలనుకున్న అభ్యర్థులు అదనంగా రూ.1600/- చెల్లించాల్సి ఉంటుంది.

ఫలితాలు: 2025 అక్టోబర్ రెండోవారంలో విడుదల చేస్తారు.

వెబ్‌సైట్: mat.aima.in



అడ్మిషన్స్

ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2026

'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ - 2026' నోటిఫికేషన్‌ను ఢిల్లీలోని 'ద నేషనల్ లా యూనివర్సిటీ' విడుదల చేసింది. ఐదు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లా(బీఏ ఎల్ఎల్‌బీ)(ఆనర్స్), ఒక సంవత్సరం మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 14న జరుగుతుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఏఐఎల్ఈటీ స్కోరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ('క్లాట్', 'ఎల్‌శాట్'తో ఇక్కడ అడ్మిషన్ లభించదు).

విద్యార్హత: ఐదు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉండాలి. ఓబీసీలకు 42, ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.

వయస్సు: ఏఐఎల్ఈటీ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఎలాంటి గరిష్ఠ, కనిష్ఠ వయస్సు నిబంధనలు లేవు.

పరీక్ష విధానం: మొత్తం మూడు సెక్షన్లతో 150 మార్కులు, 150 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

సెక్షన్ ఏ: ఇంగ్లీష్ లాంగ్వేజ్ - 50 మార్కులు - 50 ప్రశ్నలు
సెక్షన్ బి: కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ - 30 మార్కులు - 30 ప్రశ్నలు
సెక్షన్ సి: లాజికల్ రీజనింగ్ - 70 మార్కులు - 70 ప్రశ్నలు

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు 3500/-. ఎస్సీ/ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులకు 1500/-. 2025 ఆగస్ట్ 7 నుంచి 2025 నవంబర్ 10లోపు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఏఐఎల్‌టీఈ 2026 కోసం nationallawuniversitydelhi.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

చిరునామా: National Law University, Delhi, Sector-14, Dwaraka, New Delhi - 110078, India, 011- 40787555
(10:00 am to 05:00 pm on all working days)
ailetsupport@nludelhi.ac.in

SCHOLARSHIP ALERT

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2025-26 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Mr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first year of B.Tech courses at any of the specified 11 institutions can apply.
- The annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: A total of 28 beneficiaries will be awarded scholarships based on the actual fee structure.
- The scholarship fund will be provided for academic expenses such as tuition fees, hostel fees, food, and related expenses.
- The duration of the scholarship will be 4 years, subject to meeting the specified criteria for yearly renewal.

Last Date to Apply: 31-08-2025
Application: Online Only ***Short Url:*** www.b4s.in/aj/ASPI4

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students in Classes 1 to postgraduate level for the ECSS Scholarship 2025-26. This program supports meritorious and underprivileged students from financially challenged backgrounds.

Eligibility: Open to Indian nationals only
- Students in Classes 1–12, diploma, ITI, polytechnic, undergraduate, and postgraduate (general and professional) courses
- Minimum 55% marks in the last qualifying exam
- Annual family income must be INR 2.5 lakh or less
- Preference for students who have faced personal or family crises in the past three years, affecting their ability to continue education

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2025
Application: Online only ***Short Url:*** www.b4s.in/aj/HDFC57

Corteva Agriscience Scholarship Program

Description: An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing undergraduate, postgraduate, or doctoral courses in the area of agriculture and allied streams.



Eligibility: Female students in postgraduate (MBA/M.Sc./ M.Tech.), doctoral, or undergraduate courses in government colleges
- The applicant's annual family income must be 6,00,000 or less. Students from across India can apply
- Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:
- For UG students: 25,000
- For PG students: 35,000

Last Date to Apply: 31-08-2025 ***Application mode:*** Online only
Short Url: www.b4s.in/aj/CASP5

buddy4study.com



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

'మైసా'గా రష్మిక



రష్మిక మందన్న కొత్త చిత్రం 'మైసా' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్ కొట్టారు. రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేసి, ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. రష్మిక 'మైసా' అనే శక్తిమంతమైన, హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, గోండు తెగల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని, మొదటి షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటుందని చిత్రబృందం పేర్కొంది.

ఉత్కంఠభరిత చిత్రం



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'కామాఖ్య'. పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఓం ఫిల్మ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన కథని సిద్ధం చేశారని మేకర్స్ తెలిపారు. ఆనంద్, శరణ్య, ప్రదీప్, వైష్ణవ్, ధన్‌రాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త పాత్రలో..



వరుణ్ సందేశ్ హీరోగా ఏ.పళని స్వామి తెరకెక్కించనున్న 'వన్ వే టికెట్' అనే సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. బొరిగే శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు త్రినాధరావు నక్కిన, సంగీత దర్శకుడు సాయి కార్తిక్, నటి కుష్బూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతున్నాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు పళని స్వామి మాట్లాడుతూ 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతోంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్: శ్రీనివాస్ బెజుగమ్, సంగీతం: సాయి కార్తీక్.







చైనా చిన్నది ఫైనల్ చేరింది

ప్రపంచ స్విమ్మింగ్‌లో 12 ఏళ్ల జిడి సంచలనం

సింగపూర్: ఈత కొలనులో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న 12 ఏళ్ల చైనా టీనేజ్ స్విమ్మర్ యు జిడి ఊహించినట్లే అంతర్జాతీయ స్విమ్మింగ్‌లోనూ సంచలనం దిశగా దూసుకెళ్తోంది. ఇటీవల చైనా చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్రపంచ టోర్నీకి అర్హత సాధించిన ఈ చిన్నది.. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ తన అరంగేట్రాన్ని ఘనంగా చాటింది. ఈ మెగా టోర్నీలో 200 మీటర్లు, 400 మీటర్లు వ్యక్తిగత మెడ్లే, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగాల్లో పోటీపడుతోన్న యు జిడి.. ఆదివారం ఇక్కడ జరిగిన 200 మీటర్ల మెడ్లేలో ఫైనల్ చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదట 2 నిమిషాల 11.90 సెకన్ల టైమింగ్‌తో సెమీఫైనల్ చేరింది. మొత్తం 16 మంది క్వాలిఫయర్స్‌లో జిడి 15వ ఫాస్టెస్ట్ టైమ్ నమోదు చేసింది. అనంతరం సెమీస్‌లో 2 నిమిషాల 10.22 సెకన్ల టైమింగ్‌తో ఏడోస్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఫైనల్లో పోటీపడుతోన్న ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రికార్డు గ్రహీత సమ్మర్ మెకింతోష్‌కు ఇప్పుడు జిడి గట్టి పోటీదారుగా నిలిచింది.

311 పరుగుల లోటు.. ఐదు సెషన్ల ఆట.. అటు చూస్తే బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్. దీనికి తోడు సున్నాకే రెండు వికెట్లు ఫట్. ఈనేపథ్యంలో టీమిండియా గెలుపు కాదు కదా.. కనీసం డ్రా కూడా అసాధ్యమేనేమో అనిపించింది. కానీ పోరాడితే పోయేదేముందనే కసితో బరిలోకి దిగిన టీమిండియా అబ్బురపరిచింది. కెప్టెన్ గిల్ తన అసాధారణ ఆటతీరుతో సిరీస్‌లో నాలుగో శతకం సాధించగా, రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్ సెంచరీ సమీపంలో నిలిచింది. ఇక జడేజా-సుందర్‌లు రెండు సెషన్ల పాటు నిలిచి అజేయ సెంచరీలతో ఓటమి నుంచి కాపాడారు. వీరి పోరాటంతో మ్యాచ్ గ్రేట్ ఎస్కేప్ రీతిలో చరిత్రాత్మక డ్రాగా ముగిసింది. దీంతో తమదే విజయమనే ధీమాలో ఉన్న ఇంగ్లండ్‌కు దిమ్మ తిరిగింది. ఈ అలుపెరుగని పోరాటంతో యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని నయా భారత్‌ను తక్కువ అంచనా వేయరాదని ప్రత్యర్థి జట్లకు చాటి చెప్పింది.

టీమిండియా అద్భుత పోరాటం



గిల్ (103)



జడేజా (107 నాటౌట్)

1 ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ శతకాలు (4) బాదిన కెప్టెన్‌గా బ్రాడ్‌మన్, గవాస్కర్ సరసన నిలిచిన గిల్. అయితే తొలిసారి కెప్టెన్‌గా బరిలోకి దిగి ఇన్ని సెంచరీలు సాధించిన రికార్డు మాత్రం గిల్‌దే. ఇక భారత్ తరఫున ఓ సిరీస్‌లో నాలుగు సెంచరీలు సాధించి గవాస్కర్, విరాట్‌లతో సమంగా నిలిచాడు.

గ్రేట్ ఎస్కేప్

శతక్కొట్టిన గిల్, జడేజా, సుందర్ ● రాహుల్ చేజారిన సెంచరీ

భారత్ రెండో ఇన్నింగ్స్ 425/4 ● ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు డ్రా

మాంచెస్టర్: ఐదు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. బ్యాటర్ల అసామాన్య పోరాటంతో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టును టీమిండియా డ్రాగా ముగించింది. దీంతో ఈనెల 31 నుంచి జరిగే ఐదో టెస్టులో నెగ్గి సిరీస్‌ను సమం చేయాలనుకుంటోంది. ప్రస్తుతం స్టోక్స్ సేన 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి రోజు ఆదివారం ఆటలో జడేజా (107 నాటౌట్), సుందర్ (101 నాటౌట్), కెప్టెన్ గిల్ (103) శతకాలతో హోరెత్తించారు. దాదాపు రోజంతా బ్యాటింగ్ సాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లలో 425/4 స్కోరుతో నిలిచింది. రాహుల్ (90) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వోక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా స్టోక్స్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులు చేశాయి.

గిల్ శతక పోరాటం: 174/2 ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. శనివారం క్రీజులో పాతుకుపోయి డ్రాపై ఆశలు రేపిన కెప్టెన్ గిల్, రాహుల్ ఏమేరకు పోరాడతారనే ఆసక్తి అంతటా వ్యక్తమైంది. అయితే తన క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న రాహుల్ సెంచరీకి మరో 10 రన్స్ దూరంలోనే ఆగాడు. ఆట ఆరంభమైన కాసేపటికే అతడిని స్టోక్స్ ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 421 బంతుల్లో 188 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఇక స్టోక్స్ తర్వాతి ఓవర్‌లో బంతి గిల్ కుడిచేతి బొటన వేలికి తాకి పైకి లేచి హెల్మెట్‌ను సైతం తాకడంతో బాధతో విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి పరిశీలించాక బ్యాటింగ్ సాగించాడు. నాలుగో రోజు బౌలింగ్‌కు దూరంగా ఉన్న స్టోక్స్ ఆదివారం మాత్రం భుజం నొప్పితోనే వరుసగా ఎనిమిది ఓవర్ల స్పెల్ వేసి బౌన్స్‌తో ఇబ్బందిపెట్టాడు. 90 పరుగులకు చేరాక నిదానం కనబర్చిన గిల్ మరో 10 రన్స్ కోసం 36 బంతులాడి శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ అప్పటికే కొత్త బంతి తీసుకున్న ఇంగ్లండ్ ఫలితం సాధించింది. సెషన్ ముగియడానికి రెండు ఓవర్ల ముందు గిల్‌ను ఆర్చర్ అవుట్ చేశాడు. తర్వాతి బంతికే జడేజా ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో రూట్ వదిలేశాడు. తొలి సెషన్‌లో కేవలం 49 పరుగులే రావడం గమనార్హం.

జడ్డూ-సుందర్ శతక భాగస్వామ్యం: 88 పరుగులు వెనుకబడిన దశలో రెండో సెషన్‌ను ఆరంభించిన భారత్‌కు జడేజా-సుందర్ అద్భుత భాగస్వామ్యంతో అండగా నిలిచారు. బౌలర్లను మార్చినా.. క్రీజుకు నలువైపులా ఫీల్డర్లను మోహరించినా... ఇంగ్లండ్ ఈ జోడీని విడదీయలేకపోయింది. పట్టు వదలకుండా ఒక్కో బంతిని జాగ్రత్తగా ఆడేస్తూ ప్రత్యర్థి బౌలర్లను విసిగించారు. స్పిన్నర్ డాసన్ కూడా ఈ ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లను ఇబ్బంది పెట్టలేకపోయాడు. స్టోక్స్ ఓవర్‌లో 6,4తో సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. అదే ఓవర్‌లో మరో ఫోర్‌తో జడేజా సైతం ఈ ఫీట్ అందుకున్నాడు. సెషన్ ముగిసేసరికి ఐదో వికెట్‌కు అజేయంగా వంద పరుగుల భాగస్వామ్యం పూర్తి చేయడమే కాకుండా.. జట్టుకు 11 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. దీంతో డ్రాపై అంచనాలు మరింత పెరిగాయి. ఆఖరి సెషన్‌లోనూ పరిస్థితి మారలేదు. బంతి కూడా పాతబడడంతో వీరి బ్యాటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు.

స్టోక్స్‌కు నో..

ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 138వ ఓవర్ ముగిశాక కెప్టెన్ స్టోక్స్ డ్రా కోసం ముందుకు వచ్చాడు. అయితే జడేజా, సుందర్ సెంచరీకి చేరువలో ఉండడంతో దీనికి అంగీకరించలేదు. దీంతో స్టోక్స్ అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. అటు డ్రెస్సింగ్ రూమ్ నుంచి కెప్టెన్ గిల్ చిరునవ్వుతో ఇదంతా గమనిస్తున్నా అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక మ్యాచ్‌ను త్వరగా పూర్తి చేసేందుకు స్టోక్స్ తమ ఫీల్డర్లను సర్కిల్ లోపలే ఉంచాడు. దీంతో ఆ తర్వాత ఐదు ఓవర్లలోనే వేగంగా బౌండరీలు రాబట్టి జడ్డూ, సుందర్ తమ శతకాలను పూర్తి చేసి ఆటను ముగించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 203 పరుగులు జోడించడం విశేషం.





వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్)

1 టెస్టు సిరీస్‌ల్లో ఎక్కువ సార్లు (7) 350+ స్కోర్లు సాధించిన జట్టుగా భారత్.

1 మూడు లేదా నాలుగో ఇన్నింగ్స్‌లో మూడు శతకాలు నమోదు కావడం భారత్‌కిదే తొలిసారి. అలాగే ఓ టెస్టు సిరీస్‌లో నలుగురు భారత బ్యాటర్లు (గిల్, పంత్, రాహుల్, జడేజా) 400+ పరుగులు సాధించడం కూడా ఇదే మొదటిసారి.

2 కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే ఎక్కువ పరుగులు (722) చేసిన రెండో బ్యాటర్‌గా గిల్. డాన్ బ్రాడ్‌మన్ (810) తొలి స్థానంలో ఉన్నాడు. అలాగే భారత్ తరఫున ఈ ఫీట్ సాధించిన రెండో బ్యాటర్ అయ్యాడు. గవాస్కర్ (774, 732) ముందున్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 669
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0, రాహుల్ (ఎల్బీ) స్టోక్స్ 90, సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0, గిల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 103, సుందర్ (నాటౌట్) 101, జడేజా (నాటౌట్) 107, ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 143 ఓవర్లలో 425/4; వికెట్ల పతనం: 1-0, 2-0, 3-188, 4-222. బౌలింగ్: వోక్స్ 23-4-67-2, ఆర్చర్ 23-3-78-1, కార్స్ 17-3-44-0, డాసన్ 47-11-95-0, రూట్ 19-2-68-0, స్టోక్స్ 11-2-33-1, బ్రూక్ 3-0-24-0.

సన్‌రైజర్స్‌ను వీడే ప్రసక్తి లేదు



నితీశ్ కుమార్

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టుతో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ది విడదీయరాని బంధం. 2024 ఐపీఎల్ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ ఫైనల్‌కు చేరడంలో నితీశ్‌ది కీలక పాత్ర. ఆ సీజన్ 13 మ్యాచ్‌ల్లో దాదాపు 143 స్ట్రయిక్‌రేట్‌తో రెండు హాఫ్ సెంచరీలు సహా నితీశ్ 303 పరుగులు కొల్లగొట్టాడు. అలాగే బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక-సీన్ కట్ చేస్తే-ఎస్ఆర్‌హెచ్‌ను నితీశ్ వీడనున్నాడని కొద్ది రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 2026 సీజన్‌కు ముందు అతడు కొత్త జట్టుతో చేరనున్నాడని పేర్కొన్నాయి. ఎట్టకేలకు ఈ వార్తలపై నితీశ్ పెదవి విప్పాడు. 'నేను సన్‌రైజర్స్‌ను వీడనున్నాననే వార్తలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఎస్ఆర్‌హెచ్‌తో నా బంధం నమ్మకం, గౌరవంతో కూడినది. అందువల్ల నేను ఎప్పుడూ ఆ జట్టుతోనే కొనసాగుతా' అని ఎక్స్‌లో పేర్కొన్నాడు.

తులసి, నిత్యకు స్వర్ణాలు

బ్రిటిష్, ఐరిష్ పారా బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు సత్తా చాటారు. యూకేలోని కార్డిఫ్‌లో జరిగిన బ్రిటిష్, ఐరిష్ పారా టోర్నీలో తులసి మురుగేశన్, నిత్య శ్రీ సుమతి సివాన్ సింగిల్స్‌లో పసిడి పతకాలు కొల్లగొట్టారు. మహిళల సింగిల్స్ ఎస్‌యూ5 కేటగిరి ఫైనల్లో తులసి 18-21, 21-17, 21-16తో భారత్‌కే చెందిన మనీషా రామదాస్‌ను ఓడించింది. ఎస్‌హెచ్6 సింగిల్స్ తుదిపోరులో నిత్యశ్రీ 21-11, 21-23, 21-11తో గిలియానా పొవెడ (పెరూ)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో సుకాంత్ (ఎస్ఎల్4), కృష్ణ నగర్ (ఎస్‌హెచ్6) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల డబుల్స్ డబ్ల్యూహెచ్1 కేటగిరిలో ప్రేమ్ కుమార్/అబూ హుబైదా జోడీకి కాంస్యం, మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 విభాగంలో కృష్ణా నగర్/నిత్యశ్రీ జంటకు కాంస్యం దక్కాయి. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్ కౌర్, మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్/చిరాగ్ ద్వయం కాంస్యాలు అందుకున్నారు.



ఫలితం టైబ్రేక్‌కు

రెండో గేమ్‌లోనూ హంపిని నిలువరించిన దివ్య

విజేత తేలేది నేడే ● మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్‌కప్ విజేత ఎవరో తేలేది టైబ్రేక్‌లోనే. జీఎం కోనేరు హంపి, ఐఎం దివ్య దేశ్‌ముఖ్ మధ్య ఆదివారం జరిగిన రెండో క్లాసిక్ గేమ్ కూడా 34 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. తొలి గేమ్‌లో కూడా ఇద్దరూ పాయింట్ పంచుకొన్నారు. హంపి, దివ్య 1-1తో సమంగా నిలవడంతో.. క్వీన్ ఎవరనేది సోమవారం జరిగే టైబ్రేక్‌లో తేలనుంది.

దూకుడు తగ్గించి..

రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడడం హంపికి లాభిస్తుందని భావించారు. కానీ, డేరింగ్‌గా ఆడే దేశ్‌ముఖ్ వీలైనంతగా డ్రా కోసం ప్రయత్నించింది. ఇద్దరూ సరికొత్త ప్రయోగాలు చేయకుండా.. సంప్రదాయ ఆటకే ప్రాధాన్యమిచ్చారు. కోనేరు ఇంగ్లిష్ ఓపెనింగ్ చేయగా.. దేశ్‌ముఖ్ అగిన్‌కోర్ట్ డిఫెన్స్‌తో ఎదుర్కొంది. మిడిల్ గేమ్‌లో బోర్డుపై ఆధిపత్యం సాధించడానికి పాన్‌ను ట్రేడ్ చేసింది. అయితే, దివ్య బిషప్‌తో ఎఫ్3లోని హంపి నైట్‌ను పిన్ చేసింది. ఈ క్రమంలో హంపి నైట్‌ను కోల్పోగా.. దివ్య బిషప్‌ను చేజార్చుకొంది. 14వ ఎత్తు వేయడానికి కోనేరు కొంత సమయం తీసుకోగా.. దివ్యకు 20 నిమిషాల ఆధిక్యం దక్కింది. 16 ఎత్తుల తర్వాత ఇద్దరూ రూక్‌లను ట్రేడ్ చేసుకొన్నారు. హంపి, దివ్య సమవుజ్జీలుగా నిలవడంతో.. గేమ్ డ్రా దిశగా సాగింది. అనంతరం దేశ్‌ముఖ్ క్వీన్స్ ట్రేడ్ కోసం ప్రయత్నించినా.. తోసిపుచ్చిన హంపి గెలుపు కోసం ప్రయత్నించింది. 28వ ఎత్తులో సి7లోకి క్వీన్‌ను నడిపిన హంపి.. దివ్యను ఉచ్చులోకి లాగే ప్రయత్నం చేసింది. దీన్ని పసిగట్టిన దేశ్‌ముఖ్ తన క్వీన్‌ను డి5లోకి నడిపి తప్పించుకొంది. ఎండ్‌గేమ్‌లో ఇద్దరూ వేగంగా ఎత్తులు వేస్తూ పాన్‌లను త్యాగం చేశారు. హంపి క్రమంగా పట్టుబిగిస్తున్న సమయంలో దివ్య డ్రా కోసం తీవ్రంగా ప్రయత్నించింది. 30వ ఎత్తు నుంచి వరుసగా మూడుసార్లు తన క్వీన్‌ను డీ1లోకి నడిపిన దేశ్‌ముఖ్.. 34 ఎత్తులో గేమ్‌ను డ్రాగా ముగించింది. కాగా, మూడో స్థానం కోసం చైనా గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరిగిన పోరులో టాన్ జోంగ్‌యి 1.5-0.5తో లి టింగ్జీపై గెలిచింది.

టైబ్రేక్ ఇలా..

టైబ్రేక్‌లో 15 నిమిషాల రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్ జరగనుంది. ఇది డ్రా అయితే.. 10 నిమిషాల రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్ నిర్వహిస్తారు. ఇది కూడా సమంగా ముగిస్తే.. 5 నిమిషాల రెండు బ్లిట్జ్ గేమ్‌ల సెట్ ద్వారా ఫలితం తేల్చేందుకు ప్రయత్నిస్తారు. ఒకవేళ ఇది కూడా డ్రా అయితే.. చివరగా మూడు నిమిషాల గేమ్‌తో ఫలితం వచ్చే వరకు ఆడిస్తారు.

విండీస్.. అదే తీరు

నాలుగో టీ20లో ఆసీస్ విజయం

సెయింట్ కిట్స్: వెస్టిండీస్ జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. ఆస్ట్రేలియాతో శనివారం జరిగిన నాలుగో టీ20లోనూ 3 వికెట్ల తేడాతో ఓడింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 0-4తో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన విండీస్‌కిది ఈ ఫార్మాట్‌లో వరుసగా ఏడో ఓటమి. గత నెలలో ఇంగ్లండ్‌పై 0-3తో వైట్‌వాష్ అయ్యింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 205/9తో భారీ స్కోరు సాధించింది. రూథర్‌ఫోర్డ్ (31) టాప్‌స్కోరర్. జంపాకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 19.2 ఓవర్లలో 206/7 స్కోరుతో నెగ్గింది. గ్రీన్ (55), ఇన్‌గ్లిస్ (51), మ్యాక్స్‌వెల్ (47) రాణించారు. బ్లేడ్స్‌కు మూడు వికెట్లు దక్కాయి.

విజేతలు షి, వాంగ్

చైనా ఓపెన్

చాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషులు, మహిళల సింగిల్స్ టైటిళ్లను షి యుకి, వాంగ్ జియీ గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో యుకి (చైనా) 14-21, 21-14, 21-15తో తన దేశానికే చెందిన వాంగ్ జెన్‌సింగ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్ తుది పోరులో డిఫెండింగ్ చాంపియన్ వాంగ్ జియీ 21-18, 21-13తో హాన్ ఈ (చైనా) చిత్తుచేసి టైటిల్ నిలబెట్టుకుంది. మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ లియు/టాన్ (చైనా) జంట 24-22, 17-21, 21-14తో జాంగ్/జియా (చైనా) ద్వయంపై నెగ్గి చాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్ తుది పోరులో ఫజర్/మహ్మద్ (ఇండోనేసియా) జోడీ 21-14, 21-15తో చియా /సో (మలేసియా) జంటపై నెగ్గి టైటిల్ అందుకుంది.



అంకితకు రజతం

- భారత్‌కు 12 పతకాలు
- ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు

న్యూఢిల్లీ: జర్మనీలోని ఎస్సెన్ నగరంలో ఆదివారం ముగిసిన ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలను భారత్ మొత్తం 12 పతకాల (2-5-5)తో ముగించింది. చివరి రోజు..మహిళల మూడువేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అంకిత ధ్యానీ రజతం సాధించింది. ఇక, పురుషుల 4x100 మీ. రిలేలో, మహిళల 20 కి.మీ. రేస్‌వాక్ టీమ్ ఈవెంట్‌లో మనోళ్లు కాంస్యాలు నెగ్గారు. ఆఖరి రోజు పలువురు భారత అథ్లెట్లు ట్రాక్ విభాగాలలో తలపడినా..కేవలం రెండు పతకాలే లభించాయి. 23 ఏళ్ల అంకిత తొమ్మిది నిమిషాల 31.99 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో రేస్‌ను పూర్తి చేసి రజతం దక్కించుకుంది. ఫిన్లాండ్, జర్మనీ అథ్లెట్లు స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. లాలూ ప్రసాద్, అనిమేష్ కుజుర్, మణికంఠ, మృత్యుంజయరాంతో కూడిన జట్టు 4x100 మీ. రిలేను 38.89 సెకన్లతో పూర్తి చేసి కాంస్యం చేజిక్కించుకుంది. దక్షిణకొరియా స్వర్ణం, దక్షిణాఫ్రికా కాంస్య పతకం నెగ్గాయి. మునిత, మాన్సీ, సెజాల్‌తో కూడిన భారత త్రయం మహిళల 20 కి.మీ. టీమ్ రేస్‌వాక్‌లో (4:56:06) కాంస్యం గెలుపొందింది. చైనా స్వర్ణం, ఆస్ట్రేలియా రజతం అందుకున్నాయి.

మోర్కెల్‌పై వేలాడుతున్న కత్తి?

టీమిండియా బౌలింగ్ ప్రదర్శనపై బీసీసీఐ గుర్రు



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భారత జట్టు బౌలింగ్ ప్రదర్శనపై బీసీసీఐ అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. దీంతో టీమిండియా సహాయ సిబ్బంది మోర్నీ మోర్కెల్, టెన్ డస్కాటెపై వేటుపడే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పనితీరుపైనా బోర్డు పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేశారట. అజిత్ ప్రస్తుతం జట్టుతోనే పర్యటిస్తున్నాడు. అయితే, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడం బోర్డు ఆగ్రహానికి ఒక కారణంగా భావిస్తున్నారు. ఈ సిరీస్‌లో టీమిండియా బౌలింగ్ మరీ నాసిరకంగా ఉంది. ఈ నేపథ్యంలో బౌలింగ్ కోచ్ మోర్కెల్ పనితీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది. అసిస్టెంట్ కోచ్ డస్కాటే కూడా ఆశించినంత జట్టుకు సేవలందించలేక పోయాడు. సిరీస్ ముగిసిన తర్వాత సమీక్షా సమావేశంలో వీరిద్దరిపై వేటువేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అయితే, చీఫ్ కోచ్ గంభీర్ పోస్టుకు ఇప్పట్లో గండం లేదని తెలుస్తోంది. వైట్‌బాల్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన గౌతీకి ప్లస్‌గా మారింది.

తిలక్‌కు సౌత్‌జోన్ పగ్గాలు

మళ్లీ జోనల్ ఫార్మాట్‌లో దులీప్ ట్రోఫీ



బెంగళూరు: దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ కెప్టెన్‌గా హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ నియమితుడయ్యాడు. అతడితోపాటు తెలుగు ఆటగాళ్లు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, రికీ భుయ్, టి. విజయ్, షేక్ రషీద్ కూడా ఎంపికయ్యారు. కర్ణాటక క్రీడాకారులు వైశాక్ విజయ్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, స్మరణ్‌కు కూడా టీమ్‌లో చోటుదక్కింది. దులీప్ ట్రోఫీని మళ్లీ జోనల్ ఫార్మాట్‌కు మార్చిన సంగతి తెలిసిందే. గతేడాది భారత్ ఎ,బి,సి,డి జట్లుగా విభజించి నిర్వహించారు. కానీ, ఈసారి జోనల్ సెలెక్టర్లు ఆరు జట్లను ఎంపిక చేశారు. వచ్చే నెల 28 నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ మైదానంలో మ్యాచ్‌లు జరగనున్నాయి.

311 కి.మీ.. రూ.4,872 కోట్ల పనులు

» 4 చోట్ల బ్రిడ్జిలు..3 చోట్ల బైపాస్‌లు.. పలు చోట్ల విస్తరణ

» 28 పనులు హై కేటగిరి.. మీడియం కేటగిరీలో 2

» 2025-26 తెలంగాణ వార్షిక ప్రణాళిక ఖరారు చేసిన కేంద్ర రోడ్డు, రవాణాశాఖ



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జాతీయ రహదారుల అభివృద్ధి, ఉన్నతీకరణకు సంబంధించి కేంద్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో 1,123 కిలోమీటర్ల మేర 15 జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.33వేల కోట్ల మేర పనులు చేయాల్సి ఉందని గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా 2025-26 యాన్యువల్ ప్లాన్ కింద మరికొన్ని పనులు చేయాలని కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వశాఖ గుర్తించింది. ఆ వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 4 చోట్ల బ్రిడ్జిలు, 3 ప్రాంతాల్లో బైపాస్‌లు, పలుచోట్ల రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉందని, మొత్తం 311 కి.మీల మేర పనులు చేయాల్సి ఉందని తేల్చింది. వీటిని 30 పనులుగా విభజించింది. వీటి నిర్మాణం కోసం దాదాపు రూ.4,872 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేసింది. గుర్తించిన 30 పనుల్లో 28 పనులను హై కేటగిరీ కింద త్వరితగతిన పూర్తిచేయాలని నిర్ణయించింది. మరో రెండింటిని మీడియం కేటగిరిలో చేర్చింది. గుర్తించిన అన్ని పనులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), అంచనా వివరాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే 6 చోట్ల చేపట్టాల్సిన పనులకు డీపీఆర్‌లు శాఖకు అందాయి. మరో 16 పనులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేస్తున్నారు. మిగిలిన పనులకు సంబంధించిన అంచనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే గుర్తించిన 15 జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు ఇవి అదనం. దీని ప్రకారం 15 జాతీయ రహదారుల పనులకు రూ.33,690 కోట్లతో పాటు తాజాగా గుర్తించిన పనులకు రూ.4,872 కోట్లు కలిపి మొత్తం రూ.38,562 కోట్లను రాష్ట్రంలోని జాతీయ రహదారుల అభివృద్ధి కోసం వెచ్చించనున్నారు. ఈ మొత్తం పనులను లక్ష్యం మేరకు పూర్తిచేయాలని నిర్ణయించారు.

గుర్తించిన వాటిలో ముఖ్యమైన పనుల వివరాలు..

- ఎన్‌హెచ్ 161బీ మద్నూర్-బోధన్ సెక్షన్‌లో 39 కి.మీ మేర రోడ్డు విస్తరణ. డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. రూ.634కోట్ల అంచనా.
- ఎన్‌హెచ్- 365బీ దుద్దెడ నుంచి సిరిసిల్ల సెక్షన్‌లో 54 కి.మీల మేర 4లేన్ల పేవ్డ్ షోల్డర్ విధానం. రూ.1,150 కోట్లు అంచనా.
- ఎన్‌హెచ్- 61 మార్గంలో ఖానాపూర్ నుంచి చెల్గల వరకు 54 కి.మీల ఉన్న బైపాస్ విస్తరణ, అభివృద్ధి. రూ.750 కోట్లు అవసరమని అంచనా.
- ఎన్‌హెచ్-167ఎన్‌లో రూ.550కోట్లతో 11 కి.మీల బైపాస్ నిర్మాణం.
- 22కి.మీ మేర భూపాలపల్లిలో బైపాస్ నిర్మాణం. 500 కోట్ల అంచనా.
- ఎన్‌హెచ్-163 మార్గంలో హైదరాబాద్ నుంచి భూపాలపట్నం సెక్షన్‌లో 35 కి.మీ మేర 4 లేన్ల విస్తరణ. రూ.270కోట్ల అంచనా. ఎన్‌హెచ్-353సీ సెక్షన్‌లో రూ.190 కోట్లతో34 కి.మీల పరకాల బైపాస్ నిర్మాణం.
- ఎన్‌హెచ్-167లో హుజూర్‌నగర్ దగ్గర 180కోట్లతో 7కి.మీ మేర బైపాస్.
- ఎన్‌హెచ్-163లోని హైదరాబాద్- భూపాలపట్నం సెక్షన్‌లో కిలోమీటర్ మేర 2 బ్రిడ్జిల నిర్మాణం. రూ.150 కోట్ల అంచనా.
- ఎన్‌హెచ్-63 మార్గంలోని నిజామాబాద్-జగదల్‌పూర్ సెక్షన్‌లో మేజర్ బ్రిడ్జి, రోడ్డు విస్తరణ, ఇప్పటికే ఉన్న ఒక మేజర్ బ్రిడ్జికి అదనపు పనులు కలిపి 10 కి.మీ మేర రూ.151కోట్లు అంచనా.
- ఎన్‌హెచ్ 365లో నకిరేకల్ - తానంచర్ల సెక్షన్‌లో 2 కి.మీ పరిధిలో ఒక ఫ్లై ఓవర్, ఒక అండర్‌పాస్ నిర్మాణం. రూ.58 కోట్ల అంచనా.

జలాశయాల నిర్వహణలో అలసత్వం!

(మొదటిపేజీ తరువాయి)

తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు నాగార్జునసాగర్. దీని స్పిల్‌వే మరమ్మతులు ఈ ఏడాది లేనట్లే. 1967లో నిర్మాణం పూర్తయిన ఈ ప్రాజెక్టు స్పిల్‌వేకు ఇప్పటి వరకు నాలుగుసార్లు మరమ్మతులు చేశారు. చివరిసారిగా 2023లో రూ.20 కోట్లతో మరమ్మతులు చేశారు. కానీ, 2024లో స్పిల్‌వేపై మళ్లీ భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగర్ స్పిల్‌వేకు ఆధునిక పరిజ్ఞానంతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని తలపెట్టారు. స్పిల్‌వే వద్ద కదిలే క్రేన్‌ను ఏర్పాటు చేస్తే మరమ్మతులు చేయడం సులభమవుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సమీక్షలో తెలిపారు. కానీ, ఇప్పటికీ ఆ పనులు ప్రారంభమవలేదు. గత నెలలో ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం ఓ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో కలిసి సాగర్ స్పిల్‌వేను పరిశీలించి వెళ్లింది. నిధులు కేటాయించగానే తొలుత ఒక గేటు స్పిల్‌వేకు మరమ్మతులు చేసి, ఈ ఏడాది వరదల్ని తట్టుకుంటే మిగిలిన అన్ని స్పిల్‌వేలకూ అదే పరిజ్ఞానంతో మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఆ దిశగా ఇంకా ఎలాంటి అడుగులూ పడలేదు. ప్రస్తుతం సాగర్‌కు వరద మొదలైంది. అంటే ఈ ఏడాది స్పిల్‌వే మరమ్మతులు లేనట్లే. అయితే, క్రస్ట్ గేట్లకు సర్వీసింగ్ పూర్తి చేశారు. ఏటా జూన్‌లో క్రస్ట్ గేట్లకు రబ్బరు సీళ్లను సరిచేయడం, గేట్లను ఎత్తడానికి ఉపయోగించే రోప్‌లకు గ్రీజింగ్ చేయడం, మోటార్ల సర్వీసింగ్ వంటి పనులు చేపడతారు. ఈ పనులను గత నెల 20 కల్లా పూర్తి చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

శాలిగౌరారం ప్రాజెక్టుపై పట్టింపే లేదు

నల్లగొండ జిల్లాలో 6 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాల్లో భూగర్భజలాల పెంపునకు దోహదపడే శాలిగౌరారం ప్రాజెక్టు నిర్వహణపై అధికారులు కనీసం దృష్టి సారించడం లేదు. ఈ ప్రాజెక్టు షట్టర్లు శిథిలమై దశాబ్దం గడిచిపోయినా వాటిని మార్చే ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ఈ ప్రాజెక్టు ప్రధాన కుడికాల్వ తూముకు నాలుగు షట్టర్లు ఉండగా, ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మిగిలిన మూడు శిథిలమవడంతో నీరు వృథాగా పోతోంది. ప్రధాన ఎడమకాల్వ తూముకు ఉన్న రెండు షట్టర్లలో ఒక్కటే పనిచేస్తోంది. ఇక్కడా నీరు వృథాగా పోతోంది.

డిండి ప్రాజెక్టుపై చిన్నచూపు

నల్లగొండ జిల్లాలో ప్రాచీన ప్రాజెక్టయిన డిండి నిర్వహణపై అధికారులు శీతకన్నేశారు. 2.4 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్‌కు మూడు షట్టర్లు ఉండగా, మధ్య షట్టర్ నుంచి నిరంతరాయంగా నీరు లీకవుతోంది. దానికి ఎలాంటి మరమ్మతులూ చేయలేదు. స్పిల్‌వే ముందు భాగంలో ఉన్న కంప చెట్లను తొలగించలేదు. కనీస నిర్వహణ లేకపోవడంతో నీటి లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి.

జూరాల రోప్‌లు తెగిపాయె..!

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, సరళా సాగర్ జలాశయాలు ఉన్నాయి. జూరాలకు 66 క్రస్టు గేట్లు ఉండగా.. ఈ ఏడాది 8 గేట్లకు సంబంధించిన రోప్స్ తెగిపోయాయి. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ రచ్చకు దారితీసింది. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాజెక్టును పరిశీలించి, త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ నిధులు సరిగా విడుదల కాలేదని, ఇప్పుడు అన్ని మరమ్మతులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

- కోయిల్‌సాగర్ రిజర్వాయర్ గేట్లకు రబ్బర్ సీళ్లు సరిగా లేవు. గ్రీజింగ్ కూడా సరిగా చేయడం లేదు. మొత్తం 13 గేట్లలో రెండు గేట్లు సరిగా పని చేయడం లేదు. డ్యాం లైటింగ్, విద్యుత్తు సరఫరా బాగానే ఉంది. గేట్లు ఎత్తిన సమయంలో తప్ప పర్యవేక్షణ ఉండడం లేదు. ఏటా నిర్వహణకు రూ.3 లక్షలు కేటాయిస్తే, మొత్తం ఖర్చు చేస్తున్నారు.
- రామన్‌పాడు ప్రాజెక్టు గేట్ల రబ్బర్ సీల్స్ సరి చేయలేదు. రోపులకు గ్రీజింగ్ కూడా చేయలేదు. రెండు వైపులా ఉండే స్లూయిజ్ గేట్లకు సర్వీసింగ్ లేక లీకేజీలు అవుతున్నాయి. మరమ్మతులకు రూ.4 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు.



జూరాల ప్రాజెక్టు రోప్‌లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దిగువ మానేరు పరిస్థితి ఇదీ..

కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయాని (ఎల్ఎండీ)కి 20 గేట్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్రీజింగ్ చేశారు. మోటర్లకు సర్వీసింగ్ చేస్తున్నారు. 2022లో 10 గేట్లకు వైర్ రోప్‌లు కొత్తవి వేశారు. మరో 10 గేట్లకు రోప్‌లు మార్చేందుకు రూ.4 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు పంపించారు. ఎల్ఎండీకి రివర్స్ స్లూయిజ్ గేటు కుడి వైపు మాత్రమే ఉంది. డ్యాం డెడ్ స్టోరేజీకి చేరుకుంటే కానీ వాటిని సర్వీసింగ్ చేసేందుకు వీలుండదు.

- మిడ్‌మానేరు ప్రాజెక్టు గేట్లకు రబ్బర్ సీళ్లు సరిగానే ఉన్నాయి. ఎప్పటికప్పుడు గ్రీజింగ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు స్పిల్‌వేలో ఎలాంటి గుంతలు పడలేదు. ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో అన్నపూర్ణ రిజర్వాయర్ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను 15 ఏళ్ల పాటు మేఘా కంపెనీకి అప్పగించారు.
- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు. ఏటా వార్షిక మరమ్మతులు చేపడుతున్నారు. ఎల్లంపల్లి బ్యారేజీకి 62 రేడియల్ గేట్లను అమర్చారు. ఏటా గేట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం రూ.38.50 లక్షలు విడుదల చేసింది. నెల రోజులుగా గ్రీజింగ్, ఆయిల్ టాపప్, ఫ్లడ్ అప్ గేట్లు, గ్యాలరీలను శుభ్రం చేయడం, జనరేటర్ నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. మధ్య మధ్యలో వరదలను బట్టి కూడా పనులు జరుగుతాయని నీటి పారుదల శాఖాధికారి తెలిపారు.

మంజీరా ప్రాజెక్టు ఓకే..

మంజీరా ప్రాజెక్టు వద్ద నీటి విడుదల సమయానికి క్రస్ట్ గేట్లకు రబ్బర్ సీళ్లు సరిచేస్తున్నారు. రోప్‌లకు గ్రీజింగ్ కూడా చేస్తున్నారు. మోటార్లను సర్వీసింగ్ చేశారు. స్పిల్‌వేపై గుంతలేమీ లేవు. రెండు వైపులా ఉండే స్లూయిజ్ గేట్లకు సర్వీసింగ్ చేస్తున్నారు. డ్యామ్ పైన విద్యుద్దీపాలు బాగానే ఉన్నాయి. డ్యామ్‌పై విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేవు. జనరేటర్ కూడా ఉంది. మంజీరాకు రూ.8.5 లక్షలు కేటాయిస్తుండగా మొత్తం ఖర్చు చేస్తున్నారు.

పాలేరులో పనులు జరుగుతున్నాయ్..

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయ నీటి సామర్థ్యం 2.50 టీఎంసీలు. గత ఏడాది వచ్చిన వరదలతో ఎడమ కాలవ 132 కి.మీ. వద్ద యూటీ కూలింది. ప్రస్తుతం యూటీ పనులు జరుగుతున్నాయి. లైనింగ్ పనులు ప్రారంభం కాలేదు. ఎడమ కాలువకు నాయకన్‌గూడెం వద్ద అవుట్‌ఫాల్ గేటు ఒకటే పనిచేస్తోంది. మరో గేటు పనిచేయట్లేదు. పాలేరు వద్ద ఇన్‌ఫాల్ గేటు రబ్బర్లు అరిగి నీరు లీకవుతోంది. మినీ హైడల్ ప్రాజెక్టుకు మరమ్మతులు జరుగుతున్నాయి. ఏడాది కాలంగా సుమారు 15 మంది సిబ్బందికి పనిలేకున్నా వేతనాలు ఇస్తున్నారు. కాలువపై జంగిల్ క్లియరెన్సు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. పాలేరు పాత కాలువ పూడిక తీయకపోవడంతో చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తాలిపేరులో ఐరన్ తుప్పు పడుతోంది..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 0.75 టీఎంసీలు కాగా.. కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించిన ఐరన్ తుప్పు పడుతోంది. 1976లో ఈప్రాజెక్టు నిర్మించగా ఇప్పటిదాకా రంగులు కూడా వేయలేదు. ప్రాజెక్టు సబ్‌స్టేషన్ నుంచి ఉన్న విద్యుత్తు స్తంభాలు పడిపోవడంతో సరఫరాను నిలిపేశారు. తాత్కాలికంగా సత్యనారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ప్రాజెక్టు కింద 78 లైట్లు ఉండగా 40 మాత్రమే పనిచేస్తున్నాయి. మొత్తం 12 మంది పని చేయాల్సి ఉండగా.. ఆరుగురే ఉన్నారు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు, సిబ్బంది ఉంటున్నారు తప్ప ఇతర సందర్భాల్లో ఎవరూ కనిపించడం లేదు. ప్రాజెక్టుకు 25 గేట్లు ఉండగా రెండేళ్ల క్రితం వాటికి సీళ్లు వేశారు. రెండు నెలల క్రితం రోప్‌లకు గ్రీజ్ పెట్టారు. మొత్తం ప్రాజెక్టు సెన్సార్లతో పనిచేస్తుంది. అన్ని గేట్లు పనిచేస్తున్నాయి.

'కిన్నెరసాని'లో స్వల్పంగా లీకేజీ..

భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు 13 గేట్లున్నాయి. 7, 8, 9, 10 గేట్లలో రబ్బర్ సీళ్లు అరిగిపోవడంతో స్వల్పంగా నీరు లీకవుతోంది. వరదల సమయంలో లీకేజీ ఎక్కువగా ఉంటోంది. గేట్లు ఎత్తిన సందర్భాల్లో సిల్ప్‌వేపై గుంతలు పడుతుండగా ఏడాదికోసారి మరమ్మతులు చేస్తున్నారు. ప్రాజెక్టు రెండువైపులా ఉండే స్లూయిజ్ గేట్లకు సర్వీసింగ్ చేయలేదు. ప్రాజెక్టు పనులకు జెన్‌కో రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. మోటార్లు సర్వీసింగ్ చేశారు. కొత్త సెన్సార్లు పెట్టలేదు.

లంకసాగర్‌కు ఇరువైపులా లీకులు..

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని లంకసాగర్ డ్యామ్‌కు ఇరువైపులా లీకులున్నాయి. ఆనకట్ట బలహీనంగా ఉంది. 5 గేట్ల మరమ్మతులకు రూ.5.40 లక్షలు మంజూరయ్యాయి. ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.24.45 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు కేటాయించలేదు.

25,000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద రికవరీతో ప్రారంభమైనా 25,250 వద్ద విఫలమై చివరి రెండు రోజుల్లో బలమైన రియాక్షన్‌లోకి జారుకుంది. చివరికి వారం మొత్తానికి 130 పాయింట్ల నష్టంతో 24,830 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా 25,000 స్థాయిలో ఏర్పడిన కన్సాలిడేషన్‌లో విఫలమైంది. అలాగే మిడ్ క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా బలమైన కరెక్షన్ సాధించాయి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. నిఫ్టీ గత నాలుగు వారాలుగా నిరంతర కరెక్షన్ ట్రెండ్‌లో ట్రేడవుతూ 850 పాయింట్ల మేరకు నష్టపోయింది. ప్రస్తుతం 25,000 కన్నా దిగువకు వచ్చినందువల్ల స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ఇంతకాలం మద్దతు స్థాయిగా ఉన్న 25,000 ఇప్పుడు నిరోధ స్థాయిగా మారింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయిలో పునరుజ్జీవం సాధించి తీరాలి.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,450.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ సైతం గత కొద్ది వారాలుగా 57,000 వద్ద సాగిన కన్సాలిడేషన్ అనంతరం విఫలమై వారం కనిష్ఠ స్థాయి 56,520 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం 57,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 57,600. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం 56,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ గత వారం 50 డిఎంఎ కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద బౌన్స్‌బ్యాక్ కావాలి. అలాగే 24,700 వద్ద ఏర్పడిన "డబుల్ బాటమ్" పాటర్న్ వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,760, 24,700

25,250 పైన బుల్లిష్

(జూలై 28-ఆగస్టు 1 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,248-24,806 పాయింట్ల మధ్యన కదలాడి 131 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,041, 25,058, 25,176, 25,217 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,425

నిరోధ స్థాయిలు: 25,050, 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,625, 24,525, 24,425 (24,725 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	483	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

మరికొంత కాలం లాభాలపై ఒత్తిడి తప్పదు

అమ్మకానికి ప్రాధాన్యతా రంగ రుణాలు
కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ లాభాలపై ఒత్తిడి తగ్గించుకునే పనిలో పడింది. ఇందు కోసం పరిమితికి మించి ఇచ్చిన ప్రాధాన్యతా రుణాల్లో మరికొంత మొత్తాన్ని ఈ త్రైమాసికంలో అమ్మకానికి పెడుతోంది. బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు ఈ విషయం వెల్లడించారు. జూన్ త్రైమాసికంలోనూ ఈ అధిక ప్రాధాన్యతా రంగ రుణాల్లో కొన్ని రుణాలను విక్రయించడం ద్వారా కెనరా బ్యాంక్ రూ.1,248 కోట్ల కమీషన్ ఆదాయం ఆర్జించింది. అయినా జూన్ త్రైమాసికం ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం రుణాల్లో ప్రాధాన్యతా రుణాల వాటా 45.63 శాతం వరకు ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించిన 40 శాతం కంటే ఇది 5.63 శాతం ఎక్కువ. ఈ అధిక ప్రాధాన్యతా రుణాలను కొనేందుకు మార్కెట్లో అనేక బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు రాజు చెప్పారు.

వడ్డీ రేట్లే సమస్య: వడ్డీ రేట్లు తగ్గడం వల్లే బ్యాంక్ లాభాలపై ఒత్తిడి పెరిగిందని ఎండీ, సీఈఓ రాజు చెప్పారు. ఆర్‌బీఐ కీలక రెపో రేటు ఈ ఏడాది ఫిబ్రవరి-జూన్ మధ్య ఒక శాతం తగ్గించింది. దీంతో కెనరా బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) జూన్ త్రైమాసికంలో 2.75 శాతానికి పడిపోయింది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఆగస్టు లేదా అక్టోబరులో జరిగే సమావేశాల్లోనూ ఆర్‌బీఐ రెపో రేటు మరింత తగ్గిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే సెప్టెంబరు త్రైమాసికంలో 2.75 శాతం ఎన్ఐఎం కొనసాగించడం కష్టమవుతుందన్నారు. అయితే అక్టోబరు, మార్చి త్రైమాసికాల్లో పరిస్థితి కొద్దిగా మెరుగుపడే అవకాశం ఉందని సత్యనారాయణ రాజు తెలిపారు.

డీఈసీ ఇన్‌ఫ్రాకు రూ.613 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు ప్రతిష్ఠాత్మక కాంట్రాక్టులు లభించాయి. ఆర్డర్‌లో భాగంగా ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లోని భవనాల కన్జర్వేషన్, రెట్రోఫిట్టింగ్‌తో పాటు ఒక సర్వీస్ బిల్డింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీపీడబ్ల్యూడీ నుంచి లభించిన ఈ కాంట్రాక్టు విలువ రూ.317.32 కోట్లు. రెండేళ్లలో ఈ కాంట్రాక్ట్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరొక కాంట్రాక్ట్‌లో భాగంగా పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్న నేతాజీ నగర్‌లోని సెంట్రల్ విస్టాలో ఇంటర్నల్ ఫినిషింగ్, ఫర్నీచర్ ఫినిషింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలి. ఈ కాంట్రాక్టు విలువ రూ.295.91 కోట్లు అని కంపెనీ తెలిపింది.

బిజినెస్

భారత ఆర్థికానికి ఢోకా లేదు

- ఎంపీసీ సభ్యుడు నగేశ్ కుమార్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ శక్తివంతంగా పురోగమిస్తున్నదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం పైబడిన వృద్ధి రేటు సాధించే విషయంలో ఎలాంటి సవాలు ఎదురయ్యే స్థితి లేదని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యుడు నగేశ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ రుణ సంక్షోభంతో పాటు అధిక ద్రవ్యోల్బణం, వృద్ధిలో మందగమనం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ మాత్రం వెలుగుదివ్వెగా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. దేశీయ వినియోగమే భారత్‌కు బలమని అన్నారు. రాబోయే సంవత్సరాల్లో వృద్ధి మరింత వేగం అందుకోవడంతో పాటు అది 7-7.5 శాతానికి కూడా చేరవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం వినియోగదారుల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 2 శాతానికి దిగివచ్చిందని, ఎంపీసీ అనుసరించిన విధానపరమైన వైఖరే ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు. మరో రెపో రేటు కోత అనేది విభిన్న స్థూల ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉంటుందని అంటూ ద్రవ్యోల్బణం 2 శాతానికి దిగివచ్చినంత మాత్రాన ఎల్లకాలం అక్కడే స్థిరంగా ఉండిపోతుందని అర్థం కాదన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ఎంపీసీ సమీక్ష ఉన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకుంది.

బౌన్స్ బ్యాక్ అయితేనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. మార్కెట్లలో మళ్లీ బుల్ రన్ కొనసాగాలంటే ఇప్పటి స్థాయిలను అధిగమించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారుతుండటం, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, వడ్డీ రేట్ల కోతలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారితీస్తోంది. నిఫ్టీ 50 డీఎంఏ, 25,000 దిగువకు రావటం కలవరపెడుతోంది.

స్టాక్ రికమండేషన్స్

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: తాజా గరిష్ఠం రూ.1,379 నుంచి స్వల్ప దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్ ప్రస్తుతం మెరుగ్గా చలిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతోంది. ఫైగా ఫార్మా రంగ సూచీ బ్రేకౌట్ ఇచ్చింది. గత శుక్రవారం రూ.1,277 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,270/1,250 శ్రేణిలో ప్రవేశించి రూ.1350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,225 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్: ఈ షేరు నష్టాల మార్కెట్లోనూ మెరుగ్గా రాణించింది. గత శుక్రవారం రూ.1,921 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,900 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. రూ.1,875 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: ఈ కౌంటర్ అత్యంత బలాన్ని ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ చాలా బాగున్నాయి. డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. పైగా జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. గత శుక్రవారం రూ.3,063 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,550/3,580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,550 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: ఆరు నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. కీలకమైన నిరోధ స్థాయికి చేరుకుంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం రూ.1,832 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,770 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

సన్ ఫార్మా: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. ప్రస్తుతం అనిశ్చితి తగ్గింది. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,699 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,660/1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవాలి. అయితే రూ.1,640 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

పసిడి ర్యాలీకి బ్రేక్

మరింత దిద్దుబాటు!

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో పసిడి ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. గత వారం ఒక దశలో ఫ్యూచర్స్ మార్కెట్లోనూ పసిడి ధర రూ.లక్ష మించిపోయింది. చివరికి వారాంతంలో అక్టోబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ధర మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో 2.74 శాతం నష్టపోయి రూ.98,764 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి ధర నేలచూపులు చూస్తోంది. ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర 1.12 శాతం నష్టపోయి 3,335.60 డాలర్ల వద్ద ముగిసింది. ఈ వారం ఇది మరింత దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. 'జూలైలో పసిడి ధరలు బాగానే పెరిగాయి. అయితే సురక్షిత పెట్టుబడి అనే భావన సన్నగిల్లడం, అమెరికా-ఈయూ, అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదురుతాయనే అంచనాలతో ప్రస్తుతం పసిడి ధర దిద్దుబాటుకు లోనవుతోంది' అని ఏంజెల్ వన్, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) ప్రథమేశ్ మాల్యా చెప్పారు. లాభాల స్వీకరణ అమ్మకాలు కూడా ఇందుకు తోడయ్యాయి. అమెరికా జీడీపీ గణాంకాలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, వడ్డీ రేట్లపై అమెరికా ఫెడ్ నిర్ణయం సహా చైనా కేంద్ర బ్యాంక్ కొనుగోళ్లు.. ఈ వారం దేశీయ మార్కెట్లో పసిడి ధరలను నిర్ణయించే వీలుంది.

బీమా కంపెనీలు పల్లె బాట పట్టాల్సిందే

75,000 గ్రామ పంచాయతీలకు చేరువ కావాలి: ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: బీమా కంపెనీలు గ్రామ ప్రాంతాలకూ తమ సేవలను విస్తరించాలని బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) స్పష్టం చేసింది. ఇందుకోసం 'మాస్టర్ సర్క్యులర్ ఆన్ రూరల్, సోషల్ సెక్టర్ అండ్ మోటార్ థర్డ్ పార్టీ ఆబ్లిగేషన్స్, 2025 పేరుతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు వచ్చే రెండేళ్లలో తమ సేవలను 75,000 గ్రామ పంచాయతీలకు విస్తరించాలి. ఇందులో 25,000 గ్రామ పంచాయతీలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, మిగతా 50,000 గ్రామ పంచాయతీలను వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కవర్ చేయాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తమ మొత్తం పాలసీల్లో 15 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరం 25 శాతం గ్రామ పంచాయతీల్లో విక్రయించాలి. ఇందుకు సంబంధించి విధివిధానాలను లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ నిర్ణయిస్తాయని ఐఆర్‌డీఏఐ తెలిపింది.

అనునిత్యం ప్రజల కోసమే తపించారు!

» దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఉన్నత శిఖరం: సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక ఉన్నత శిఖరమని.. ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సీఎం నివాళులర్పించి.. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత జైపాల్ సొంతమని.. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పనిచేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్రను ప్రజలు మరిచిపోలేరని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎన్నడూ విలువల విషయంలో రాజీపడలేదని, నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా నిలిచారని చెప్పారు. ఆయన ఆశయాలను, ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళిగా సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనకు సీఎం నివాళులర్పించారు.

రేవంత్‌పై బీఆర్ఎస్ నేతల అక్కసు: చామల

» బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టమైంది: మేడిపల్లి

» రేవంత్‌ను టార్గెట్ చేయడం ఎవరి వల్ల కాదు: అద్దంకి

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అక్కసుతో బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్ రావు ఏదైనా డ్రామా చేస్తుంటే.. మధ్యలో క్యారెక్టర్ ఆర్టిస్టుల్లా జగదీశ్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి హడావుడి చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఆదివారం ఢిల్లీలో చామల మాట్లాడుతూ.. కేసీఆర్‌తో పోలిస్తే వందరెట్లు ఎక్కువగా సామాజిక న్యాయం, తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేరు కాదంటూ తాము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామని, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యలతో ఇది మరోమారు స్పష్టమైందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని, ప్రజలు దీనిపై ఆలోచన చేయాలన్నారు. సీఎం రేవంత్‌ను టార్గెట్ చేయడం కేసీఆర్ వల్లే కాలేదని, ఇంకా కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి వల్ల ఏమైతదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కేటీఆర్ తన భాష మార్చుకోకపోతే తమ బీ టీమ్ రంగంలోకి దిగుతుందని, అప్పుడు ఆయన తట్టుకోలేడన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదులు

పేట్‌బషీరాబాద్/దుండిగల్/మారేడుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ఆరోపణలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. కొంపల్లి మున్సిపల్ నాయకులు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో, కుత్బుల్లాపూర్ నాయకులు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో, కంటోన్మెంట్ నాయకులు మారేడుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు.

వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు రుద్రమదేవి పేరు పెట్టాలి

» విమానాశ్రయానికి ఏ గాంధీ పేరు పెట్టినా సహించం: కవిత

హనుమకొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో నిర్మిస్తున్న మామునూరు ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తెలిపారు. విమానాశ్రయానికి ఏ గాంధీ పేరు పెట్టినా సహించబోమని ఆమె హెచ్చరించారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు వస్తేనే రైతు భరోసా నిధులు గుర్తుకు వస్తున్నాయన్నారు.

పత్రికలు, టీవీల్లో 25శాతం నేర వార్తలే..

» మానవ సంబంధాల బలోపేతానికి సాహితీవేత్తలు కృషి చేయాలి

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

» సినారె సాహిత్య పురస్కారాల ప్రదానం


సినారె సాహిత్య పురస్కారాలు పొందిన రచయితలతో జస్టిస్ లక్ష్మణ్, నందిని సిధారెడ్డి తదితరులు

భువనగిరి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దిన పత్రికలు, టీవీ చానళ్లలో ప్రతి రోజు 25శాతం నేర వార్తలే ఉంటున్నాయని.. మద్యం, ప్రేమ, భూమి వివాదాలతో జరుగుతున్న నేరాలే అధికమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అన్నారు. ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన సినారె సాహిత్య పురస్కార ప్రదానోత్సవానికి జస్టిస్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరి మద్యం సేవించడం, డ్రగ్స్ తీసుకోవడం, వివాహేతర సంబంధాలు, ప్రేమ వివాహాలు, భూ కబ్జాలు తదితర కారణాలతో నేరాలు పెరుగుతుండటం శ్రేయస్కరం కాదన్నారు. సాహితీవేత్తలు, కవులు తమ రచనల ద్వారా మానవ సంబంధాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. డబ్బు, పదవులు నేడు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. తల్లిదండ్రులను కావడిలో మోసిన శ్రవణుడిని ఆదర్శంగా తీసుకుంటున్న మన దేశంలో 2007లో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతిరోజు ఇలాంటివి 15 కేసులు తన బెంచ్‌పైకి వస్తుండటం మనసును కలచి వేస్తోందని చెప్పారు. కోర్టు తీర్పులను ప్రజలందరూ సులువుగా చదువుకునేలా దేశంలో ఎంపిక చేసిన 17 మాతృభాషల్లో తర్జుమా జరుగుతున్నాయని, ఎంపిక చేసిన 2,200 తీర్పుల తెలుగు అనువాదం 80శాతం పూర్తయిందని, అనువదించిన తీర్పులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ అవార్డు సాధించిన డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు భాష కీర్తిని చాటారని ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలుగు సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డితో కలిసి 11 మంది సాహితీవేత్తలకు సినారె సాహిత్య పురస్కారాలను అందజేశారు.

మన పండగలు

అంతర్జాతీయ స్థాయిలో!

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలు ఏర్పాటు చేసి.. వారిని ఆకర్షించాలని యోచిస్తోంది. తెలంగాణకే ప్రత్యేకంగా నిలిచే పండగలు, జాతరలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. ప్రకృతి, ఆధ్యాత్మికం, వైద్యం సహా పలు అంశాలతో కూడిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ఏర్పాటు చేసి, వాటిని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఆ ఆరు పండగలు..

రాష్ట్రంలో ఏటా గాలిపటాల పండగ (కైట్ ఫెస్టివల్), కేస్లాపూర్ నాగోబా, మేడారం సమ్మక్క-సారక్క జాతరలు, బతుకమ్మ, బోనాల పండగలతో పాటు నాగార్జునసాగర్ దగ్గరున్న బుద్ధవనంలోనూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ 6 వేడుకలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని పర్యాటక శాఖ తాజాగా నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో రాబోయే బతుకమ్మ పండగతోనే ఈ ప్రణాళిక అమలును ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో వాటర్ కార్నివాల్స్, రివర్ ఫెస్టివల్స్‌ను కూడా నిర్వహించే అంశంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 27 పర్యాటక ప్రాంతాల్లో తొలి దశలో 10 ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య(పీపీపీ) విధానంలో పర్యాటక రంగంలో ప్రసిద్ధి చెందిన కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకొని, పర్యాటకులకు సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించనున్నారు. వీటన్నింటిపై పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

ఫ్యూచర్‌సిటీలో హోటల్ ఏర్పాటు..

ఫ్యూచర్ సిటీలో ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో పెద్ద హోటళ్లను ఏర్పాటుచేయించేందుకు ప్రభుత్వం చర్యలు జరుపుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం



ఇప్పటికే ఒకటి, రెండు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అనంతగిరి కొండల దగ్గర పెద్ద హోటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హోటల్ కోసం పలు సంస్థలతో కీలక చర్చలు జరుగుతున్నాయని, అవి త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. హోటళ్ల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు ప్రత్యేక రాయితీలను కూడా ఇవ్వనున్నారు. కంపెనీలు పెట్టే పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుని, దాని ప్రకారం రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఆయా సంస్థలతో పీపీపీ విధానంలో ఒప్పందాలు చేసుకోనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 1-2 గంటల ప్రయాణ దూరంలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 27 పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లతో పాటు పలు నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

తొలి దశలో వీటిపైనే దృష్టి..

రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 10 ప్రత్యేక పర్యాటక (స్పెషల్ టూరిస్ట్ ఏరియా-ఎస్టీయే) ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. వికారాబాద్‌లోని అనంతగిరి ప్రాంతంలో ఆధ్యాత్మిక థీమ్‌తో; సోమశిల-నల్లమల, జోగులాంబ, కృష్ణానది ప్రాంతాలు, రామప్ప- మేడారం- బొగత సర్క్యూట్, భద్రాద్రి రామాలయం, వరంగల్ సర్క్యూట్, చార్మినార్, ట్రైబల్ ప్రాంతాలు సహా మరో రెండు మూడు ఉన్నాయి. ప్రత్యేకంగా బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఇదొక్కటే దాదాపు 1500 కి.మీ. మేర ఉంటుంది. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి మొదలై.. మళ్లీ హైదరాబాద్‌కే వచ్చేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌ను రూపొందిస్తున్నారు. ఇందులోనే ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాల వివరాలను పొందుపర్చారు. బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్థూపంతో పాటు కీసర, కొండాపూర్, బదన్‌కుర్తి, పాశిగావ్, కోటిలింగాల, ధూళికట్ట, కారుకొండ, అశ్వారావుపేట, నాగార్జునకొండ, ఫణిగిరి, గాజులబండ, తిరుమలగిరి ప్రాంతాలు ఉన్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలతో మార్కెటింగ్..

తెలంగాణ పర్యాటకాన్ని దేశమంతటా మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేకంగా కొన్ని కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం కోసం ఇతర దేశాల్లో ఉంటున్న తెలుగు ప్రముఖుల సహకారం తీసుకోవడంతో పాటు అంతర్జాతీయ పర్యాటక వేదికలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్ర పర్యాటక వివరాలన్నీ ఒకేచోట లభ్యమయ్యేలా ప్రత్యేకంగా 'తెలంగాణ టూరిజం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

స్థానిక ఎన్నికలు..

బీసీ రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. ఈ అధ్యయనంలో వెల్లడైన వివరాలు, కులాల వారీగా ఇచ్చిన ర్యాంకులను బట్టి ఏయే చర్యలు తీసుకోవాలనేదానిపైనా ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. పలు ప్రభుత్వ శాఖల్లో కొన్ని పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది.

యూరియా నిల్వలు.. సాగునీటి ప్రాజెక్టులపై..

ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, తగినంత సరఫరా చేయడం లేదని ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అవసరానికి తగిన మేర యూరియా ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో అసలు రాష్ట్రానికి ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఎంతెంత యూరియా అవసరం? ప్రస్తుత ఖరీఫ్‌కు కేంద్రం ఎంత కేటాయించింది? ఇప్పటివరకు ఎంత సరఫరా చేసింది? యూరియా నిల్వల విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశాలపై మంత్రివర్గం సమీక్షించనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, సీతారామ ప్రాజెక్టు సవరించిన అంచనాలపై చర్చించనున్నట్టు తెలిసింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిటీ.. ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశం ఉందని సమాచారం. మంత్రివర్గ భేటీకి ముందే నివేదిక అందితే దానిపైనా లోతుగా చర్చించనున్నట్టు తెలిసింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వానలు, జలాశయాల్లో నీటి నిల్వ, కొత్త రేషన్‌కార్డులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అనుసంధానం, మైనింగ్ శాఖలో కీలకమైన సీనరేజీ చార్జీల్లో పలు మార్పులు, అధునాతన గోశాలల నిర్మాణంపై మంత్రివర్గంలో సమీక్షించనున్నారు. పటాన్‌చెరు సిగాచి పరిశ్రమ ప్రమాదంపై విచారణ కమిటీ తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని, దానిపై చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

యూరియా బాధ్యత ప్రభుత్వానిదే

» రైతులు ఆందోళన చెందవద్దు: భట్టి

» అభివృద్ధికి మోడల్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దాలి: మంత్రి తుమ్మల

» ఆగస్టు 15 లోగా ఇందిరమ్మ డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ: మంత్రి పొంగులేటి



కొత్తగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం చారిత్రాత్మకమైందన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అమలవుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎంతోపాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెండు జిల్లాల కలెక్టర్లు దురిశెట్టి అనుదీప్, జితేష్ పాటిల్ సమీక్షించారు. 2 జిల్లాలో వర్షాభావం, గోదావరికి వరదలు వస్తే తీసుకోవాల్సిన చర్యలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. చారిత్రాత్మక 'ఇందిరమ్మ ఇల్లు' పథకంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రైతులకు సరిపడా యూరియా, ఎరువులు సరఫరా చేసే బాధ్యత సర్కారుదేనని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా తక్కువ ఉన్నదని జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధికి మోడల్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో పలు ప్రాంతాలు వర్షాలు, వరదల వల్ల.. ముఖ్యంగా భద్రాచలం వద్ద గోదావరి నదీ ప్రవాహంతో ముంపునకు గురవుతుందన్న తుమ్మల.. ఇటువంటప్పుడు అవాంఛనీయ ఘటనలు జరక్కుండా ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 15 నాటికి ఇందిరమ్మ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని, ఆగస్టులో శ్రావణ మాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిది అవివేకం

» రాష్ట్రానికి యూరియా కేటాయింపులు 9.80 లక్షల టన్నులే

» 12 లక్షల టన్నులు వచ్చిందని చెప్పడం విడ్డూరం

» ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారు: తుమ్మల



హైదరాబాద్/కొత్తగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి 9.80లక్షల టన్నుల యూరియానే కేంద్రం కేటాయించగా.. 12లక్షల టన్నులు సరఫరా చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అవివేకానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు. ఓ జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి.. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదారి పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నెలాఖరులోగా 3 లక్షల టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు గతంలోనే లేఖ రాశామని గుర్తు చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులకు సైతం యూరియా పరిస్థితి, రైతుల ఇబ్బందులను వివరించామని, వారు సమస్యను పరిష్కరించకపోగా రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు సైతం మౌన వ్రతం పాటిస్తున్నారని మండిపడ్డారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటాయించిన మేరకైనా యూరియా సరఫరా చేయాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం తీరు మారలేదన్నారు. జూలై ఆఖరు నాటికి తెలంగాణకు 6.6లక్షల టన్నులు రావాల్సి ఉండగా.. 4.23లక్షల మెట్రిక్ టన్నులనే సరఫరా చేసిందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.16కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని.. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగం యూరియా కోసం తిప్పలు పడుతుంటే.. చేయని పనులు చేసినట్టుగా బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకోవడం బాధాకరమని అన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తున్న కాంగ్రెస్

» మంత్రుల అండతో బ్లాక్‌కు తరలిస్తున్న నాయకులు : రాంచందర్‌రావు



గద్వాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల కొరతను సృష్టిస్తోంది. మంత్రుల అండతో నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 9 లక్షల టన్నుల యూరియా అడిగితే కేంద్రం 12 లక్షల టన్నులకుపైగా కేటాయించింది. అయినా రైతులు ఎందుకు ఎరువుల దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. ఎరువుల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా ఖమ్మంలోనే చర్చించేందుకు సిద్ధం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సవాల్ చేశారు. ఆదివారం జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పర్యటించిన ఆయన.. కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతులకు సాగు నీరు, పెట్టుబడి సహాయం, ఎరువులను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధాని మోదీ హయాంలో రైతులకు అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని ఎరువుల కొరత తెలంగాణలోనే ఎందుకు ఉందని ప్రభుత్వాన్ని నిలదీశారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉయ్యాలవాడ గురుకుల పాఠశాల విద్యార్థినులను రాంచందర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట ఎంపీ డీకే అరుణ ఉన్నారు.

తెలంగాణకు సరిపడా ఎరువులు ఇవ్వని కేంద్రం

రాష్ట్రంపై వివక్షతో ఇబ్బందులకు గురి చేస్తోంది: పొన్నం



అక్కన్నపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కేటాయింపులో తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువులను దాచిపెడుతోందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలోని వేదికలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, స్టీల్ బ్యాంకు, కాటమయ్య రక్షణ కవచాలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి సరిపడా ఎరువులు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీకి వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. అయినా కేంద్రం రాష్ట్రానికి సరిపడా ఎరువులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావు ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసి రాష్ట్రానికి సరిపడా ఎరువులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు ఇచ్చిన 21 రకాల స్టీల్ వస్తువులను వాడుకోవాలని సూచించారు. ఇకపై ఫంక్షన్లలో ప్లాస్టిక్ వాడితే అధికారులు రూపాయి జరిమానా విధిస్తారని చెప్పారు.

కవితపై కేసులు ఎత్తేస్తే పార్టీని

విలీనం చేస్తామన్నారు

(మొదటిపేజీ తరువాయి)

తేదీ, సమయం నిర్ణయించి చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని నిర్మించామని తెలిపారు. బీసీ డిక్లరేషన్ ముసుగులో ముస్లింలకు ఎక్కువ రిజర్వేషన్లను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని, ఇది ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషన్ అని సంజయ్ మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, వారికి అదనంగా 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆ ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని.. అట్లాంటప్పుడు అది బీసీ డిక్లరేషన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ముస్లింలను తొలగించి 42శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకు అమలు చేస్తేనే, మద్దతు ఇచ్చి, బిల్లు ఆమోదానికి కేంద్రాన్ని ఒప్పిస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముస్లిం ఓట్ల కోసమే బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడిని కూల్చివేశారని సంజయ్ మండిపడ్డారు. బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రణాళిక ప్రకారం తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందన్నారు. తెలంగాణలో బీజేపీ సొంతంగా పోటీ చేయబోతోందని, ఈసారి బీజేపీ అవకాశం ఇద్దామని ప్రజలు ఎదురుచూస్తున్నారని సంజయ్ పేర్కొన్నారు.

నేడు సిట్ విచారణకు రాలేను..

హైదరాబాద్, జులై 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ఉన్నందున సోమవారం సిట్ విచారణకు రాలేనని బండి సంజయ్ తెలిపారు. మరో తేదీని త్వరలోనే వెల్లడిస్తానని జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో సిట్ ఎదుట సంజయ్ హాజరు కావాల్సి ఉంది.

మరో పార్టీలో

బీఆర్ఎస్ విలీనం అవాస్తవం

(మొదటిపేజీ తరువాయి)



కేవలం రెండు పిల్లర్లు కుంగినందుకు కాంగ్రెస్ ఇంత రాద్ధాంతం చేయడం అనుమానం కలిగిస్తోందని పేర్కొన్నారు. అసలు ఈ వ్యవహారం వెనుక కాంగ్రెస్ ఉందేమోనని సందేహం వస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఆదివారం భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి, చిట్యాల, భూపాలపల్లిలలో కేటీఆర్ పర్యటించారు. కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంటల సాగుకు ముందే రైతుబంధు నిధులు ఇచ్చామని, కాంగ్రెస్ మాత్రం ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే రైతు భరోసా ఇస్తోందని కేటీఆర్ విమర్శించారు. రూ.15 వేలు రైతు భరోసా, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. ఎరువులకు ఆధార్‌తో రేషన్ పెట్టడం, మహిళా రైతులపై కేసులుపెట్టి జైలుకు పంపడం వంటి దౌర్భాగ్యం రాష్ట్రంలో కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. జల వనరులున్న ప్రతి గ్రామంలో చేప విత్తనాలు పంపిణీ చేసి నీలి విప్లవం తెచ్చిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని దుష్ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్‌లో రెండు పిల్లర్లు కుంగినందుకు రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఫుడ్ పాయిజన్ జరిగి 111 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడం బాధ కలిగిందని కేటీఆర్ చెప్పారు. అందాల పోటీల్లో భామల భోజనానికి ప్లేటుకు రూ.లక్ష ఖర్చు చేశారని.. విద్యార్థులకు వంద, రూ.150 ఖర్చు పెట్టి మంచి భోజనం అందించలేరా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్‌కు తలతిరిగిపోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సీఎం రమేశ్ చెప్పేవన్నీ అబద్ధాలే: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తామని సీఎం రమేశ్‌ను కలిసి దేవురించాల్సిన అవసరం తమకు లేదని, బీజేపీ పెద్దలతో మాట్లాడేంత సీన్ ఆయనకు ఉందా? అని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం రమేశ్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, బ్రోకర్లు మాట్లాడితే పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.బీజేపీ తెలంగాణకు పనికొచ్చే పార్టీ కాదని, ఇక్కడ టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేస్తే.. బీఆర్ఎస్ ఎందుకు కలుస్తుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలముందు బీజేపీతో పొత్తు పెట్టుకుందామంటేనే.. కేసీఆర్ ఒప్పుకోలేదని, ప్రాణంపోయినా ఆ పార్టీతో పొత్తు ఉండదని తమతో చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జైపాల్‌రెడ్డి ఎన్నడూ పాల్గొనలేదని, రేవంత్‌వ్యాఖ్యలు శుద్ధ అబద్ధాలని పేర్కొన్నారు.

కమ్మ కులంపై దుర్మార్గపు మాటలు బాధాకరం

» ఖమ్మం కమ్మ మహాజన సంఘం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ నేత కమ్మ కులంపై విమర్శలు చేసినట్టుగా ప్రచారం అవుతున్న దుర్మార్గపు మాటలు బాధాకరమని ఖమ్మం కమ్మ మహాజన సంఘం పేర్కొంది. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము ఆదివారం ఓ ప్రకటన చేశారు. బీఆర్ఎస్ నేత ఒకరు కమ్మ కులంపై తనతో దారుణంగా మాట్లాడారని ఏపీకి చెందిన ఓ ఎంపీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. సదరు బీఆర్ఎస్ నేత ఆ వ్యాఖ్యలు నిజంగా చేసుంటే వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కమ్మ కులం అనేది దేశ అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి అన్ని రంగాల్లో నిస్వార్థంగా సేవలందించిన సామాజిక వర్గమని వివరించారు. ఏ రాజకీయ పార్టీలో ఎవరున్నా కులాలపై విమర్శలు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా బీసీలు ఐక్యం కావాలి

» 7న గోవాలో ఓబీసీ మహాసభను సక్సెస్ చేయాలి

» ఈటల, అసదుద్దీన్ ఒవైసీ, వద్దిరాజుల పిలుపు

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో బీసీలంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని బీజేపీ నేత ఈటల రాజేందర్, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రలు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 7న గోవాలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయడం ద్వారా బీసీల ఐక్యతను ప్రదర్శించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గోవాలో నిర్వహించనున్న 10వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఈటల, అసదుద్దీన్ వద్దిరాజు ఆదివారం బీసీ సంఘం ప్రతినిధులతో కలిసి వేర్వేరుగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ మహాసభలకు హాజరు కావాలని కోరుతూ ఈటల, అసదుద్దీన్ ఒవైసీ, వద్దిరాజులకు ఆహ్వాన పత్రికలు అందజేసినట్టు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో తమ వాటాను సాధించుకోవడం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల సమన్వయంతో ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు.

ఇల్లు సరే.. పెండింగ్ బిల్లులూ మంజూరు చెయ్యండి

» తమని ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ లావణ్య వినతి

అక్కన్నపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా తాజా మాజీ సర్పంచ్ సందేబోయిన లావణ్య తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాడుబడిన స్కూల్ భవనంలో ఆశ్రయం పొందుతున్న తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేసిన ఆమె.. పెండింగ్ బిల్లులపై ఎలాంటి హామీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లు నమోదుకు వచ్చిన అధికారులు పెండింగ్ బిల్లులపై ఏ హామీ ఇవ్వలేదని తెలిపారు. కాగా, 2019లో బీఆర్ఎస్ తరఫున సర్పంచ్‌గా గెలిచిన లావణ్య.. బిల్లులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి మరీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. బిల్లులు రాక ఆస్తులను అమ్ముకొని ఆమె పడుతున్న కష్టాలను 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే..

జీవితాంతం గ్రీన్ చాలెంజ్ కొనసాగిస్తా: సంతోష్

కీసర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ స్ఫూర్తితో గ్రీన్ చాలెంజ్ ప్రారంభించానని, దీనిని నా జీవితాంతం కొనసాగిస్తానని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ తెలిపారు. 8వ విడత గ్రీన్ చాలెంజ్‌ను ఆయన ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడేళ్లుగా రాజకీయాలకు అతీతంగా రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులే, కవులు, కళాకారులు, సామాన్యులను ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వాములను చేశామని చెప్పారు. ఇప్పటివరకు 20 కోట్ల మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు.

జడ్జిల సంఘం అధ్యక్షుడిగా రాజగోపాల్

» ప్రధాన కార్యదర్శిగా మురళీ మోహన్


జి.రాజగోపాల్


కె.మురళీమోహన్

హైదరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జడ్జీల సంఘం ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఈ ఎన్నికలను ఈనెల 19న నిర్వహించగా ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.రాజగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.మురళీ మోహన్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఎస్.శశిధర్ రెడ్డి ప్రకటించారు. మహిళా ప్రతినిధిగా జె.మైత్రేయి, ఉపాధ్యక్షులుగా డి.దుర్గా ప్రసాద్, జి.వేణు, పి.లక్ష్మీశారద, సంయుక్త కార్యదర్శులుగా సిహెచ్.సంపత్, పి.శ్రీదేవి, ఎం.రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎండి.గౌస్ బాషా, కిరణ్ కసమాల, శ్యాంప్రసాద్, బి.కల్పన, వి.శివనాయక్, జి.హిమబిందు, ముహమ్మద్ అసదుల్లా షరీఫ్, కె.గోపీకృష్ణ, జె.ఉపేందర్ రావు, ఎన్.అరుణ్ కుమార్, కె.పూజ, ఖుష్బూ ఉపాధ్యాయ్ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గం రెండేళ్లపాటు ఉంటుంది.

తెలంగాణలో 348 వడదెబ్బ కేసులు

» దేశవ్యాప్తంగా 7,192 కేసులు.. 14 మంది మృతి

న్యూఢిల్లీ, జూలై 27: దేశవ్యాప్తంగా ఈ ఏడాది 7,192 మంది వడదెబ్బకు గురవ్వగా.. 14 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రాల వారీగా తెలంగాణలో 348 కేసులు నమోదవ్వగా.. ఆంధ్రప్రదేశ్‌లో 4,055, రాజస్థాన్‌లో 373, ఒడిశాలో 350, మధ్యప్రదేశ్‌లో 297 వడదెబ్బ కేసులు రికార్డయ్యాయి. సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో ఎన్‌సీడీసీ (వ్యాధుల నియంత్రణ జాతీయ కేంద్రం) మార్చి 1వ తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు నమోదైన వివరాలను వెల్లడించింది. ఇంకా అనేక రాష్ట్రాల్లోనూ వందకుపైగా వడదెబ్బ కేసులు నమోదైనప్పటికీ ఆ రాష్ట్రాల్లో మరణాలు రికార్డవ్వలేదు. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లలో ముగ్గురేసి చొప్పున వడదెబ్బకు ప్రాణాలు కోల్పోగా.. తెలంగాణ, ఒడిశా, ఝార్ఖండ్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. వాస్తవంగా వడదెబ్బ బాధితుల సంఖ్య ఇంతకంటే చాలా ఎక్కువే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆస్పత్రుల్లో నమోదైన కేసుల సమాచారాన్ని మాత్రమే ఎన్‌సీడీసీ వెల్లడించిందంటున్నారు.

బీటెక్ బయో టెక్నాలజీలో మరిన్ని సీట్లకు అనుమతి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీటెక్‌లో బయో టెక్నాలజీ కోర్సులో మరిన్ని సీట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కోర్సులో రాష్ట్రవ్యాప్తంగా 330 సీట్లే ఉన్నాయి. ఇందులో 273 సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. సీట్ల సంఖ్య పెంచాలని ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటెక్‌లో బయో టెక్నాలజీ సీట్లు ఎక్కువగా ఉన్నాయని, బీటెక్‌లో మాత్రం తక్కువగా ఉన్నాయని తెలిపారు.

ఇదేం పని 'అమ్మ'?

» కన్నకొడుకుని బస్టాండ్‌లో వదిలేసి.. ఓ యువకుడితో వెళ్లిపోయిన తల్లి

» గంటల వ్యవధిలో ఇద్దరినీ పట్టుకున్న పోలీసులు.. తండ్రికి బాలుడి అప్పగింత


యువకుడితో కలిసి బైక్‌పై వెళుతున్న తల్లి

నల్లగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి కోసం ఓ మహిళ అమ్మప్రేమకు మచ్చ తెచ్చే పని చేసింది. 15 నెలల వయస్సు ఉన్న తన కుమారుడిని బస్టాండ్‌లో అనాథగా వదిలేసి ఆ యువకుడితో వెళ్లిపోయింది. నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా.. పోలీసుల అప్రమత్తతో ఆ చిన్నారి తండ్రి చెంతకు చేరాడు. నల్లగొండ టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన ఓ మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నల్లగొండలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పని చేసే యువకుడితో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. తన 15 నెలల కుమారుడితో శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి నల్లగొండ బస్టాండ్‌కు చేరిన ఆ మహిళ.. తన ఇన్‌స్టా స్నేహితుడికి ఫోన్ చేసింది. కాసేపటి తర్వాత కొడుకుని బస్టాండ్‌లోనే వదిలేసిన ఆ మహిళ.. ఆ యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లిపోయింది. తల్లి కనిపించకపోవడంతో 'అమ్మా, అమ్మా' అని ఏడుస్తూ ఆ బాలుడు బస్టాండ్‌లో తిరుగుతుండగా గమనించిన స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకుని పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. బాలుడి తల్లి ఓ యువకుడితో ద్విచక్రవాహనంపై వెళ్లిపోవడాన్ని గుర్తించారు. ఆ ద్విచక్రవాహనం నెంబర్ ఆధారంగా వాహన యజమానికి ఫోన్ చేశారు. స్నేహితుడు తన వాహనాన్ని తీసుకెళ్లాడని ఆ యజమాని చెప్పడంతో అతని వద్ద మరిన్ని వివరాలు సేకరించారు. దీంతో బాలుడి తల్లిని, ఆ యువకుడిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ మహిళ భర్తకు సమాచారం ఇచ్చి ఆదివారం పోలీసుస్టేషన్‌కు రప్పించిన పోలీసులు బాలుడిని తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. విషయాన్ని పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకుంటామని మహిళ కుటుంబసభ్యులు చేసిన వినతి మేరకు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదు.

సంతాన సాఫల్యం ముసుగులో..

శిశు విక్రయం!

(మొదటిపేజీ తరువాయి)


మీడియాతో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నమ్రత, ఆమె అక్రమాలకు సహకరిస్తున్న ఆమె కుమారుడు సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రష్మిక పెరుమాళ్.. విలేకరులకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. వేరే రాష్ట్రానికి చెందిన దంపతులు కొన్నాళ్లుగా సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడంతో.. గత ఏడాది ఆగస్టులో ఆన్‌లైన్‌లో చూసి వారిద్దరూ సికింద్రాబాద్‌లో ఉన్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు వెళ్లి అక్కడ డాక్టర్ నమ్రతను కలిశారు. వారికి రూ.66 వేల విలువైన పరీక్షలు చేయించిన ఆమె.. ఐవీఎఫ్ ద్వారా పిల్లలు పుట్టరని, సరగసీ (అంటే వీరిద్దరి వీర్యం, అండం కలయికతో ఏర్పడిన పిండాన్ని వేరే మహిళ గర్భంలో ఉంచి.. ప్రసవానంతరం పుట్టిన బిడ్డను వీరికి అప్పగించే ప్రక్రియ) ద్వారా అయితే సంతాన భాగ్యం కలుగుతుందని వారిని నమ్మించింది. అయితే అందుకు రూ.30లక్షలు అవుతుందని వారికి తెలిపింది. అందుకు అంగీకరించిన ఈ దంపతులు.. పుట్టిన బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేసి, తమ బిడ్డేనని నిరూపించి తమకు అప్పగించాలని షరతు పెట్టారు. దానికి ఆమె సరేనని రూ.15 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంది. ఒప్పందం మేరకు ఈ దంపతులు నిరుడు సెప్టెంబరులో విశాఖపట్నానికి వెళ్లి, అక్కడున్న సృష్టి ఫెర్టిలిటీ బ్రాంచ్‌లో వీర్యం, అండం ఇచ్చి వచ్చారు. ఆ తర్వాత కొద్ది రోజులకు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌వారు ఆ దంపతులకు ఫోన్ చేసి.. "అద్దెగర్భానికి ఒక మహిళ ఒప్పుకొంది. పిండాన్ని ఆమె గర్భంలో ప్రవేశపెట్టడం కూడా పూర్తయింది" అని చెప్పారు. దశలవారీగా వారివద్ద ముందు మాట్లాడుకున్న డబ్బు వసూలు చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఫోన్ చేసి.. 'సిజేరియన్ ద్వారా ప్రసవం అయింది. మీరొచ్చి మీ బిడ్డను తీసుకోండి' అని చెప్పారు. వీరు విశాఖకు వెళ్లగా.. ఆపరేషన్ ఖర్చుల పేరుతో మరికొంత డబ్బు వారి వద్ద వసూలు చేసి ఒక బాబును అప్పగించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు వారి నుంచి దాదాపు రూ.35 లక్షలు వసూలు చేశారు. ఇంతా చేస్తే.. ఆ బాబు పోలికలు తమతో సరిపోలకపోవడంతో ఆ దంపతులకు అనుమానం వచ్చి డీఎన్ఏ పరీక్ష చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె పట్టించుకోకపోవడంతో వారే ఢిల్లీలో డీఎన్ఏ పరీక్ష చేయించుకున్నారు. శిశువు వారి బిడ్డ కాదని అక్కడ తేలిపోయింది. దీనిపై వారు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం ఇవ్వకపోగా..చట్టపరంగా చర్యలు తీసుకుంటామంటూ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణ బెదిరించాడు. దీంతో ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు.

అసలు విషయం వెలుగులోకి..

మోసపోయిన దంపతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. ఆ శిశువు అసోంకు చెందిన ఒక జంట బిడ్డ అని తేలింది. హైదరాబాద్‌లో ఉంటున్న ఆ జంటను విమానంలో విశాఖకు తరలించి అక్కడే ఉంచి, పిల్లాడు పుట్టగానే వారికి రూ.80-90 వేలు చేతిలో పెట్టి, ఆ శిశువునే సికింద్రాబాద్ దంపతులకు అమ్మేసినట్టు వెల్లడైంది. డాక్టర్ నమ్రతకు తమ బిడ్డను విక్రయించిన ఆ జంటను కూడా త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. ఇలా గర్భం దాల్చి, తమ కడుపులో ఉన్న బిడ్డలను పెంచడానికి ఇష్టపడని మహిళలను, పుట్టిన బిడ్డలను అమ్మేయడానికి సిద్ధంగా ఉండేవారిని గుర్తించి.. వారి దగ్గరి నుంచి పిల్లలను కొనుగోలు చేసి.. ఆ శిశువులను... సంతాన సాఫల్యం కోసం వచ్చే దంపతులకు అమ్ముతున్న విషయం దర్యాప్తులో తమ దృష్టికి వచ్చిందని.. ఈ కేసులో బాధితులు అలాంటి ఒక జంట అని ఆమె వివరించారు. ఇలాంటి కేసులు ఇంకా ఎన్ని ఉన్నాయో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తోపాటు.. విశాఖలో ఉన్న వారి బ్రాంచ్‌పైన కూడా రెయిడ్ చేసి, ఈ కేసుకు సంబంధించిన పత్రాలు కూడా అక్కడ స్వాధీనం చేసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ కేసులో నమ్రత, ఆమె కుమారుడు జయంత్‌కృష్ణ సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు వివరించారు. డాక్టర్ నమ్రత బారిన పడి మోసపోయినవారు వచ్చి నిలదీస్తే.. "చట్టపరమైన చర్యలు తీసుకుంటామం"టూ జయంత్‌కృష్ణ బెదిరించేవాడని.. డీసీపీ తెలిపారు. అంతేకాదు.. ఈ ఫెర్టిలిటీ సెంటర్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ అతడే చూసుకుంటున్నట్టు చెప్పారు. మూడో నిందితురాలు కల్యాణిని.. విశాఖ క్లినిక్‌లో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. వీరితోపాటు.. ఈ కేసుతో సంబంధం ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ చెన్నారావు, గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న అనస్తీషియా డాక్టర్ సదానందం, అసోంకు చెందిన ధనశ్రీ సంతోషి, మహ్మద్ అలీ ఆదిక్, నస్రీన్ బేగంను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. మరో ఇద్దరు నిందితులు, చిన్నారిని విక్రయించిన ఇద్దరు దంపతులు పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు. డాక్టర్ నమ్రత రిజిస్ట్రేషన్ రద్దయినా.. ఆమె రెండు తెలుగురాష్ట్రాల్లో సంతాన సాఫల్య కేంద్రాలను నడుపుతున్నారని, అన్ని అనుమతులూ ఉన్న క్లినిక్‌లలో, నిపుణులు మాత్రమే నిర్వహించాల్సిన సంతాన సాఫల్య ప్రక్రియలనూ వీరు అక్రమంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 10కి పైగా కేసులు నమోదయ్యాయని.. ఆ కేసులపైనా దర్యాప్తు కొనసాగిస్తామని ఆమె వెల్లడించారు. కాగా..గతంలోనే సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను లైసెన్సును రద్దు చేశామని, అయినా అక్రమంగా నిర్వహిస్తున్నారని డీహెచ్ఎంహెచ్ వెంకట్ తెలిపారు. ప్రస్తుతం బాబును అమీర్‌పేట్‌లోని శిశువిహార్‌కు తరలించామని పేర్కొన్నారు.


వీర్య సేకరణకు అమాయకులను టార్గెట్ చేసే బ్రోకర్లు (పోలీసుల అదుపులో)

నగరం నడిబొడ్డున.. వీర్యం, అండాల దందా!

» హైదరాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్‌టెక్ క్లినిక్‌లో సేకరించి.. అహ్మదాబాద్‌కు తరలింపు

» డిమాండ్‌ను బట్టి డోనర్లకు రూ.4 వేల దాకా!

» పోలీసులకు సమాచారం.. ఏడుగురి అరెస్ట్

అడ్డగుట్ట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): డబ్బు ఆశ చూపించి హైదరాబాద్‌లో పురుషుల నుంచి వీర్యాన్ని, మహిళల నుంచి అండాలను సేకరించి.. అహ్మదాబాద్‌లో ఫెర్టిలిటీ సెంటర్‌కు తరలిస్తున్న ముఠాలో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. 'ఇండియన్ స్పెర్మ్‌టెక్' పేరుతో వారు నిర్వహిస్తున్న స్పెర్మ్ బ్యాంకులోని యంత్రాలు, రిజిస్టర్లతో పాటు సరగసీ అప్లికేషన్లనూ స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలోని బ్లూ సీ హోటల్‌పై అంతస్తులో ఇండియన్ స్పెర్మ్‌టెక్ క్రయోసిస్టం క్లినిక్ ఉంది. దాని యజమాని పంకజ్ సోనీ. అతడు కొంతమందిని తన వద్ద ఉద్యోగులుగా, ఏజెంట్లుగా టెక్నీషియన్‌లుగా నియమించుకున్నాడు. వారి సహకారంతో.. వయసులో ఉన్న స్త్రీ, పురుషులకు డబ్బు ఆశ చూపించి వారి నుంచి వీర్యం, అండాలను సేకరిస్తున్నారు. సేకరించిన అండాలను, వీర్యాన్ని అహ్మదాబాద్‌లోని ఒక ఫెర్టిలిటీ సెంటర్‌కు తరలిస్తున్నారు. స్పెర్మ్, అండాలు ఇస్తున్న డోనర్స్‌కు డిమాండ్‌ను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.4 వేల దాకా చెల్లిస్తున్నారు. ఈ అక్రమ దందా గురించి విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి.. స్పెర్మ్‌టెక్ మేనేజర్ పంకజ్ సోనీ, క్యాషియర్ సంపత్, ఉద్యోగులు (ఏజెంట్లు) శ్రీను, జితేందర్ కుమావత్, శివ (బ్రోకర్), మణికంఠ (బ్రోకర్), కన్సారీ బరో (ఎగ్ డోనర్)లను అరెస్టు చేశారు.

తెలంగాణ వీరుల పేరిట అవార్డులు అభినందనీయం

» తెలంగాణ కళోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

» ఎమ్మెల్సీ అద్దంకికి జయశంకర్ పురస్కారం

రవీంద్రభారతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వీరులను స్మరించుకుంటూ వారి పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ కళోత్సవం జరిపారు. ఇందులో భాగంగా తెలంగాణ సన్మాన్ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ పురస్కారం, బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చాకలి ఐలమ్మ, దరువు అంజన్నకు గద్దర్, కాసుల ప్రతాపరెడ్డికి సురవరం ప్రతాపరెడ్డి, పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ బీర్ల ఐలయ్య పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. తెలంగాణ వైతాళికులు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరముందన్న ఆయన.. పురస్కారాలు అందుకున్న వారంతా తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారని చెప్పారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, నారగోని పురుషోత్తం గౌడ్, కాలేరు సురేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తెలంగాణలో 452 పక్షి జాతులు

» ఉస్మానియా ప్రొఫెసర్ పరిశోధనలో వెల్లడి

» అంతరించిపోతున్న వాటి.. జాబితాలో రాబందు, లీస్సెర్ ఫ్లోరికాన్

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యాప్తంగా 452 జాతుల పక్షులు నివసిస్తున్నాయని, వాటిలో కొన్ని అరుదైన జాతులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చెలమల శ్రీనివాసులు తెలిపారు. హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డితో కలిసి గత 10 ఏళ్లుగా తెలంగాణ వ్యాప్తంగా చేసిన పరిశోధనల్లో ఇప్పటి వరకు 452 పక్షి జాతులను గుర్తించామని శ్రీనివాసులు తన పరిశోధన పత్రంలో పేర్కొన్నారు. వీటిలో కొన్ని అరుదైనవే కాకుండా దేశంలో తొలిసారిగా గుర్తించినవి కూడా ఉన్నాయని తెలిపారు. పక్షులు పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తాయని, కొన్ని కారణాల వల్ల భారతీయ రాబందు, లీస్సెర్ ఫ్లోరికాన్ వంటి కొన్ని జాతుల పక్షులు అంతరించి పోయే స్థితికి చేరుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి అంతరించిపోవడం పర్యావరణానికి చేటన్నారు. తెలంగాణలో మైదానాల నుంచి అడవుల వరకు, చెరువుల నుంచి గడ్డి మైదానాల వరకు వివిధ జాతులకు చెందిన పక్షులు ఆవాసం ఏర్పరుచుకున్నాయని, ఇవి కాకుండా కాలాలను బట్టి ఇతర ఖండాల నుంచి కూడా కొన్ని పక్షులు వలస వస్తాయన్నారు. హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ.. పక్షులను గమనించడం ఇష్టంగా కాకుండా పర్యావరణ ప్రాముఖ్యతతో చూడాలన్నారు. ఏళ్ల తరబడి పరిశోధన, చారిత్రక ఆధారాల పరిశీలన, స్థానికుల సహకారంతో సేకరించిన సమాచారంతో పరిశోధన పత్రాన్ని సమర్పించామన్నారు. పక్షులపై పరిశోధన పత్రాన్ని సమర్పించిన ప్రొఫెసర్ చెలమల శ్రీనివాసులు, హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డిల కృషిని ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కుమార్ అభినందించారు.

ప్రజాస్వామిక వాదులను ఏకం చేయాలి

» రాహుల్, రేవంత్ బాధ్యత తీసుకోవాలి.. పుస్తకావిష్కరణలో వక్తలు

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో భిన్నాభిప్రాయాలు, విభిన్న ఆలోచనల మధ్య నిరంతరం సంభాషణ, తద్వారా లోతైన సంఘర్షణ జరగడం ద్వారా ప్రజాస్వామ్యం మనగలుగుతుందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ ఇంటర్వ్యూలు, వ్యాసాల సంపుటి "శాంతి చర్చలు - ప్రజాస్వామిక అన్వేషణ" పుస్తకాన్ని పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అసమానతలు తీవ్రమయ్యాయని, వాటిమీద లోతైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కార్పొరేట్ల ప్రయోజనాలకు ఆటంకం కలగకూడదనే... మోదీ ప్రభుత్వం శాంతి చర్చలకు అంగీకరించడం లేదన్నారు. ప్రజాస్వామ్య విలువలతో సారూప్యం కలిగిన వారందరినీ ఒక్కటి చేయాల్సిన బాధ్యత రాహుల్, రేవంత్‌రెడ్డి మీదే ఉందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ ప్రమాణాలకు లోబడి న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలని సూచించారు. ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. యుద్ధం కంటే శాంతి ఎంతో గొప్పదని అన్నారు. ఈ పుస్తకాన్ని శాంతి చర్చల సాధనలో ముఖ్య పాత్ర పోషించిన అమరుడు ఎస్.ఆర్.శంకరన్‌కు అంకితం ఇచ్చినట్లు ప్రకటించారు.


బీజేపీలోకి వచ్చేందుకు ప్రయత్నించడం లేదు

» నా రాజీనామా ఆమోదంలో పెద్ద కుట్ర: ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తాను మళ్లీ బీజేపీలోకి రావడానికి ప్రయత్నిస్తున్నానని, అమిత్ షా తనకు ఫోన్ చేశారని జరుగుతున్న ప్రచారం నిజం కాదని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. తన రాజీనామాను అధిష్ఠానం ఆమోదించడంలో పెద్ద కుట్ర జరిగిందన్నారు. కొంత మంది దొరలు తన గురించి తప్పుడు సమాచారాన్ని ఢిల్లీ పెద్దలకు పంపారని ఆరోపించారు. తెలంగాణ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, బీజేపీకి ఎవరి వల్ల నష్టం జరిగిందో కేంద్రం పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని అనుకుంటున్నానని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మంచి రైటర్ అని.. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే ఫైటర్ కావాలని రాజాసింగ్ పేర్కొన్నారు. తాను పదకొండేళ్లుగా పార్టీలో ఉన్నానని, మూడోసారి గెలిచినప్పటికీ మొదట ఎక్కడ ఉన్నానో ఇప్పుడూ అక్కడే ఉన్నానని తెలిపారు. చాలా బాధతో పార్టీని వీడానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై అధిష్ఠానం ఐబీతో నివేదిక తెప్పించుకోవాల్సిన అవసరముందన్నారు.

ఇట్లుంటది కొడంగల్ యంగ్ ఇండియా స్కూల్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నమూనా ఇది. భవనాలు, క్రీడా మైదానాలు అన్ని రకాల హంగులతో కొడంగల్‌లో ఇలాంటి నిర్మాణమే జరగనుంది. ఈ నమూనాను సచివాలయంలోని ఆరో అంతస్తులో సందర్శకుల కోసం ఏర్పాటు చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 78 సమీకృత గురుకుల భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. వీటికి అవసరమైన రూ.15,600 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చింది. మొదటి దశలో కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లో నిర్మాణాలు జరుగుతాయి

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

ప్రైవేటు వైద్య కాలేజీలపై

విజిలెన్స్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం ఇవ్వగా, మరో నాలుగు కాలేజీలు వివరాలేవీ ఇవ్వలేదు. అయితే కొన్ని కాలేజీలు తప్పుడు సమాచారం ఇచ్చినట్టుగా గుర్తించామని వైద్యవర్గాలు తెలిపాయి. ఉదాహరణకు ఓ ప్రైవేటు కాలేజీ బోధనాస్పత్రిలో ఏడాదికాలంలో 4 లక్షల ఓపీ నమోదైనట్టు పేర్కొన్నారు. అందులో 70 వేలు మాత్రమే అబా (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) రిజిస్ట్రేషన్ చేసినట్టు చూపారు. కానీ ఇందులో సగం ఓపీ నకిలీయేనని వైద్యవర్గాలు తెలిపాయి. మరో కాలేజీలో గైనకాలజీ విభాగం లేకపోయినా కూడా పెద్ద సంఖ్యలో డెలివరీలు జరుగుతున్నట్టు చూపారని వెల్లడించాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు తెలిపాయి. వాస్తవానికి ప్రైవేటు కాలేజీలపై రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ పెద్దగా ఉండదు. పర్యవేక్షణ అంతా జాతీయ వైద్య కమిషన్ చూసుకుంటుంది. కొత్త వైద్య కాలేజీల ఏర్పాటుకు ముందు, సీట్ల పెంపు, కొత్త కోర్సులకు అనుమతుల కోసం.. ప్రభుత్వం ఇచ్చే 'ఎసెన్షియాలిటీ' సర్టిఫికెట్, ఆరోగ్య యూనివర్సిటీ ఇచ్చే 'అనుబంధ గుర్తింపు (కన్సెంట్ ఆఫ్ అఫిలియేషన్) అవసరం. మరే సందర్భాల్లోనూ ప్రభుత్వ జోక్యం ఉండదు. దీనితో ప్రైవేటు వైద్య కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలని మెడికోలు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.